ప్రజాశక్తి

Vol. 1, no. 339

(Nov. 17, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 339

(Nov. 17, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd No 4486 · 16 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 17–11–46 ఆదివారం [సంచిక 339

ఈ సంచికలో

కొచ్చిన్ విద్యార్థులపై పోలీసు లాఠీచార్జి

అభివృద్ధినిరోధకులతో పోరాటం సాగించాలి

భండారి ఉపన్యాసం

లండన్, నవంబరు 15

నెహ్రూ 57 వ జన్మదినోత్సవంలో ఇండియా లీగు ఒకసభ జరిపింది. డాక్టర్ భండారి అధ్యక్షత వహించారు. ప్రఖ్యాత విజ్ఞానవేత్త జె. బి. యస్. హాల్డేన్ ఇలా ఉపన్యసించారు.

"బ్రిటిష్ ప్రజలు తమ వాగ్దానాలు నిలుపుకొని భారతదేశంస్వతంత్రమయ్యేట్టుచూడాలి. ప్రజాస్వామ్యము సామ్రాజ్యవాదం కలిసి పనిచేయలేవు. బ్రిటిష్ ప్రభుత్వం, భారత సైన్యాన్ని విదేశాలలో ప్రజాఉద్యమాలపై పోలీసులనుగా ఉపయోగిస్తున్నది. ఇలాంటి సంఘటనలు బ్రిటన్‌కేకాక భారతదేశభవిష్యత్తుకే ప్రమాదకరంగా పరిణమించగలవు."

డాక్టర్ భండారి ఇలా అన్నారు:

"మతకలహాలన్నీ అభివృద్ధి నిరోధక వర్గాల కలయికవల్ల కలుగుతున్నాయి. చర్చిల్, స్మట్సులాంటి అభివృద్ధి నిరోధక వర్గాలు అభ్యుదయ శక్తులపై ప్రపంచమంతటా పోరాటం సాగిస్తున్నవి. మీ అభివృద్ధి నిరోధకులతో మీరు పోరాడండని బ్రిటిష్‌ప్రజలనుకోరుతున్నాను. మా దేశంలోని అభివృద్ధినిరోధకులతో మేం పోరాటం సాగిస్తాము."

అమెరికాలో న్యూయార్కు పట్టణంలో జరిగిన జన్మదినోత్సవసభలో కృష్ణమీనన్ మాట్లాడుతూ, "వర్సైల్సు, జెనీవాలలో బ్రిటిష్ జోహుకుంవాలాలు భారతదేశ ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఇప్పుడిలాకాదు. మేం స్వతంత్రంగా వ్యవహరిస్తాం. పరాధీనప్రజల స్వతంత్రంకోసం పోరాడుతాం," అన్నారు.

నెహ్రూను కొనియాడుతూ చాలమంది ఉపన్యసించారు.

మద్రాసు హార్బరు కార్మికుల విజయం

మద్రాసు, నవంబరు 15

ఈవేళ కార్మిక ప్రతినిధులకు, యజమానులకు మధ్య జరిగిన సంప్రతింపుల ఫలితంగా హార్బరు కార్మికుల సమ్మె ముగిసింది. కార్మికులకు పగలు రు 1-8-0 నుంచి రు 2-0-0 లకు; రాత్రి రు 1-12-0 నుంచి రు 2-4-0 కు, కూలి హెచ్చించడానికి యజమాను లంగీకరించారు.

యు. పి. లో 400 కార్మికుల విడుదల

లక్నో, నవంబరు 14

లోగడ యు. పి. రాష్ట్రంలో పి.డబ్ల్యు.డి. కార్మికుల సమ్మె సందర్భంలో పోలీసులు 400 మంది సమ్మెదార్లను అరెస్టు చేశారు. ఇప్పుడు వారిని విడుదల చేయడానికి యు.పి. ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసింది.

8 మంది అరెస్టు

విద్యార్థుల అసమ్మతి ప్రదర్శనలు

(మా విలేఖరి)

కాలికట్, నవంబరు 14

అఖిలకేరళ స్టూడెంట్సు ఫెడరేషన్‌వారు తిరువాన్కూరు ప్రజలకు సహాయం చేయడానికై పంపిన బట్టు దక్షిణమలబారు పర్యటనం ముగించుకొని, నవంబరు 11 నాటికి త్రిచూర్ (కొచిన్) చేరారు. ఆ రోజునే స్థానిక అధికారులు త్రిచూర్‌లో 15 రోజుల వరకు ఏ విధమైన ప్రదర్శనాలూ జరుపగూడదని నిషేధించారు. స్థానిక విద్యార్థులు నిర్భయంగా పెద్దవూరేగింపు, బహిరంగసభ జరిపారు. ఏ విధమైన హెచ్చరిక లేకుండా పోలీసులు లాఠీఛార్జి చేశారు. చాలమంది గాయపడ్డారు. 8 గురిని అరెస్టుచేశారు. గాయపడినవారిలో మహాకవి వల్లత్తోల్ కుమారుడు కూడా వున్నాడు. విద్యార్థులు పోలీసులను ఎదిరించారు. డివిజనల్ ఇన్స్పెక్టరుకు గాయాలు తగిలాయి.

12 వ తేదీన త్రిచూర్‌లోని సెయింట్ థామస్ కాలేజీ విద్యార్థులు హర్తాళ్‌చేసి పెద్ద బహిరంగసభలో ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండించారు. సభవద్ద 100 మంది రిజర్వు పోలీసులు కావలా నిలబడ్డారు.

ఎర్నాకులంలో హర్తాళ్

త్రిచూర్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జికి అసమ్మతిగా నవంబరు 12న ఎర్నాకులంలో విద్యార్థులు హర్తాళ్ జరిపారు. స్టూడెంట్ కాంగ్రెస్‌వారు పెద్ద ఊరేగింపు జరిపారు. వారు "అధికారం చేపుంచే కాంగ్రెస్ మంత్రులు రాజీనామా నివ్వండి" అని నినాదాలను ఇచ్చారు. హుజూర్ ఆఫీసుకు ఎదురుగా పెద్దబహిరంగసభ జరిగింది. కొచిన్‌లో ఏర్పడ్డ బాధ్యతాయుత ప్రభుత్వానికి ఏమన్నా బాధ్యత వుందా? మహారాజు యిచ్చిన 'సంయుక్త కేరళ' నినాదం ఫలితం ఇదేనా?— అంటూ తీవ్రంగా ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ తీర్మానాలు చేయబడ్డాయి.

పుదుక్కోటలోకూడా

పుదుక్కోట హైస్కూలువిద్యార్థులుకూడా హర్తాళ్ జరిపారు. ప్రదర్శనాలు జరిగినాయి.

మలబారులో ఆహారోత్పత్తికి ఆటంకాలు

రైతునాయకుని అరెస్టు

కాలికట్, నవంబరు 14

మలబారులోని 'మంగత్ పరంబా' గ్రామ పరిస్థితులను చూచివచ్చిన మద్రాస్ ఎసెంబ్లీ సభ్యులు కె. ఆనందనంబియార్ పత్రికలకు ఈ దిగువ ప్రకటన నిస్తున్నారు:

"మలబారులో ఆహార పరిస్థితి చాలా విషమంగా వుంది. 1943 బెంగాల్ పరిస్థితులు 1946 లో మలబారులో ప్రత్యక్ష మయ్యేలాగ వున్నాయి.

"మంగత్ పరంబాలో 300 ఎకరాల పోరంబోకు వుంది. ఆ గ్రామంలోని రైతులు పోరంబోకులోని 22 ఎకరాలలో కర్ర పెండలం (16 వేల మొక్కలు పెరుగుతున్నాయి) కంది మొదలైన పైరు చేశారు. అధిక పంటలు కావాలంటూన్న మద్రాసు మంత్రివర్గం, తాత్కాలిక ప్రభుత్వంకూడా ఈ విషయంలో రైతులను అభినందించాలి. కాని, అనధికారంగా పోరంబోకు నాక్రమించారని రైతులను ప్రకాశంమంత్రివర్గం బెదిరించడమేగాక, నిర్బంధ చర్యలకుకూడా పూనుకుంటూంది. మంగత్‌పరంబా ప్రాంతంలో మలబార్ స్పెషల్‌పోలీసులను పెట్టారు. ఇక్కడ వ్యవసాయం చేస్తూన్న రైతులనాయకుడు కామ్రేడ్ రాయరప్పన్‌ను అరెస్టుచేశారు. మాజిస్ట్రేటుకూడ దగ్గరవుండి ఈ పనులు చేయిస్తున్నాడు.

"రైతాంగం ప్రభుత్వానికి పన్నులు చెల్లించడానికి సిద్ధంగావున్నారు. వారు నాటినపంట వారిని కోసుకోనివ్వాలి. మలబార్ పోలీసులను వెంటనే తొలగించాలి. లేకుంటే పరిస్థితులు విషమంకావడానికి అవకాశంవుంది.

"పేదరైతులకు సహాయపడేటట్లు కాంగ్రెసు ప్రభుత్వంమీద ఒత్తిడి తేవలసిందిగా ప్రజలను కోరుతున్నాను."

హిందూ వివాహచట్టం సవరణ బిల్లు

న్యూఢిల్లీ, నవంబరు 15

దేశముఖ్ అసెంబ్లీలో హిందూ వివాహ చట్టానికి సవరణ బిల్లు తెచ్చాడు.

హిందూ పద్ధతిలో వివాహం జరిగినప్పటికి కూడ, ఆ వివాహాన్ని రిజిష్టర్ చేసుకోవడానికి ఈబిల్లుఅవకాశమిస్తుంది. దీనివల్లకలిగే లాభాలనుగూర్చి దేశముఖ్‌గారిలా అన్నారు:

"పురుషునితోపాటు స్త్రీలకు సమాన హక్కుల కల్పించడమే దీని ఉద్దేశం. భార్యా భర్త లిద్దరు తమ వివాహం సౌఖ్యదాయకంగా లేదనుకున్నప్పుడు, విడాకులు తీసుకొనేందుకు హక్కుండాలి." హిందూ వివాహంలో విడాకులు పుచ్చుకునేందుకు వీల్లేదు. రిజిష్టర్ చేసుకుంటే ఆ హక్కు వస్తుంది.

అసెంబ్లీలో కార్మిక తగాదా బిల్లు

కార్మిక సభ్యులంతా వ్యతిరేకించారు

ఢిల్లీ, నవంబరు 14

కేంద్ర శాసనసభలో మొట్టమొదటసారి, కార్మిక తగాదాబిల్లుపై వోటింగు తీసుకోబడింది. కార్మికుల తరపున నామినేటుచేయబడిన సభ్యులు నలుగురు — ఎన్. ఎం. జోషి, అఫ్తబాలీ, గురుస్వామి, మణిబెన్ కారా— నిమ్నజాతిప్రతినిధి డాక్టర్ సోలంకి, బిల్లుకు వ్యతిరేకంగా వోటుచేశారు.

ప్రభుత్వప్రతినిధి జగ్‌జీవన్‌రామ్ ఈవేళ అసెంబ్లీలో మూడవసారి కార్మిక తగాదా బిల్లును ప్రవేశపెట్టారు. ఎన్. ఎం. జోషి, బిల్లును ప్రజాభిప్రాయం తెలుసుకొనేటందుకు వాయిదా వేయమని కోరుతూ సవరణ ప్రతిపాదించారు.

అఖిలభారత నావికుల సంఘ నాయకుడు అఫ్తబాలీ యిలా ఉపన్యసించారు: "ఈబిల్లు కార్మికుల సమ్మెహక్కును నాశనం చేస్తుంది. ఈ హక్కును ఏ ప్రజాతంత్ర ప్రభుత్వము అపహరించకూడదు. కార్మికులు తమ హక్కులను సాధించుకోడానికి సమ్మె హక్కు ఒక బలమైన సాధనం, దాన్ని లాక్కుంటే, కార్మికుల్ని నిర్వీర్యం చేసినవారమవుతాం. యజమానులకూ - కార్మికులకూ సత్సంబంధాలు ఉండాలని మీరు కోరితే అందుకు యిది మార్గం కాజాలదు. దేశంయొక్క సహజ సంపదను ప్రభుత్వపరం చేసుకోండి. లాభాల పద్ధతిని నిర్మూలించండి. ఒక మానవుడు మరొక మానవుని దోచుకొనే పద్ధతిని అరికట్టండి. కార్మికులకు కనీస జీవితభృతిని గ్యారంటీచేసే చట్టం మీరొకటైనా తీసుకొచ్చారా? యజమానుల లాభాలను అరికట్టడానికి ఏమైనా చర్యతీసుకున్నారా? కార్మికోద్యమాన్ని నాశనంచేయుటకే మీరీబిల్లును తీసుకొచ్చారు."

దక్షిణాఫ్రికాభారతీయులు

న్యూఢిల్లీ, నవంబరు 15

ఢిల్లీఅసెంబ్లీలో కొన్నిప్రశ్నలకు పండిత నెహ్రూ ఇలా సమాధానమిచ్చారు.

"1855 లో కేప్‌రాష్ట్ర గవర్నరు, భారత ప్రభుత్వానికి భారతకార్మికులను నెటాల్‌కు పంపమని రాశాడు. కార్మికుల సౌకర్యాలను గూర్చికూడఅందులోకొన్నివాగ్దానాలున్నాయి. ఈ పాత రికార్డును మిత్రరాజ్యసమితికి భారతదేశ ప్రతినిధులు తీసుకొనివెళ్ళారు."

అస్సాం తెల్లయజమానిదౌర్జన్యం

"అస్సాం తేయాకు తోటల కార్మికుల స్థితిగతులు విచారిస్తాము. వల్లిక్ తేయాకు తోటలో 3 నెలల క్రితం, తెల్ల యజమాని ఒక కార్మికుని కాల్చిన విషయమై రిపోర్టు పంపమని అస్సాం ప్రభుత్వాన్ని కోరాము."

స్మట్సు దురాక్రమణ వాంఛపై ఖండన పరంపర

దక్షిణాఫ్రికా, నైరుతి ఆఫ్రికా సమస్యలు మిత్రరాజ్య మహాసభ ఎదుటికి రాగానే, సామ్రాజ్యవాదుల వేషభాషలు బట్టబయలవుతూంది. దీనినిభూర్తావరణంలో ఇండియా సోవియటు ప్రతినిధులు ప్రధానపాత్ర నిర్వహిస్తున్నారు.

నైరుతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికాలో కలిపివేయాలని స్మట్సు ధర్మకర్తృత్వ కమిటీలో ప్రతిపాదించాడు. దీనిని ఇండియా ప్రతినిధి సర్ మహారాజసింగ్ మొట్టమొదట ఖండించాడు. సోవియటు ప్రతినిధి నోవికోవ్, ఈ ప్రతిపాదనను ఖండించడమే కాకుండా, బ్రిటిష్ మాండేటరీ పాలన క్రింద ఉన్న పాలస్తీనా సమస్యనుకూడా మిత్రరాజ్య సమితి ఎదుటికిలాగాడు. నవంబరు 11 వ తేదీన మాట్లాడుతూ నోవికోవ్ ఇలాఅన్నాడు.

"శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశం జరిగి సంవత్సరం పైన అయినా మాండేట్లను పరిపాలించుతున్న దేశాలు ఇదివరకటి మాండేట్లను గురించి ముసాయిదాలను తయారు చేయలేదు. అందుచే ఈ ఆలస్యానికి బాధ్యత వారిదే. ఈ ఎసెంబ్లీలోనే ధర్మకర్తృత్వ కౌన్సిల్‌ను ఏర్పర్చాలని సోవియటు పట్టుబడుతుండ, టాంగన్యీకా, టోగోలాండ్‌ల గురించి బ్రిటన్ ముసాయిదాలను తయారుచేసింది. కాని పాలస్తీనాను గురించి ఏమీ చెయలేదు.

పాలస్తీనా సమస్యను మిత్రరాజ్యసమితికి అప్పగించాలి

"పాలస్తీనా సమస్యను, అమెరికాతోను, యూదు నుతాలతోను, అరబ్బు ముఠాలతోను, చర్చించి పరిష్కరించాలని బ్రిటన్ ప్రయత్నించుతున్నదనుట సుస్పష్టం. ఇలా మిత్రరాజ్యసమితిని విడిచిపెట్టి వేరే రాయబారాలు కొనసాగించి పరిష్కరింప జూడటం మిత్రరాజ్య ప్రణాళికకు విరుద్ధం. పాలస్తీనా భవిష్యత్తును గాలిలో వదలివేయడానికి వీలులేదు. పాలస్తీనాకు స్వాతంత్ర్యమైనా ఈయుండి. లేదా మిత్రరాజ్య ప్రణాళిక ననుసరించి దానిని మిత్రరాజ్య ధర్మకర్తృత్వం క్రిందకైనా తీసుకురండి. మరో మార్గం లేదు."

నైరుతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికాలో కలపాలన్న సూచనను ఖండించుతూ నోవికోవ్ ఇలా అన్నాడు.

నైరుతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికాలో కలుపుకోరాదు

"ఈ కోరిక మిత్రరాజ్య ప్రణాళికను బాహాటంగా ఉల్లంఘించడమే. నైరుతిఆఫ్రికా ప్రజలే దక్షిణాఫ్రికాలో కలియడానికి ఇష్టపడుతున్నట్లు స్మట్సు ప్రభుత్వం ప్రకటించింది. ఇది మాండేట్ ఆధీనంలోని ప్రజల అభిప్రాయమంటూ కల్పించి ప్రదర్శించబడిన తతంగం" అంటూ నోవికోవ్ దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని ఇంకా ఇలా ఖండించాడు.

"మిత్రరాజ్యసమితి ప్రణాళికను ఉల్లంఘించిన చర్యను. దక్షిణాఫ్రికా కప్పిపుచ్చుకోడానికే ఇలా చేస్తోంది. దక్షిణాఫ్రికా యొక్క ఈ కోర్కెను ఎవరూ అంగీకరించరని నా విశ్వాసం. ఈ కోరిక ధర్మకర్తృత్వ సిద్ధాంతానికే విరుద్ధం అందుచే దీనిని తిరస్కరించాలి."

ఇంతవరకు వచ్చిన ధర్మకర్తృత్వపు ఒడంబడిక ముసాయిదాలన్నీ దాదాపు మిత్రరాజ్య ప్రణాళికను ఉల్లంఘించుతున్నాయన్నాడు. "స్వతంత్ర పరిపాలనకు దారితీసే ధర్మకర్తృత్వ పరిస్థితులను కల్పించడానికి బదులు ఇందుకు పూర్తిగా వ్యతిరేకసూచనలు వైవాటిలో కల్పించుతున్నాయి. పూర్వపు మాండేట్లను తమ ప్రభుత్వాలలో మిళితం చేసుకోవాలనే కోరిక కన్పడుతోంది," అని నోవికోవ్ అన్నాడు.

ధర్మకర్తృత్వ ఒడంబడిక ముసాయిదాలను తిరస్కరించడాన్ని సోవియటు వ్యతిరేకించిందనడం అసత్యమని అన్నాడు. "ప్రస్తుత విషమ పరిస్థితికి బాధ్యత వహించవలసిన బ్రిటన్ ఆ తప్పును మరొకరి మీదకు త్రోసింది" అని నోవికోవ్ బ్రిటిష్‌ప్రచారాన్ని ఖండించాడు.

మిత్రరాజ్యసమితిలో సోవియట్, ఇండియా ప్రతినిధుల నిశితవిమర్శ

ఖండన పరంపర

యుగోస్లావియా, పోలెండు, యుక్రైన్, బైలోరష్యా, మెక్సికో, డెన్మార్కు, ఫ్రాన్సు, సిరియా మొదలైన దేశాల ప్రతినిధులందరూ స్మట్సు ప్రతిపాదనను ఖండించారు. ఇలా ఎక్కువమంది వ్యతిరేకించుతున్నదానిని సమర్థించడానికి ముఖంచెల్లక అమెరికాకూడా వ్యతిరేకించింది.

బ్రిటన్ వైఖరి

ఒక్క బ్రిటనే స్మట్సుని బలపరచింది. స్మట్సుని బలపరచడమేకాదు, పాలస్తీనాపై తన పెత్తనాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోడానికి ప్రయత్నించింది. "మాండేటరీ దేశాలను మిత్రరాజ్య ధర్మకర్తృత్వంకిందికి తెచ్చితీరాలన్న సూత్రంలేదు. అది మాండేటరీ ప్రభుత్వపు ఇష్టంపై ఆధారపడిఉంది" ని బుకాయించాడు.

తనపై విమర్శలకు జవాబు చెబుతూ స్మట్సు, తనపాలనలో అంతాస్వర్గతుల్యంగా ఉన్నట్లు చిత్రించాడు. ఆఫ్రికా జాతివారికి తన ప్రభుత్వం స్వపరిపాలనాధికారం కూడా యిచ్చేసిందన్నాడు. ప్రజాస్వామిక పద్ధతుల్లో శాసనసభలను ఏర్పాటుచేశారట. నల్లవారి విద్యాభివృద్ధికి తెల్లవాళ్లు పన్నుల రూపంగా అపారధనాన్ని ఇస్తున్నారట. ఇలాంటి దక్షిణాఫ్రికాలో కలిసిపోడానికి నైరుతి ఆఫ్రికాప్రజలే ఉవ్విళ్ళూరుతున్నారట. తన తీర్మానాన్ని అంగీకరించకపోతే, నైరుతి ఆఫ్రికాను మునుపటిలాగానే తన మాండేటరీ పాలనక్రిందే ఉంచుకుంటాడట అంతేకాని, మిత్రరాజ్యసమితికి అప్పగించనని ఖచ్చితంగా చెప్పాడు.

స్మట్సు వాదనలను ఇండియా ప్రతినిధి చీల్చి చెండాడాడు

స్మట్సు ఉపన్యాసానికి జవాబుచెబుతూ ఇండియా ప్రతినిధి సర్ మహారాజసింగు ఇలా అన్నాడు:

"తన ప్రతిపాదనపై ఖండనను ఒక ఆసియాదేశ ప్రతినిధి (నాసే) ప్రారంభించినందుకు స్మట్సుగారికి వళ్ళుమండి ఉంటుంది. పాపం. ఒక్క బ్రిటన్‌తప్ప ఇతనిని మీరెవ్వరూ బలపరచలేదు. అతనిస్థితి జాలి కలిగిస్తూంది. బ్రిటన్‌తో ఏలాంటి సంబంధం లేకుండా, తమదేశం స్వతంత్ర రిపబ్లిక్ కావాలని దక్షిణాఫ్రికా జాతిప్రజలు ఆందోళన చేస్తున్నారు. వీరిని తమకింద ఉంచుకోడానికి బ్రిటన్‌కు స్మట్సు అత్యవసరమయి ఉండవచ్చు." అన్నాడు.

దక్షిణాఫ్రికాలో కలిసిపోవడం గురించి నైరుతి ఆఫ్రికా ప్రజల అంగీకారాన్ని తెలుసుకున్నామని స్మట్సు చెప్పినమాట నమ్మరాదని ఖండిస్తూ ఇలా అన్నాడు.

"మొదట జర్మనీ, తరువాత దక్షిణాఫ్రికాలక్రింద 50 ఏళ్ళ పాశిస్టు పరిపాలనలో, అక్కడి స్వదేశస్థులలో విద్యావంతులు, ఈనాటికీకూడా ఎవ్వరూ లేరనే చెప్పవచ్చు. ఈసంవత్సరంలో, సోవియటు ప్రభుత్వం, తన పాలనలోవున్న ఆసియా ప్రదేశాల విద్యాభివృద్ధికి చేసిన కృషిని అందరూ ప్రాయంగా ఎత్తిచూపారు తప్పను.

"మరొక విషయం. నైరుతి ఆఫ్రికాలోని ప్రభుత్వోద్యోగుల పేర్ల జాబితాను దక్షిణాఫ్రికా ప్రభుత్వమే ప్రకటించింది. దీనిలో ఆఫ్రికా జాతి వారి పేరు ఒక్కటికూడా లేదు. ఈ పరిస్థితుల్లో, అక్కడి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొన్నామంటే ఎవరు నమ్మగలరు? 1922 లో నైరుతి ఆఫ్రికా ప్రజలు స్వాతంత్ర్యంకోసం జరిపిన పోరాటాన్ని బాంబులు కురిపించి అణచింది ఈ దక్షిణాఫ్రికా ప్రభుత్వమేఅన్న విషయాన్ని ప్రపంచము ఇంకా మరచిపోలేదు.

ముప్పాతికవంతు జనాభాకు ముప్పయ్యోవంతు ప్రాతినిధ్యం

"దక్షిణాఫ్రికా శాసనసభలను గురించి స్మట్సు పేర్కొన్నాడు. ఏమి ఖం పెట్టుకొని ఈ విషయాన్ని ఉదహరించగలిగాడో నాకు ఆశ్చర్యంగా ఉంది. అక్కడి శాసనసభ సభ్యత్వం మొత్తం 240 దీనిలో జనాభాలో ముప్పాతికవంతు అయిన ఆఫ్రికా స్వదేశస్థులకు ప్రాతినిధ్యం 7 స్థానాలు మాత్రమే (సుమారు ముప్పయ్యోవంతు) యీ ప్రతినిధులు కూడా యూరోపియనులే ఉండాలి. ఆ దేశస్థులు పనికిరారు. ఈ విధంగా ఎన్నుకోబడిన సభ్యుడు బాస్నర్ కూడా స్మట్సు ప్రతిపాదనను తీవ్రంగా ఖండించాడు.

"ఆఫ్రికా జాతుల విద్యాభివృద్ధికి ఎంతో శ్రద్ధతీసుకుంటున్నామని స్మట్సు అన్నాడు. దక్షిణాఫ్రికాలో ఉన్న 22½ లక్షల యూరోపియన్ల విద్యాసౌకర్యాలకు స్మట్సు ప్రభుత్వం 70 లక్షల పౌన్లు ఖర్చుపెడుతూంది. కాని, అక్కడి 70 లక్షల ఆఫ్రికా జాతివారికిచ్చేది 9 లక్షల పౌన్లు మాత్రమే. ఆఫ్రికా జాతుల కోసం ఏర్పరచిన విద్యాసౌకర్యాలు ఎందుకూ పనికిరానివిగా ఉన్నాయని 1943 లో ఈ ప్రభుత్వం నియమించిన కమిటీయే ఒప్పుకుంది.

స్మట్సుకి సవాల్

"స్మట్సుకి నేనొక సవాల్ చేస్తున్నాను. ఇద్దరు యూరప్ దేశస్థులు, ఇద్దరు అమెరికన్లు, ఇద్దరు ఆసియా దేశస్థులు, ఇద్దరు ఆఫ్రికాదేశస్థులు గల పరిశీలనసంఘాన్నొక దానిని దక్షిణాఫ్రికాకు వెళ్ళనివ్వమనండి. వారువచ్చి ఏమిచెబుతారో వినండి".

దక్షిణాఫ్రికాలోని స్వదేశస్థులను సరిసమానంగా చూస్తున్నామని స్మట్సు చెప్పిన మాటలను అపహాస్యం చేస్తూ సర్ మహారాజసింగ్ ఇలా అన్నాడు.

"అలాగయితే, దక్షిణాఫ్రికా ప్రతినిధి వర్గంలో ఒక్క ఆఫ్రికా దేశస్థుడుకూడా లేడేమి?

"మా భారతదేశంలో అంటరానితనం మొదలైనకుళ్లను కడిగివేయడానికి ఎన్నాళ్ళనుండో దీక్షతో కృషిచేస్తున్నాం. కాని, దక్షిణాఫ్రికాలో స్మట్సు ప్రభుత్వం ఈనాడు కూడా జాతివిద్వేషను శాశ్వతం చేయడానికే ప్రయత్నిస్తూంది.

కాలదోషం పట్టిన వ్యవస్థ

"ఇలాంటి ప్రభుత్వం ఏ దేశంమీద కూడా ధర్మకర్తృత్వానికి తగదు.

"1946 లో 'అట్లాంటిక్ చార్టరు' గురించి మాట్లాడుతూ స్మట్సు ఇలా అన్నాడు. 'పాత వ్యవస్థ అంతరించిపోతూంది. నే నేకాలానికి చెందినవాడినో ఆ కాలం గతించిపోయింది' అతను అక్షరాలా సత్యం పలికాడు. ఒక్క దక్షిణాఫ్రికాలోనేకాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ ఇలాంటివాళ్ళ రోజులు గతించిపోయాయి."

రేషన్‌డిపోల్లో ధాన్యం లేదు

1500 మంది సత్తెనపల్లి ప్రజల ఆకలియాత్ర

సత్తెనపల్లి, నవంబరు 14

సత్తెనపల్లితాలూకాలో రేషన్ డిపోలకు జొన్నలు యింతవరకు రాలేదు. ప్రజలంతా పస్తులతో బాధపడుతున్నారు. 11 వ తేదీన జిల్లా కలెక్టర్‌కు టెలిగ్రాంద్వారా పరిస్థితులు తెలియచేయబడ్డాయి. జిల్లా కలెక్టర్ సత్తెనపల్లి వచ్చాడు. 13 వ తేదీ ఉదయానికి ప్రతిపేటలోని రైతులు, వ్యవసాయకూలీలు చేనేత పారిశ్రామికులు, ఫ్యాక్టరీ వర్కర్లు, మహమ్మదీయులు, తాపీ పనివారు "వెంటనే ధాన్యం కావాలి, రేషన్ పెంచాలి" మొదలైన వినాదాలతో 1500 మంది కలెక్టరు వద్దకు వెళ్ళారు. వడ్డవల్లి ఫుడ్‌కమిటీ వారు. స్థానికనాయకులు పరిస్థితులు కలెక్టరుకు సాకల్యంగా చెప్పారు. కలెక్టరు సావధానంగా విని వెంటనే ధాన్యం తెప్పించే ఏర్పాటు చేస్తామనీ, వడ్డవల్లి 9, 10, 11 వార్డులు, సత్తెనపల్లి ముస్లిం రేషన్‌కార్డులకు ఆహారపదార్థాల కోఆపరేటివ్ స్టోర్సు ద్వారానే అందిస్తామనీ, కాయకష్టము చేయువారికి 16 ఔన్సుల రేషన్ యిప్పిస్తామనీ చెప్పారు.

ప్రజలంతా ఉత్సాహంతో ఇండ్లకువెళ్లారు. ఈరోజు చుట్టు గ్రామాలప్రజలు తండోపతండాలుగా కలెక్టరుగారివద్దకు రేషన్ సక్రమంగా అందటంలేదని చెప్పుకోవడానికి వస్తున్నారు.

కరణం దొంగ రిపోర్టులు

యర్రగుంట్లపాడు, నవంబరు 13

సత్తెనపల్లి తాలూకా యర్రగుంట్లపాడు రేషన్‌డిపోలో 2 వారాలనుండి ధాన్యంలేదు. ప్రజలు తిండికిలేక యితరగ్రామాల వెంబడి బ్లాకుమార్కెట్టులో రూపాయకు 2 సేర్ల బియ్యం. 3 సేర్ల జొన్నలు చొప్పున తెచ్చుకుంటున్నారు. కొందరకవికూడ దొరకడంలేదు.

మొదట్లో యిక్కడ రేషన్‌డిపోలో దొంగమార్కెట్టువలన గ్రామకరణానికి చాలా లాభించేది. అందుపై ప్రజలు ఆందోళన చెయ్యగా అధికార్లు అడిపో రద్దుచేసి కొత్త డిపో యిచ్చారు. గ్రామ యువజన సంఘం యాజమాన్యాన ఈడిపో సక్రమంగా నడుస్తోంది. ఇప్పుడు కరణం ఈ గ్రామంలో డిపో అక్కరలేదనీ, కూలీలంతా ధాన్యమే తెచ్చుకుంటున్నారనీ. డిపోలో ధాన్యం దుర్వినియోగమవుతోందనీ రిపోర్టు పంపాడు. ఆ రిపోర్టును అంగీకరిస్తున్నట్లుగా ఆహారకమిటీ సభ్యుల వంతకాలు తానే ఫోర్జరీ చేసినట్లుకూడ తెలుస్తోంది.

ఇతరదేశాల్లో లక్షమంది భారతసైనికులు

సామ్రాజ్య రక్షణకు ఉపయోగపడుతున్నారు

వెంటనే వారిని నెహ్రూ వెనక్కు రప్పించాలి

ఫ్రాన్సు, యూరోజుల మనం చూచేదృశ్యం ఏమిటి?

బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రయోజనాల రక్షణకై ఈనాడు 1,09,500 భారత సైనికులు ఇండొనేషియా, బర్మా, మలయా, ఇండోచైనా, హాంగ్‌కాంగ్, ఇరాక్ దేశాల్లో ఉన్నాయి.

ఇండొనేషియన్ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నాశనం చేయడానికి వచ్చి, బ్రిటిషు సామ్రాజ్యవాదులు గత 15 నెలలుగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భారత సేనలు సామ్రాజ్యవాదుల చేతుల్లో ఒకసాధనంగా ఉపయోగింప బడుతున్నాయి. మన భారతజాతి కింతకూ యిది తలవంపు.

ఇండొనేషియన్ ప్రజల స్వాతంత్ర్యానికి వెన్నుపోటు

ఇండొనేషియన్ ప్రజలు జపాన్ పరిపాలకుల్ని తరిమికొట్టి సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటించిన 6 వారాల తర్వాత, 1945 సెప్టెంబరు 29 వ తేదీని, భారత సేనలు జావా ప్రవేశించాయి. 70,000 మంది భారత పుత్రులు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వుత్తరువుల ననుసరించి ఇండొనేషియన్ ప్రజల స్వాతంత్ర్యాన్ని వెన్నుపోటు పొడిచారు.

బ్రిటిష్ బాంబర్ల సహాయంతో బ్రిటిష్ యుద్ధనావల రక్షణ క్రింద, 1945 సెప్టెంబరులో సౌరబాయా ప్రవేశించి. అక్కడి ప్రజల్ని కౄరహింసలకు గురిచేసి. చివరకు స్వాధీనం చేసుకున్నది భారత సైనికులే.

అరోజుల్లో మన సైనికులు చేసిన దారుణ చర్యలుచూచి, ఇండొనేషియన్ రిపబ్లిక్ అధ్యక్షుడు కంపించిపోయాడు.

ప్రపంచ ప్రజలకు క్రిందివిధంగా విజ్ఞప్తి చేశాడు:

"వేలకొద్దీ ప్రజలు హత్య చేయబడ్డారు. స్త్రీ పురుషులనే విచక్షణగాని, బాలబాలికలనే విచక్షణగాని చూపకుండా, అనేకమందిని చిత్రవధచేశారు. ప్రపంచ ప్రజలు యీ హత్యాకాండను ఆపలేరా?"

ఒక్క సౌరబాయాపట్టణాన్నేకాదు. అనేక పల్లెటూళ్ళను మన సైనికులు నేలమట్టం చేశారు. 1/16 వ నెంబరు పంజాబీ రెజిమెంటు బెకాసీ గ్రామములో ఉన్న 1000 కలపయిండ్లను పెట్రోలుతో దగ్ధంచేసింది. ఈ వార్తను రాయిటర్ విలేఖరి 1944 డిసెంబరు 12వ తేదీనపంపినవార్త

సెప్టెంబరు 1945 మొదలు ఫిబ్రవరి 1946 వరకు ఇండొనేషియన్ ప్రజల్ని దచ్చి సేనలకు వొప్పజెప్పడంలో అతి కూ్రరంగా పోరుసల్పారు.

తర్వాత రాజీకి సంప్రతింపులు ప్రారంభం కావడంవల్ల, కొంతమంది భారతసైనికుల్ని

1946 సెప్టెంబరు 29 న పండిత నెహ్రూ అధికారాన్ని స్వీకరిస్తూ, యిలా చెప్పారు:

"ఇతరదేశాల్లో మన సైనికులు బ్రిటిష్ సామ్రాజ్య రక్షణకై వినియోగింపబడ్డం మా కిష్టంలేదు. ముఖ్యంగా, ఆయా దేశాల జాతీయోద్యమాలను అణచేటందుకు భారత సేనలుగాని, ధనంగాని, సంపదగాని, ఉపయోగింపబడ్డం మా కెంతమాత్రము ఇష్టంలేదు. భారతసేనలు ఇప్పుడే యే దేశాలలో ఉన్నప్పటికీ, వాటిని వెనక్కు రప్పించడంకోసం కృషి చేస్తాం."

★

పంపివేశారు. కాని, యీనాటికీ 40,000 మంది అక్కడున్నారు.

నవంబరు నెలాఖరులోగా ఇండొనేషియా నుంచి భారత సేనలు వెనక్కు రప్పింపబడతాయని నెహ్రూ ప్రకటించాడు. కాని, అప్పటికి వాటి అవసరం సామ్రాజ్యవాదులకుండదు; 2 డచ్చి డివిజన్లు అనాటికి ఇండొనేషియాలో ప్రవేశిస్తాయి. భారత సేనల స్థానం అవి ఆక్రమిస్తాయి.

నవంబరు నెలాఖరులోపుగా కాకుండ, తక్షణమే భారత సేనలను వెనక్కు రప్పించాలని యావద్భారతదేశం ఆందోళన చేయవలసియుంది. ఇండొనేషియన్ ప్రజలు మన దేశానికి 25000 టన్నుల బియ్యం పంపించారు. (అక్టోబరు 7 నాటికి) కాని, మనం వారికి యిచ్చింది తుపాకిగుండ్లు; భారతదేశ చరిత్రలో యింత అవమానకరమైన ఘట్టం, మనదేశానికి ఇంత తలవంపులు తెచ్చేఘట్టం లేనేలేదు.

మనపై అధికారం చెలాయించే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశంపేరిట ఇదంతా చేశారన్నమాట నిజమే. కాని, యీనాడు కేంద్రంలో భారత జాతీయ నాయకులు (కాంగ్రెసు, లీగు) అధికారంలో ఉన్నారు. తక్షణమే వారు ఇండొనేషియానుంచి భారత సేనలను రప్పించి. ఇండొనేషియన్ ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి అన్ని విధాలా సహాయం చేయవలసియుంది.

బర్మా స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడానికి భారతసేనలు

"బర్మా — భారతదేశాలమధ్య అన్యోన్యమైన స్నేహసంబంధాలు ఉంచుకుంటాం,"

అని నెహ్రూ, జనరల్ ఆంగ్‌సాన్ బర్మా ప్రభుత్వంలో ప్రవేశించాక సందేశం పంపించాడు. కాని, యీరోజునకూడ 22,000 మంది భారత సైనికులు బర్మాలో ఉన్నారు. వారు బ్రిటిష్ పెత్తనాన్ని కాపాడుతున్నారు. బర్మాప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడంకోసం మన సైనికుల్ని సామ్రాజ్యవాదులొక సాధనంగా ఉపయోగించుకొంటున్నారు.

ఈ భారత సైనికులే, లోక ప్రఖ్యాతి గాంచిన 14 వ భారత సేనకు మూలం. 14 వ భారత సేన బర్మా గెరిల్లాల సహాయంతో జపాను సేనలను తరిమిగొట్టిన విషయం అందరికీ తెలుసు. అట్టి మన భారత పుత్రులు, జపాన్ ఓడిపోయినప్పటినుంచీ, బ్రిటిష్ అధికారుల పెత్తనంక్రింద ప్రజావుద్యమాలను ధ్వంసంచేయడానికి వినియోగింపబడుతున్నారు.

దొంగ కూలీలుగా కూడ పనిచేశారు!

అంతేకాదు. ఈమధ్య సెప్టెంబరులో రంగూన్ పోలీసులు సమ్మె చేశారు. అప్పుడు మన సైనికులు వారి స్థానే దొంగకూలీలుగా పనిచేశారు. బ్యాంకులవద్ద ప్రభుత్వ కార్యాలయాలవద్ద, కాపలా కాచారు.

వీరిపైనున్న అధికారి ఎవరు? సర్ మాంటెగ్యూ స్టాప్‌ఫర్డ్. ఇతగాడు భారతీయుడు కాడు. భారత ప్రభుత్వంతో ఇతనికెట్టి సంబంధంలేదు. బ్రిటిష్ ప్రభుత్వానికే యితడు జవాబుదారీ వహిస్తాడు.

ఇప్పటివలెనే యికముందుకూడా, బర్మా ప్రజల్ని అణచడంకోసం మాంటెగ్యూ స్టాఫర్డు, బ్రిటిష్‌ప్రధాని అట్లీ మన సైనికుల్ని పనిముట్లుగా ఉపయోగిస్తూంటె, తాత్కాలిక ప్రభుత్వం చూస్తూరుకోవలసిందేనా? లేక ప్రతిఘటించడం అవసరమా? బర్మా - ఇండియాలమధ్య స్నేహసంబంధంపెంపొందాలని యావద్భారతదేశం వాంఛిస్తోంది. అయితే, అక్కడ్నించి తక్షణమే భారతసేనలనురప్పించిన తరవాతగాని, నిజమైన స్నేహసంబంధము నెలకొనదు. సామ్రాజ్యవాదులపని మనచేత్తో మనం చేసిపెట్టకూడదు. ఇంతవరకు చాలా పనులు చేసిపెట్టాం. ఇక మాత్రం వద్దు!

మలయాలో బ్రిటిష్‌వారికి ఊడిగం చేస్తున్నారు

క్రిందటి సంవత్సరం మార్చినెలలో నెహ్రూ సింగపూరు వెళ్ళినప్పుడు, యిలా ఉపన్యసించాడు.

"ముందు ముందు భారతసైనికులు బలం చేకూర్చుకుంటారు. ఆబలంతో ఆసియాఖండ వాసుల స్వాతంత్ర్యం కొరకు పోరాడుతారు"

కాని, యీనాడు మలయాలో మనంచూచే దృశ్యం ఏమిటి? బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు భారతసైనికులు ఊడిగం చేస్తున్నారు. నెహ్రూతాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించిన తర్వాత కూడా ఇదే జరుగుతోంది.

14 నెలలక్రింతం, 1945 సెప్టెంబరు 3 వ తేదీని రెండు డివిజన్లు మలయాకు పంపబడ్డాయి. 2 నెలల్లో ఆ సైనికులు మలయా ప్రజలమీద తుపాకులు కాల్చడం ప్రారంభించారు.


పిరాక్ సంస్థానమంతటా 1945 అక్టోబరులో చాలమంది ప్రజలు తిండికోసం, పనులకోసం బ్రహ్మాండమైన ప్రదర్శనలు చేశారు. వాటిని భారత సైనికులు అణచివేశారు. (రాయిటర్ వార్త.)

తర్వాత, వారిలాగే చాల ప్రదర్శనాలను అణచివేశారు. మలయాలో ఈనాడు 5000 మంది భారత సైనికులు వున్నారు. అంతేకాదు. 15,000 గూర్ఖాలకు మలయన్ కొండలలో. సైనిక తరిఫీదు నిస్తున్నారు. ఎందుకు?

సింగపూర్, మలయాలను, బలమైన సైనిక కేంద్రాలుగా చేయడానికి "ప్రస్తుతం ఆగ్నేయ ఆసియా ఖండ దేశాలకు భారత దేశం సైనిక కేంద్రంగా ఉంది. ఇకముందు సింగపూర్, మలయాలు సైనిక కేంద్రాలుగా ఉండాలి."

అని సింగపూర్ బ్రిటిష్ సైనికాధికారి కాక్స్ తెలియజేశాడు (1946 జూన్ 25.)

ఆసియాఖండ వాసుల్ని శాశ్వత దాసత్వంలో ఉంచడానికి బ్రిటిష్ పాలకులు సైనిక కేంద్రం నిర్మిస్తుంటే, మన సేనలు తోడ్పడ్డంవల్ల ఎంతవరకు భారతదేశ ప్రతిష్ఠ కాపాడబడుతుంది?



హాంగ్‌కాంగ్‌లో 15000 మంది

హాంగ్‌కాంగ్‌లో (చైనా) 15000 మంది భారతసైనికులున్నారు. చైనాలో హాంగ్‌కాంగ్ పెద్ద బ్రిటిష్‌సైనిక కేంద్రం. దక్షిణ చైనా సముద్రంమీద, దక్షిణచైనా వ్యాపారంమీద కూడా పెత్తనం చెలాయించడానికి దీన్ని సామ్రాజ్యవాదులు కేంద్రంగా ఉంచుకున్నారు. మనసేనలు అక్కడ ఉండడమంటే అర్థం, వారిప్రయోజనాలను కాపాడ్డం అన్నమాట.

ఇరాక్‌లో 10,000 మంది

ఇరాక్‌లో మనసైనికులు 10,000 మంది ఉన్నారు. ఇరాక్‌తో మన కేలాంటి వైరం లేదని నెహ్రూ స్పష్టంగా ప్రకటించాడు.

అయినా, 10,000 మంది భారతీయుల్ని, ప్రక్కనున్న ఇరాన్ ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని, వేలాది ఇరాన్ పెట్రోల్‌కంపెనీ కార్మికుల స్వాతంత్ర్య పోరాటాన్ని, అణచడంకోసమే వాటిని అక్కడ ఉంచారనడంలో సందేహమేమీ లేదు. అక్టోబరు మొదటివారంలోకూడా (1946) మరికొంత మంది భారత సైనికులక్కడికి పంపబడ్డారు. వారిని మనదేశానికి రప్పించడంకోసం నెహ్రూ ఇంకా ఎప్పుడు జోక్యం కలిగించుకుంటాడు? పెట్రోలుకై బ్రిటిష్ సామ్రాజ్యవాదులుచేసే కుట్రలన్నింటిలోను భారత సైనికులు పోలీసుల మాదిరిగా ఉపయోగపడకూడదు.

ఇలాగే ఇండోచైనా, తూర్పు ఆఫ్రికా, మొదలైన ప్రాంతాల్లో కూడా భారత సైనికులెందరో ఉన్నారు.

అన్ని ప్రాంతాలనుంచి భారత సేనలను వెనక్కు రప్పించాలి

అనే నినాదం ఆ సేతు హిమాచల పర్యంతం మారుమ్రోగవలసియుంది.

ఇంతవరకు మనదేశానికి వాటిల్లిన అపకీర్తికి ప్రాయశ్చిత్తం చేసుకుందాం.

— "పీపుల్స్‌ఏజ్" నుంచి

వివిధదేశాల్లో భారతసేనలు

ఇండొనేషియా	32,500
బర్మా	22,506
హాంగ్‌కాంగ్	22,000
ఇరాక్	10,000
మలయా	5,000
„ (తరిఫీదు పొందే గూర్ఖా సైనికులు)	15,000
పశ్చిమ ఆసియా	2,500
మొత్తం	1,09,500

కోయంబత్తూరు కార్మికులపై పోలీసుల హింసాకాండ

పన్నెండు నిండుప్రాణాల బలి

కోయంబత్తూరు దక్షిణదేశంలో బట్టలమిల్లులకేంద్రం. ఆమిల్లులలో పనిచేసేకార్మికులంతాఎర్రజెండాయూనియను వలు కుటుంబక్రింద మంచి ట్రేడ్‌యూనియను వుద్యమాన్ని నిర్మించుకున్నారు.

యుద్ధకాలంలో మిల్లు యజమానులు విపరీతమైన లాభాలు గడించారు. ఒక్క 1945 లో కోయంబత్తూరు మిల్లుయజమానులు 2 కోట్లరూపాయలు లాభం గడించారంటే ఆలోచించండి. ఈ దురాశా పాతకులకు ఈ అమితలాభాలు చాలలేదు. దేశంలోని ప్రజలు గుడ్డ చాలక బాధపడుతూ వుంటే చేనేతపారిశ్రామికులు నూలులేక బాధపడుతూంటే వీరు లంచాలు మరిగిన అధికారుల తోడ్పాటుతో ఉత్పత్తినంతనీ దొంగ మార్కెట్టుకు చేర్చి దొంగ లాభాలు విపరీతంగా గుంజారు.

ఒకవేపున ప్రజల్ని ఈ విధంగా దోచుకుతింటూ, రెండోవేపున తమ మిల్లులలో పనిచేసే కార్మికులకు సరియైన జీతాలివ్వక అర్ధాకలితో మాడుస్తున్నారు.

కార్మికులు దొంగవర్తకాన్ని పట్టుకున్నారు

ఎర్రజెండా యూనియను నాయకత్వాన కార్మికులు తమ మీద, ప్రజల మీద మిల్లు యజమానులు చేస్తూన్న దాడిని ఎదిరించసాగారు. మిల్లుయజమానులు చేస్తూన్న దొంగవ్యాపారాన్ని యూనియను ఎన్నోమార్లు బయటపెట్టింది. 'లోటస్' మిల్లులలో జరిగిన దొంగవర్తకం మీద కాంగ్రెస్ మంత్రులకు మెమొరాండం వ్రాశారు.

తర్వాత కార్మికులు తమ జీవితావసరాలకు సరిపడా జీతాలనివ్వాలని ఆందోళన ప్రారంభించారు.

యజమానులు తమ దొంగవ్యాపారాలకు అడ్డుతగులుతూన్న కార్మికులను వారి యూనియనును నాశనం చేయడానికై నిర్ణయించుకున్నారు. మిల్లులను అనవసరంగా మూసివేసి కార్మికులకు తిండి లేకుండాచేసి మాడ్చి లొంగ తియ్యాలని వారి ఉద్దేశం. ఆ విధంగా కోయంబత్తూరులో గత ఎనిమిదినెలల ఈ మధ్య నాలుగుమార్లు లాకౌట్ జరిగింది.

లాకౌటుకు ముందు

ఆఖరు లాకౌటు సెప్టెంబరు 11 న ప్రారంభమయింది. లాకౌట్ చేయడానికి ముందు యజమానులు కొందరు గూండాలను మిల్లులో పనులలోవున్న యూనియను వర్కర్లను కొట్టించడానికి పంపారు. కాని, వారిఎత్తులు పారలేదు. కొట్టడానికి వెళ్ళిన గూండాలను కార్మికులు చావగొట్టి తరిమివేశారు. ఈ ఎత్తు విఫలంకాగానే యజమానులు ఇంకో మామూలు మార్గం తొక్కారు. కార్మికులలో తగాయిదాలు, కొట్లాటలు బయల్దేరాయని పేరుపెట్టి మిల్లు మూతవేశారు.

యజమానుల ఈ దురన్యాయాన్ని ప్రజలలో ప్రచారం చేసుకోకుండా కార్మికుల నోరు కట్టివేయడానికై అధికారులు పట్టణంలో 144 సెక్షన్ ప్రకటించారు.

కాంగ్రెసుమంత్రుల తాటస్థ్యం

కార్మికసంఘ ప్రతినిధులు కోయంబత్తూరు లేబరు ఆఫీసరువద్దకు, జిల్లా కలెక్టరువద్దకు, ఆఖరుకు కాంగ్రెసు కార్మికశాఖామంత్రి వి. వి. గిరిగారి వద్దకు ఎన్నోమార్లు రాయబారాలు వెళ్ళారు. ప్రజలకు బట్ట కరువుగావున్న కాలంలో మిల్లులను అన్యాయంగా మూసివేసిన యజమానిని శిక్షించాలన్నారు. మిల్లు తెరిపించాలన్నారు.

దొంగమార్కెటు కేసులు చెప్ప చెప్పినప్పుడు లోటస్‌మిల్లు యజమాని దొంగవర్తకాన్ని సాక్ష్యం సంపన్నంతో మెమొరాండం రూపంలో యిచ్చినప్పుడు కాంగ్రెస్ మంత్రులు కన్ను మూసుకు వూరుకున్నట్లే యిప్పుడుకూడా తమ్మకొనట్లు వూరుకున్నారు. అసెంబ్లీలో ప్రధాని కమ్యూనిస్టుల మూలంగానే దొంగవర్తకులు తప్పించుకుపోతున్నారంటూ చెప్పిన దబాయింపు వారికి ప్రోత్సాహం యిచ్చింది.

కాంగ్రెస్‌మంత్రుల కమ్యూనిస్టు ద్వేషం యజమానులకు బాగా ఉపయోగించింది. కాంగ్రెసు మంత్రులు కలగచేసుకోకపోవడం, యజమానుల దాడి క్రమంగా తీవ్రతరం కావడంవల్ల రాష్ట్రంలోని బట్టలమిల్లు కార్మికులు సమ్మెబ్యాలటు తీసుకోవానికి నిర్ణయించారు. నవంబరు 2 నుండి సమ్మెబ్యాలటు తీసుకోవడం ప్రారంభమయింది.

మిల్లుయజమానుల కుట్ర

యజమానులు పరిస్థితులను విషమింపచేసి, తమ మీదికి రాబోతూన్న ప్రమాదాన్ని కాంగ్రెసు - కమ్యూనిస్టు కలహంగా చూపించి తప్పించుకుపోవాలని ఎత్తువేశారు. ఆ ఎత్తుతోనే స్టేన్సు మిల్లు (ప్రస్తుతం లాకౌట్ ఇక్కడనే జరిగింది)యజమాని ఎర్రజండా యూనియనులో పనిచేసే 16 గురిని పూర్తిగా వుద్యోగాలనుంచి తొలగించాడు. మిగిలినవారు ఎప్పుడూ ట్రేడ్‌యూనియను వుద్యమంలో కలగచేసుకొనమని వ్రాసి యివ్వాలన్నాడు. అల్లా అయితే మిల్లు తెరుస్తానన్నాడు.

కార్మికులు నిరాకరించారు. లేబర్ ఆఫీసరును మధ్యవర్తిగా కోరారు. లాకౌట్‌కు పూర్వంవున్న పరిస్థితులను పాటించాలి. ఎవ్వరినీ పనులనుంచితొలగించకూడదు. ఇవికార్మికుల షరతులు. యజమానులు వీటిని నిరాకరించారు.

అధికార్లతో లాలోచీ

దొంగకూలీలను పెట్టి మిల్లునుపనిచేయించాలనేది యజమానులు తర్వాతి ఏర్పాటు. దాని ప్రకారం కోయంబత్తూరులోని మిగిలిన మిల్లు యజమాన్లు కొందరు దొంగకూలీలను పంపి స్టేన్సు మిల్లు యజమానికి తోడ్పడ్డారు. వారికి పోలీసు రక్షణ యిచ్చి అధికారులు తోడ్పడ్డారు.

అధికారులకు, మంత్రులకు పంపిన విజ్ఞాపనలకు విలువలేకపోగా కార్మికులు నవంబరు 11 వ తేదీన స్టేన్సు మిల్లు గేట్లవద్ద శాంతియుతంగా పికెటింగ్ ప్రారంభించారు.

వెంటనే యజమాని తాను తెచ్చిన దొంగలకు గాంధిటోపీలు తగిలించాడు. కాంగ్రెస్ కూలీల రక్షణకోసం అంటూ మిల్లు మేడలమీదకు పోలీసులను చేర్చాడు. తిన్నకుక్క ఆమాత్రం విశ్వాసము చూపదు? పోలీసులు మేడమీద నుంచే కాల్పులు సాగించారు. ఫలితంగా 12 గురు చనిపోయారు.

పోలీసు దురంతాలు

చనిపోయిన వారిలో ఇద్దరు స్త్రీలు, ఒకడు 11 ఏండ్ల బాలుడు. ఇంకా 28 రికి గాయాలు తగిలినాయి.

ఈ కాల్పులవార్త వినగానే ఇతర మిల్లులలో పనిచేస్తూన్న కార్మికులు పనులు నిలిపివేశారు. పదివేలమంది పట్టణవీధులలో పోలీసు దురంతాలను విరసిస్తూ ప్రదర్శనాలు చేశారు. వారిపై జరిగిన లాఠీఛార్జీలలో 200 మంది గాయపడ్డారు. రెండుమార్లు టియర్‌గ్యాస్ ప్రయోగించారు.

పట్టణంలో కర్ఫ్యూ ప్రకటించారు. ఇపాకి, లాఠీదెబ్బలకు హాస్పిటళ్ళలో వున్నవారిని, వారిని చూడటానికి వచ్చిన బంధువులను అరెస్టుచేశారు. రేషన్ షాపులవద్ద పోలీసులు నిలబడి కార్మికులకు రేషన్లు నివ్వడంలేదు.

పెట్టుబడిదార్ల వాకిటి కుక్కలమాదిరిగా పనిచేస్తూన్న ఈ పోలీసులనే కాంగ్రెసు మంత్రులు సమర్థిస్తారా? కాంగ్రెసు పేరు మలినమైపోతూంది. ప్రజలు దేశభక్తులు వెంటనే కలగచేసుకొనకపోతే కాంగ్రెసుకు కలిగే అప్రతిష్ఠకు మేరవుండదు.

తూర్పుగోదావరిజిల్లా మోటారు కార్మికుల కష్టాలు

కాంగ్రెసు మంత్రివర్గానికి నివేదిక

కాకినాడ, నవంబరు 11

తూర్పుగోదావరిజిల్లా మోటారు కార్మికుల సంఘ కార్యదర్శి కాకరాల కామేశ్వరరావుగారు ఇలా ప్రకటిస్తున్నారు.

దేశంలోని ప్రధాన రవాణా పరిశ్రమలైన రైల్వే, మోటారుపరిశ్రమలలోని కార్మికులను యజమానులు నమ్మెకు తెచ్చుగొడుతున్నారు. మోటారు రవాణా కార్మికులస్థితి అన్నివిధాలా అధ్వాన్నస్థితిలో వుంది. ప్రతిచోటా మోటారు కార్మికులు సమ్మెనోటీసు లివ్వడమూ, సమ్మెలు చేయడమూ జరుగుతోంది. ఇతరపరిశ్రమలలోని కార్మికులుపొందే పనిగంటల నియమము, కరువు భత్యము, ప్రావిడెంటు ఫండు, ఇంక్రిమెంటు మొదలయిన మామూలు సౌకర్యాలేవీ కూడా యీ కార్మికులకులేవు. శెలవుల విషయంలో ఒక నియమమేలేదు. వైద్యసహాయం మొదలే సున్న. బోనస్లేదు చెయ్యవద్దని కొంతమంది యజమానులు, చెయ్యమని కొంతమంది యజమానులు కార్మికులను బాధ పెడుతున్నారు. పైగా పోలీసుల దబాయింపులు.

కొన్ని మోటారు కంపెనీలలో తెల్లవారుఝామున మూడుగంటలకు లేచి, రాత్రి పదీ పదకొండు గంటల వరకూకూడా, మోటారు కార్మికులు పనిచేయవలసి వస్తోంది. దీనివలన వీరి ఆరోగ్యం పూర్తిగా చెడిపోతూంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ యిరువదినాల్గు గంటలూ బస్సు నంటిపెట్టుకొని, బొగ్గువేసి ఊదడమూ, గ్యాసుచెయ్యడమూ, బస్సులు నడవకపోతే పేగులు హరించేటట్లు వాటిని తొయ్యడము. యీ విధంగా మోటారు కార్మికుల జీవితాలు, దుమ్ములో దొర్లుతో, బురదలో పొర్లుతో వున్నాయి. రవాణా సౌకర్యాల ఉపయోగపడుతో, మోటారుకార్మికులు, రైల్వేకార్మికుల వలే ప్రజలకుపయోగ పడుతున్నారు. కాని, రైల్వేకార్మికులకు కలిగించిన మామూలు సౌకర్యాలుకూడా, యజమానులూ, ప్రభుత్వమూ యీ మోటారు కార్మికులకు కలిగించలేదు.

అడిగితేనే కాని అమ్మయినా పెట్టదని మోటారు కార్మికులు తెలుసుకొని, సంఘాల నేర్పరచుకొని, నూటికి నూరుమంది సంఘాలలో చేరి, తమ కోర్కెలను యజమానులచేత, ప్రభుత్వముచేత గుర్తింప చేసుకోవాలి."

కనీస కోర్కెలు

తూర్పుగోదావరిజిల్లాలో 6 బస్సు కంపెనీలూ 1 లారీ కంపెనీ వున్నాయి. వీటిలో 15 వందల మంది కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లా మోటారు కార్మికసంఘం ఏర్పడి కొద్దినెలలు మాత్రం అయినప్పటికీ, 650 మంది సభ్యులుగా చేరారు. క్రింది చెప్పబడిన తమ కోర్కెల నివేదికను, కాంగ్రెసు మంత్రివర్గానికీ, లేబరు ఆఫీసర్లకూ, అన్ని కంపెనీల యజమానులకు పంపారు.

బస్సుడ్రైవర్లకు కనీసజీతం రు. 60; కండక్టర్లకు రు. 35; క్లీనరుకు రు. 25; లారీ డ్రైవర్లకు రు. 70. లారీ కండక్టర్లకు రు. 40 టూరింగ్‌కారు డ్రైవర్లకు రు. 40; చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు రు. 45; షెడ్ మెకానిక్‌కు రు150 షెడ్ వర్కర్లకు 25% అదనపు జీతమూ నిర్ణయించాలని నివేదికలో కోరబడింది. ఇదే విధంగా యిప్పుడిస్తున్న జీతాలు చాలవనీ కార్మికుల పదవులననుసరించి జీతాకూడా హెచ్చింపబడాలనీ కోరబడింది. కరువుభత్యం నెల 1కి రు17 కావాలనీ ప్రావిడెంటు ఫండు సిక్ క్యాజువల్ సెలవులూ, యింక్రిమెంట్లూ, యూనిఫారములూ వైద్య సౌకర్యాలూ, మొదలైన వాటికి సంబంధించిన కోర్కెలు పై నివేదికలో తెలియజేయబడ్డాయి.

ఆరని జ్వాల

★

పరకాల పట్టాభి రామరావు

(పీడిత ప్రజాసేవకుడు కామ్రేడ్ గారపాటి రాజా రామమోహనరావు స్మృతి)

దానిన నిద్రాముద్రిత
పీడితమౌ ప్రజాకోటి
ప్రభవించిన
విప్లవారుణరేఖపై
రాజులూ
రగిలించావాక
ఆరనిజ్వాల

తరతరాల స్వార్థం
మోసం దోపిడి
గావించిన, పైశాచిక
పరిపాలన గుండెల్లో
పొడిచిన బల్లెముపై
రాజులూ
రగిలించావాక
ఆరనిజ్వాల

నీ చిందిన రక్తంతో
రగిలించిన త్యాగహోమం
ఆరిపోదు ఆరిపోదు.
ఉవ్వెత్తుగ
ఉజ్వలమై
హంతకులకు
బలి బలి బలి అంటూ
పిలుస్తూంది
జ్వలిస్తూంది.
పీడితమానవ విముక్తి
పోరాటపు చరితలోన
రక్తారుణ అక్షరాల
పిలుస్తుంది
నీ పిలుపే
ఫలిస్తుంది
రాజులూ
రగిలించావాక
ఆరనిజ్వాల

అమాత్యా వింటే?

★

సి. కె. రావు

ఇందుగల డందులేడను
సందేహంబేల! కమ్యూనిస్టంతట వింటెన్
ఎందెందు వెతకిచూచిన
అందందే గలస్టదతం డమాత్యా వింటే!

కష్టజీవులలోన కలదు కమ్యూనిస్టు
కార్మికులందున కల డతండు
కర్షకులందున కలదు కమ్యూనిస్టు
కరు వీడలందున కల డతండు
కరువుబాధితులందు కలదు కమ్యూనిస్టు
కలవారలందున కల డతండు
మనదేశభక్తుల కలదు కమ్యూనిస్టు
కాంగ్రెసులీగుల కల డతండు
కలదు పీపీద, నావీద కమ్యూనిస్టు
కమ్యూనిస్టులగూరిచి కలదుమాని
కాంగ్రెస్ కమ్యూనిస్టుల కన్నతల్లి
వీరభారత మాతయే వీరతల్లి
అనుమనమ్ముము తాత! అమాత్యవర్య!

←చిన్న కథ

సత్య జీవనం

కొసరాజు శేషయ్య

త్రండ్రి అనంతరం రామారావుకు మిగిలిన ఆస్తిపాస్తులేమీ లేకపోయినా బి.ఇ.డి. డిగ్రీమాత్రం వుంది. రామారావు బి. యే. పరీక్ష అయినప్పుడు బి. యల్. చదవడమా లేక బి. ఇ. డి. చదవడమా అని తటపటాయించేడు. బంధువులు బి. యల్. చదువమని సలహాయిచ్చేరు. కాని రామారావుకు చిన్నతనంనుండి జాతీయభావాలు మెండు. అట్టి భావాలతో కోర్టులో, రాణించలేనని కున్నాడు. వుపాధ్యాయుడుగా వుండి తన విద్యార్థులకు పాఠాలతోపాటు జాతీయభావాలు నేర్పుతూ దేశాభ్యుదయానికి తోడ్పడగలనని ఆశించేడు. అందుకొరకే బి. ఇ. డి. డిగ్రీ సంపాదించాడు.

ఈ గొడ్డుకాలంలో అతని స్థితి దారుణమయింది. ఆ వచ్చే యాభైరూపాయిల వేతనంతో తల్లి, భార్య, యిరువురు బిడ్డలుపోషణ గడపడం దినదిన గండంగా వుంది. తల్లి పార్వతమ్మ చాల యోగ్యురాలు. భార్య రాధమ్మ పరమసాధ్వి. గృహకృత్యాలన్నీ స్వయంగా నిర్వహించేవారు. అయినా వారి స్థితి నానాటికీ దిగజారుతూ వుంది.

ఒకరోజు రామారావు భోజనానంతరం స్కూలుకు వెళ్ళేడు. అత్తా కోడలు పాత గుడ్డలు బాగుచేయడానికి కూచున్నారు. రాధమ్మ చించి సరిచేసి యిస్తే పార్వతమ్మ ఓపికగా కుట్టింది. ఒకచీరె కుట్టడానికి సాధ్యపడింది కాదు. రాధమ్మ అత్తగారిని ఆ చీరె మెషిను దగ్గర కుట్టించుకు రమ్మని చెప్పి తాను రాట్నందగ్గర కూర్చుంది.

పార్వతమ్మ చీరెపుచ్చుకొని సమీపంలో వున్న మెషిను దగ్గరకు వెళ్ళింది. ఆకుట్టుపనివాడు చీరె అటూ యిటూ తిప్పి పార్వతమ్మను వుద్దేశించి "అవ్వగారూ యీచీరె కుట్టడానికి వీలుపడదు. మధ్యలో ఒకగజము తీసివేసి అతుకువేస్తాను. అల్లా వెయ్యమంటారా" అన్నాడు. పార్వతమ్మ గడ్డంమీద చెయ్యివేసికొని "అయ్యో నాయనా! యీచీరె అసలే పదిమూళ్ళు. అందులో ఒకగజము తీసివేస్తే కట్టుకునే దెలాగూ కూలబడి? యేదో కాస్త వీలుచూచి కుట్టు నాయనా" అని బ్రతిమాలింది. అవిధంగా ఒకటి రెండు మూడు మెషినులదగ్గర తిరిగినా పార్వతమ్మ వచ్చినపని నెరవేరలేదు. వివిక వేసారి యింటికి తిరిగి వచ్చింది.

రామారావు మంచము చివర కూర్చుని పిల్లను ఆడిస్తున్నాడు. రాధమ్మ రాట్నం తిప్పుతూనేవుంది. అత్తగారి రాకచూచి ఆమె చేతిలోని దార కండెకుపోసి లేచినిలబడింది. పార్వతమ్మ కోడలిని వుద్దేశించి "అమ్మాయీ చీరెకుట్టడానికి వీలుపడదన్నారు కావాలంటే ఒకగజము తీసేసి అతుకు వేస్తామన్నారు. అలా చేయించుకు రమ్మంటావా?" అంది.

అత్తగారి ప్రశ్నకు రాధమ్మ యేమీ సమాధానం చెప్పలేదు. భర్తవైపు ఒకసారి చూచింది. అతడూ ఆమెవైపు చూస్తూనే వున్నాడు. ఆ చూపులలోని అసంతృప్తినీ, విచారాన్నీ, ఆవేదనమూ రామారావు గ్రహించాడు. కాని యేమి చేయగలడు? పాపం అతడూ లోలోన బాధపడుతున్నాడు. రాధమ్మ చీరెసర్దుకుని కుంపట్లో బొగ్గులు వేసి విసురుతూ కూచుంది. పార్వతమ్మ చిన్నబోతూన్న ముఖంతో చీరె మంచముమీదపెట్టి తాను రాట్నందగ్గరకూచుంది. యెవ్వరూ యేమీ మాట్లాడలేదు. రాట్నచక్రం రంయ్ రంయ్ మంటూ తిరుగుతోంది. రామారావు తల్లిని వుద్దేశించి "అమ్మా పోనీ యింకో రాట్నం కూడా పెట్టి చూద్దామా?" అన్నాడు.

రాధమ్మ పొయ్యివిసరడం ఆపి అత్తగారివైపు తేరిపార చూచింది. అత్తగారి నుండి సంతృప్తికరమగు సమాధానం వస్తుందా? రాదా? అని తహతహలాడుతూన్నట్లు ఆమె చూపులగుపించాయి.

పార్వతమ్మ చేతిలోని రాట్నచక్రం ఆగిపోయింది. రామారావు, రాధమ్మల చూపులు ఆమె జవాబు కొరకు నిరీక్షిస్తున్నాయి ఆమె జాలిగొలుపుతూన్న చూపులతో శాంతంగా రామారావును వుద్దేశించి. "అయ్యో నాయనా యింకో రాట్నంకూడానా? ఇంత కష్టపడితే ఆ ఖద్దరు గుడ్డ మాత్రం తేలికగా వస్తూందా? నేతవాడికే గజానికి రూపాయి పావులా మజూరీ యిస్తున్నాం, పైగా యేకులు ఖరీదు అలా వుండనేవుండే. కాకపోతే మాత్రం మాకు తీరుబడి యేదీకూలబడి? కద్దెలు రేషను నియ్యం. రేషను, పంచదార రేషను, గుడ్డలు రేషను, కిరసనాయిల్ రేషను! వీటి కోసం ఒకరికి ప్రొద్దస్తమానం ఆ దుకాణాల చుట్టు తిరగడమే సరిపోతూండే. ఆ దుకాణదార్లు యేదోవూరికే యిస్తున్నట్టుగా, వెధవలు, యిప్పుడుగాదు మరొకప్పుడు రమ్మని కసరికొడతారు. ఇన్నేళ్ళు వచ్చిన ముండను కాకిలాగా ఆ బజార్లు పట్టుకు తిరగడమే సరిపాయె. ఇక మీ యిల్లాలు ఆ పిల్లల నిద్దరినీ సముదాయించుకుంటూ వంటచేయాలని వుండె. మనకుతోడు యింకో రాట్నం కూడా యెందుకు బాబూ నా ఖర్మానికి" అని ఒకపెద్ద నిట్టూర్పు విడిచి తిరిగి రాట్నం తిప్పడం ప్రారంభించింది.

రాధమ్మ గిన్నెలో కాఫీపొడివేసి గిన్నె దించి క్రింద పెట్టింది. రామారావు శూన్య దృక్కులతో యిరువురివైపు చూస్తున్నాడు.

పార్వతమ్మ చేతిలోని యేకు అయిపోయింది. ఆమెరాట్నం ఆపి రామారావునుద్దేశించి "నాయనా నీ చిన్నతనంనుండి యీ ఖద్దరంటే, దేశమంటే, నీకు అపరిమితమైన అభిమానం. నీ అభిమానుల ప్రభుత్వమేగా యిప్పుడు అధికారంలో వుంది! ప్రజలందరికీ యేమో వొరగబెడతారని చెపుతూ వచ్చేవు. ఏది బాబూ! ఆ వొరగబాటూ! వీసె అర్ధ రూపాయి అమ్మే కొబ్బరినూనె నాలుగున్నరా? మంచినూనె రెండురూపాయలా? పప్పులు రూపాయికి ముప్పావుశేరా? పీక బిగించుకోడానికి నయితం గుడ్డపీలిక కరువయింది గదా! ఇక కాగాపోగా అగ్గిపెట్టె అర్ధణా చేశామన్నారు. అదీ అలా యిచ్చినా దొరకడంలేదుగదా! ఈ విధంగా వొరగబెడుతున్నారు బాబూ, నీఅభిమానుల ప్రభుత్వం! అనుక్షణమూ కుమిలిచచ్చే రోజు లొచ్చాయి బాబూ" అని ఆమె నూలు పిలపలు చుట్టడం ప్రారంభించింది. రాధమ్మ కాఫీలోకి బెల్లం తరుగుతోంది. రామారావు ఆలోచనలో పడ్డాడు. అతడు ఒక క్షణమాగి కొంచెం చికాకు భావంతో "అయితే యీ యిబ్బందులన్నీ దేశమందరికీ వున్నాయా? లేక మనకే ప్రత్యేక మంటావా?" అన్నాడు.

రాధమ్మ పొయ్యిమీద పాలగిన్నె తీసి దళిమప కింద పెట్టి భర్తవైపు ఉరిమిచూసింది. ఆమె స్పష్టమైన స్వరంతో రామారావుతో "మీ రు బా గా తెలిసినవారైతే కావచ్చు కాని దేశమంతా ఒకలాగే వారుదుఃఖపడుతున్నారని అనుకోవడంలో అర్థం లేదు. డాక్టరు అవధానిగారింట్లో చూడండి, నిత్యమూ జరిగే విందులకు వినోదాలకు యెంత ఖర్చు పెడుతున్నారు! మొన్న వారి అబ్బాయి శాంతిరోజున యెంతఖర్చు పెట్టేరు! ఇవన్నీ దేనికి, వారింట్లో వంటవాళ్ళకు, నౌకర్లకు, చివరకు కుక్కలకు సయితం నిత్యమూ కావలసినంత తిండి! ఇలాంటి బెల్లపు కాఫీ తాగవలసిన గతి వారికేమీ లేదు."

రాధమ్మ ఆవేశంతో మాట్లాడుతున్నట్లు అగుపించింది. ఆమె కంఠధ్వని హెచ్చయింది. పార్వతమ్మ నూలుచుట్టడం ఆపి నోరుతెరచుకుని ఆలకిస్తూంది. రామారావు తదేకదృష్టితో భార్యవైపు చూస్తున్నాడు.

రాధమ్మ అంతటితో ఆగలేదు. "నేను మీకు యింకోవిషయం జ్ఞాపకముచేస్తాను. చైరుమన్ గారింట్లో జరిగిన వివాహంవిషయం మీకూతెలుసు. భోజన పదార్థాలసంగతి అలావుంచి, ఒక్క బట్టల విషయం ఆలోచించండి. తేళ్ళతో తీసుకవచ్చి బంధువులందరికీ బట్టలు పెట్టేరు. ఇవన్నీ యెందుకు, వారింట్లో బీరువాలనిండా లెక్కలేనన్ని బట్టలు. దిల్లలమీదా, మేజాలమీదా, పరుపులమీదా రకరకాల గుడ్డలు, చివరికి వారి గుర్రాలకు, కుక్కలకు చక్కని గవిసెనలు. ఇక మనకో మానషాన్ని నయితం కాపాడుకోలేని అవస్థ! ఇట్టి తారతమ్యం, హెచ్చుతగ్గులు, కలవారిమధ్య లేనివారిమధ్య స్పష్టంగా వున్నాయి. మనబోటిలేనివారే యీ దుర్భర దురవస్థలకు బలిఅవుతున్నారు" అంటూ ఆమె కాఫీ గ్లాసు భర్త దగ్గర పెట్టి, అవాలి చాలని చీరె సర్దుకుంటూ లోపలికిపోయింది.

రామారావు నిర్విణ్ణుడై చేతులు ముడుచుకొని పైకి చూచేడు. అతడు అస్పష్టమైన స్వరంతో "ఓరి భగవంతుడా! ఈ హెచ్చుతగ్గులు పోవాలంటే, ఆరష్యావాళ్ళ వద్దతే గతి అవుతుందేమో" అన్నాడు. స్థూలుగంట గణగణా మోగింది.

★ చిత్రసమీక్ష

'త్యాగయ్య'

దక్షిణ భారతదేశానికి సంగీత భిక్ష పెట్టిన వాడు త్యాగరాజు. మన తెలుగుభాష కమ్మదనాన్ని దక్షిణ భారతీయు లందరికీ చవిచూపిన మహాగాయకుడు. అటువంటి మహనీయుని జీవిత చిత్రం ప్రయోజనకరంగా తీసి వుండకపోవడం విచారించవలసిన విషయం. త్యాగరాజు జీవితంలోని "మానవత్వా"గాని, అన్యాయాలను ఎదుర్కొనే సంఘటనలుగాని యీ చిత్రంలో యించుమించుగా లేవు.

తీసేది యిప్పటి ప్రజలకోసం కాబట్టి, ఆ మహాభక్తుని జీవితంలో, ప్రజాశ్రేయస్సును కోరే ఘటనలకు బాగా ప్రాముఖ్యత యివ్వవలసినబాధ్యతను, చిత్రనిర్మాతలు పాటించి వుండవలసింది. భౌతికజీవితాన్ని గర్హించే మాటలు, త్యాగయ్యతో అనిపించకుండా వుండవలసింది.

చిత్రంనిండా కొన్ని డజన్ల త్యాగరాజ కృతులున్నాయి. అందులో యే రెండు మూడో తప్పితే, తక్కినవన్నీ ఒకటి రెండు చరణాలు పాడి వదిలిపెట్టినవి. ఈ విధంగా పాటల మయం చేసేకంటే కొన్ని మంచి పాటలు పూర్తిగాపాడించివుంటే బావుండేది. సంగీతం విషయంలో శాస్త్రమెంతవుందో గాని, శ్రోతల్నిమాత్రం యేమంత పెద్దగా ఆకర్షించడం జరగలేదు. సన్నివేశాలకు తగ్గపాటలు పెట్టడం అభినందించవలసిన విషయం.

త్యాగయ్య రాజుగారి ఆహ్వానాన్ని నిరాకరించిన ఘట్టం, స్వతంత్రభావాన్ని కలిగించేదిగా వుంది.

ముందు ముందు ప్రజలకు ఉపయోగపడే చిత్రాలను, "రేణుకా ఫిల్మ్స్"వారు తియ్యాలని కోరుతున్నాము.

— సి. ఇ. ఆర్.

అమెరికన్ పెట్టుబడిదారుల బంటు లూయీఫిషర్

భారత స్వాతంత్ర్యాన్ని బలపర్చుతున్నాడనుకోవడం, తెల్లనివన్నీ పాలని భ్రమపడడం వంటిదే

"గాంధీతో ఒకవారం" – గ్రంథకర్త, లూయీఫిషర్–ప్రచురకర్తలు సంస్కృతి గ్రంథమండలి, పెరంబూరు, మద్రాసు

తెల్లనివన్నీ పాలు, నల్లనవన్నీ నీళ్ళు అనుకునే వెర్రిబాగుల భారతదేశంలో, యీ గ్రంథకర్త పరమమిత్రుడుగా చెలామణీ అవుతున్నాడు. ఈయన వ్యాసాలూ ప్రకటనలూ ప్రాముఖ్యంగా అచ్చొయ్యని జాతీయ పత్రికంటూ లేదు. ఈ పుస్తకంకాక, సంస్కృతి గ్రంథమండలిద్వారా, యీయనవి యింకా మూడు పుస్తకాలు తెలుగులో "త్వరలో వెలువడనున్నవి"

లూయీఫిషరు చాలాకాలం సోవియట్ దేశంలో వున్నాడు. చిత్తశుద్ధిగలవారందరు చెప్పినట్టే, అక్కడ జరుగుతున్న మహత్తర కార్యాలను ప్రశంసిస్తూ మొదట ఒక గ్రంథం వ్రాశాడు. కాని తరువాత అమెరికన్ సామ్రాజ్యవాదపు బాకాను చేతపుచ్చుకొని, రష్యామీద శాపనార్థాలు ఆలాపన చెయ్యడం పనిగా పెట్టుకున్నాడు. ఈయన తరచుగా భారతదేశం వస్తూపోతూ వుంటాడు. అమెరికన్ సామ్రాజ్యవాద విధానాన్ని ఆకాశానికి ఎత్తుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం యిచ్చేయ్యాలని అతిమధురంగా మాట్లాడుతాడు. బ్రిటిష్‌వాళ్ళ పెత్తనం పోతేగాని, మనదేశంలో దుకాణాలు పెట్టుకొనడానికి అమెరికన్ పెట్టుబడివార్లకు అట్టే అవకాశం లేదుగదామరి!

ఈపునకార్యం సాధించడానికే మన జాతీయనాయకులతో భుజాలు కలుపుతూ వుంటాడు. తత్ఫలితమే "గాంధీజీతో ఒకవారం."

హిట్లరుతో గాంధీజీకి సహపంక్తి

గాంధీజీతో సేవాగ్రామంలో గడిపిన వారంరోజుల్లోనూ, యీవిషయం యెక్కించడానికి లూయీఫిషర్ శాయశక్తులా కష్టపడ్డాడు. స్టాలిను హిట్లరంత కిరాతకుడని విర్యాదుచేశాడు (పేజీ 16) పుస్తకంముగిస్తూ గాంధీజీ మహదాశయంగల మహోన్నతుడని చెప్పి లెనిన్, అబ్రహాం లింకన్‌కూడా మహదాశయంగలవారేనంటాడు: "చక్కని విగ్రహాల్లాగా గొప్పవారంతా ఒకచోటంగా వుంటారు"!! (పేజీ 133) హిట్లరు సహపంక్తిని గాంధీజీని, లెనిన్‌నూ, అబ్రహాం లింకన్‌నూ కూర్చోబెట్టగల "మహదాశయం" ఒక లూయీఫిషర్‌కే వుంది.

జర్మన్లను హిట్లరు సుఖపెట్టాడట

ఈమధ్య యీయన జర్మనీ పర్యటనం చేసి, తన అనుభవాలను వ్యాసాలుగా వ్రాశాడు. అందులో ఒకటి "ఆంధ్రపత్రిక" ప్రకటించింది (27-10-46). "బెర్లిన్‌లో నాలుగు భాగాల్లోవున్న వారుకూడా బ్రిటిషర్లని, అమెరికన్లని మెచ్చుకొని ఫ్రెంచివారిని రష్యన్లను దూషిస్తారు" అని వ్రాశాడు. వ్యాసంఅంతటా రష్యన్లను దూషిస్తూవుంది. అమెరికన్ పాలనను ప్రశంసలు వున్నాయని చెప్పనక్కరలేదు. "ఆదశలో (అంటే హిట్లరుపాలనలో) జర్మన్లంతా చాలాసుఖంగా జీవించారు. హిట్లరు యూరప్ నంతట్నీదోచి వాళ్ళకు సుఖం చేకూర్చిపెట్టాడు" ఇది యింకో సుభాషితం:

హిట్లరు యూరప్ నంతట్నీ దోచడం ముఖ్యంకాదు ఫిషర్ మహాశయుడికి. హిట్లరుపాలనలో "జర్మన్లంతా చాలాసుఖంగా జీవించారు", కీర్తిశేషుడైన గోబెల్సు లేనిలోపం తీర్చుతున్నాడాయన. యుద్ధం రాకముందూ, వచ్చినతరవాతా పెట్టుబడిదార్ల దోపిడీవల్ల, భారతప్రజలంతా యెంతసుఖపడ్డారో మనందరికీ తెలుసు. మనదేశంలో జరిగినట్లుగానే, జర్మనీలోకూడా, యీదోచిన దాన్నంతా, పెట్టుబడిదార్లు గుటకాయస్వాహా చేశారు. ఇవికాకపోతే యుద్ధంరాకపూర్వం యెన్నాళ్ళనుంచో జర్మనీలో వెన్న, రొట్టె, బట్ట మొదలైన అవసరమైన వస్తువులు గగనకుసుమాలుగా వుండడానికి కారణం? జగద్విదితమైన యీవిషయాన్ని, పెట్టుబడిదారీవిధానానికి ప్రవక్తయైన లూయీఫిషర్ అసలు ఎత్తుకోడు: ఏదేమైనా, అనాడు హిట్లరు, జర్మన్‌ప్రజలకు మాటలతో "సుఖం చేకూర్చిపెట్టి"నట్లే యీనాడు ఫిషర్‌కూడా సుఖం చేకూర్చుతున్నాడు:

సోవియట్ పాలిత జర్మనీని గురించి లిబరల్ పత్రిక వెల్లడించిన సత్యాలు

ఫిషర్ ప్రచారంలోని పస తెలుసుకోవడానికి యీ అక్టోబరు 26న "మద్రాసు మైల్" పత్రికలో పడ్డ వ్యాసాన్ని పరిశీలిద్దాం. ఇది "న్యూస్‌క్రానికల్" అనే లిబరల్ పత్రిక ప్రత్యేక విలేఖరి వ్రాసినవ్యాసం. (పై రెండుపత్రికలూ సోవియట్ దేశానికిగాని, కమ్యూనిస్టులకుగాని మిత్రులు కారన్న విషయం అందరూ ఎరిగినదే.) ఈ విలేఖరి రష్యా పాలనలోవున్న జర్మనీలో, ఉద్యోగులు ఉదారంగా వున్నారనీ, పరిపాలనలో వున్న లోపాలను ఎత్తిచూపితే కృతజ్ఞతతో స్వీకరించడమేకాకుండా, ఆలోపాలను తామే యితరులవద్దకూడా తీవ్రంగా విమర్శిస్తుంటారనీ, ఆహారపరిస్థితి సంతృప్తికరంగావుందనీ, పిల్లలందరూ పాఠశాలలకు పోతున్నారనీ వ్రాశాడు. జర్మనీ ప్రజల మానసిక స్థితి నంతట్నీ విషపూరితంగా చేసిన నాజీ ఉపాధ్యాయులందరూ తొలగింపబడ్డారనికూడా ఈ విలేఖరి తెలియజేస్తున్నాడు. బ్రిటిష్, అమెరికన్ పాలిత ప్రాంతాలల్లో నాజీలింకా ఉద్యోగాల్లో వుంటున్నందుకు, జర్మన్‌ప్రజలు విమర్శిస్తున్నారని ఆ వ్యాసంలో తెలియచేయబడింది.

'మైల్' పత్రికలోనే ఆ మర్నాడు ప్రకటింపబడిన వ్యాసంలో (అక్టోబరు 27) "న్యూస్‌క్రానికల్" విలేఖరి యీ క్రింది విధంగా వ్రాశాడు.

"రష్యన్లు ప్రవేశపెట్టిన భూమిసంస్కరణలు వేలాది జర్మనులకు సహాయపడ్డాయన్నది నిర్వివాదాంశం. వీరు రష్యనులను మిత్రులుగానుభావిస్తున్నారు."

అబద్ధాలకు రాయిటర్‌ను తలదన్నిన లూయీఫిషర్

తక్కిన మూడురాజ్యాల పాలనలోవున్న ప్రాంతాలకూ (బ్రిటను, అమెరికా, ఫ్రాన్సు) సోవియట్ పాలనలోవున్నప్రాంతానికీ, ఇంకా ముఖ్యమైన వ్యత్యాసంవుంది. ఆ మూడు ప్రాంతాల్లో జర్మన్ ప్రజలనూ ప్రపంచప్రజలనూ కొల్లగొట్టిన పారిశ్రామికాధిపతులూ, జర్మన్ జమీందారులూ, నాజీలు తమతమ పదవుల్లో కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు. వీరంతా చాలా నిపుణులనీ, వారిస్థానంలోకి రాగలవారింకా లేరుకాబట్టి, వారిని తొలగించడం అసాధ్యమనీ బ్రిటిష్, అమెరికన్ అధికార్లు అంటున్నారు. సోవియట్ పాలిత జర్మనీలో పెద్ద పరిశ్రమలన్నీ జాతీయం చేయబడ్డాయి. వేలాదియకరాలుగల జమీందారీలు, రైతులకు పంచియిచ్చారు. నాజీలను ఉద్యోగాలనుండి తొలగించి, యితర జర్మన్లకు ఆ ఉద్యోగాలిచ్చారు. ఈ వాస్తవిక విషయాలను, సామ్రాజ్యవాద ప్రచారక సంస్థ రాయిటర్‌కూడా, విషంమింగినట్లు అంగీకరించింది. కాని లూయీఫిషరు, రాయిటర్నుకూడా తలదన్నాడు:

దీనినిబట్టి సత్యాన్ని కప్పిపుచ్చడమూ, అబద్ధాలను సృష్టించడమూ, ఫిషర్ మహాశయుని పాలసీగా కనిపిస్తోంది.

హిట్లరంటే స్టాలిన్‌కు భయమట!

రష్యానుగురించిగాంధీజీతోఇలాఅన్నాడు. "రష్యాపై జర్మనీ దండెత్తినతర్వాత, అమెరికా, బ్రిటన్లనుండి రష్యాకు క్రమేణా హెచ్చుసాయం లభిస్తూవున్నది. కాని అంతకుముందు, హిట్లరుకుభయపడి స్టాలిన్ బ్రిటన్‌పట్ల, క్రిప్సుపట్ల అణుమాత్రమైనా స్నేహం చూపలేకపోయాడు." ("గాంధీజీతో ఒకవారం, పే. 23)

హిట్లరు వినాశానికి ముఖ్యకారణం రష్యాయే అని. యుద్ధకాలంలో బ్రిటన్ అమెరికాలు రష్యాకు సాయంచెయ్యకుండా ఎన్నోఆటంకాలు కల్పించాయని. రెండవ రంగం ప్రారంభించమని సేనానాయకులు ఎంత ఒత్తిడితెచ్చినా, రష్యాపై కక్షకొద్దీ చర్చిలు రెండుసంవత్సరాలకుపైగా వాయిదాలా వేసాడని, పత్రికలు చదివేవారందరికీ తెలుసు. నిజం యిలావుంటే, ఫిషరు "రష్యాకు క్రమేణా హెచ్చుసాయం లభిస్తూవున్నది" అని వ్రాస్తున్నాడు!

ఇదేవిధంగా, యుద్ధానికి పూర్వం, బ్రిటన్ ఫ్రాన్సు, రష్యాలు కలిసి హిట్లరును ప్రతిఘటించాలనీ, పరస్పరసహాయసంధి చేసుకోవాలనీ సోవియట్ ప్రభుత్వం యెంతో ప్రయత్నించింది. బ్రిటన్ ఫ్రాన్సులు ఈ సూచనను అగౌరవకరంగా తృణీకరించాయి. చరిత్రయిలావుంటే, "హిట్లరుకు భయపడి" స్టాలిను బ్రిటన్‌తో సంధి చేసుకోలేదని, యీ ప్రబుద్ధుడు చరిత్రను తలక్రిందులు చేశాడు.

బ్రిటన్ అమెరికాల ప్రజాస్వామ్యం గాంధీజీకి తెలుసు

ఇంకోసందర్భంలో(గాంధీతోవారం పేజీ28) సోవియట్‌మీద ఫిషర్ దుష్ప్రచారం అంతా విన్నతర్వాత, "మీరుచెప్పిన విషయాలను బట్టిచూస్తే, ఇంగ్లండు, అమెరికా యీ రెండు మాత్రమేనా ప్రపంచంలో ప్రజాస్వామ్యాలు" అన్నారు గాంధీజీవ్యంగ్యంగా. ఈ ప్రశ్నకు ఫిషరు ఔనని సమాధానంయిచ్చాడు. దానిమీద గాంధీజీ "వీటిప్రజాస్వామ్యత నాకుతెలుసు. నేను దక్షిణాఫ్రికాలో కొంతకాలంవున్నాను" అని అన్నారు. పాపం ఫిషర్ వుక్కిరిబిక్కిరై వుంటాడు– తన "ప్రజాస్వామ్యం" గాంధీజీకి తెలుసునని!

మనదేశపరిపాలనా యంత్రాన్నిగురించి మాట్లాడుతూ గాంధీజీ, గ్రామప్రభుత్వాలు జిల్లాప్రభుత్వాలను, జిల్లాప్రభుత్వాలు రాష్ట్రప్రభుత్వాలనూ, రాష్ట్రప్రభుత్వాలు దేశమంతటికీ ఒక అధ్యక్షుణ్ణి ఎన్నుకోవాలనిచెప్పారు.

అదివిని "ప్రజాస్వామ్యవాది" లూయీఫిషర్ గాభరాపడి, "మీప్రభుత్వ విధానం యించుమించు సోవియట్ విధానంవలె నున్నదే!" అని బెదిరించబోయాడు. గాంధీజీ మాత్రం చల్లగా, "ఉన్నా పరవాలేదు" అన్నారు. (పేజీ 59)

అమెరికన్ వడ్డీ వ్యాపారంలోని ఉదారత్వం

ఇంకోచోట అమెరికన్ పెట్టుబడిదారీ విధానాన్ని తెగపొగుడుతూ, ఆర్థికపెత్తనం కోసం యితరదేశాలకు అప్పులివ్వడం మొదలైన వాటినన్నిటినీ, అమెరికా ఉదారస్వభావంవల్లనే సంటూ వర్ణించసాగేడు (పేజీ 72) "నీగ్రోలసంగతి ఏమిటి?" అని ప్రశ్నించారుగాంధీజీ.

నీగ్రోలపట్ల అమెరికా అవలంబిస్తున్న రాక్షసవిధానాన్ని సమర్థించడం సాధ్యంకాక, "మీదేశంలోని అంటరాని సమస్య యెంత క్రూరమైనదిగాదు నీగ్రోసమస్య" అనిఫిషర్ సమాధానం.

నిజమే మనదేశంలో అంటరానితనం యెంత దారుణంగా వున్నా, అమెరికన్లు నీగ్రోలను నిలువునా కాల్చిచంపినట్లు మనం హరిజనుల్ని చంపడంలేదు. కాని లూయీఫిషర్ వాదనకది అక్కరలేదు

సామ్రాజ్యవాదులకు స్వాతంత్ర్య సమరం అంటే సానుభూతి!

గాంధీజీ ఆశ్రమంలోనే, లూయీఫిషర్ నెహ్రూగార్ని కలుసుకున్నాడు. ఆయన దగ్గర యెటువంటి శ్రీరంగనీతులు చెవుతున్నాడో వినండి.

"అమెరికనులు స్వాతంత్ర్య సమరం సాగిస్తూవున్న ప్రజలకు యెంతో సానుభూతి చూపెడతారు. అమెరికాకు, బ్రిటన్‌వలె ఇండియా పట్ల ఆర్థికలాభదృష్టిలేదు"

("గాంధీతోవారం" పేజీ 91)

స్వాతంత్ర్యసమరం సాగిస్తున్న ప్రజలకు యెంత సానుభూతి చూపెడతారో చెప్పడానికి ఒక్కచైనా దృష్టాంతంచాలు. చైనాను వలసదేశంగాచేసికొని కొల్లగొట్టడంకోసరం, అభివృద్ధినిరోధకమైన కుమింటాంగ్ ప్రభుత్వానికి అమెరికా సైన్యాలు ఆయుధాలు డబ్బు యిచ్చి, అంతర్యుద్ధజ్వాలలను రగుల్కొల్పడం అందరూ ఎరిగినవిషయమే. ప్రపంచం అంతటా నాలుగువందల యిరవై కేంద్రాలలో యుద్ధసన్నాహంతో సైన్యాలు కేంద్రీకరించడమూ (అమెరికానుండి 6 వేల మైళ్ళ దూరంవరకూకూడా) అటంబాంబును చూపెట్టి ప్రజాస్వామిక దేశాలను బెదరించడమూ, లోకమంతటికీ అమెరికా గుట్టును వెల్లడిచేశాయి.

ఈ ఆషాఢభూతిని ఒక కంట కనిపెట్టండి

ప్రపంచాన్ని కొల్లగొడుతూ, యింకా సామ్రాజ్యవాద దుర్దాహంతో పరపక్కు తొక్కుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదానికి తాళంవేస్తూ, రష్యావంటి ప్రజాస్వామిక దేశాలను దూషించడమే పనిగా పెట్టుకున్నాడు లూయీఫిషర్. యిటువంటి ఆషాఢభూతులను, ఒక కంట కనిపెట్టడం స్వాతంత్ర్యపిపాసులైన భారతీయులందరివిధి. మనస్వాతంత్ర్యాన్ని బలపర్చుతున్నట్లు నటిస్తున్నాడుకాబట్టి, లూయీఫిషర్ మనకు మిత్రుడని భావించడం, బ్రిటిష్ సామ్రాజ్యవాదులమీద కక్షకొద్దీ భారత స్వాతంత్ర్యానికి దొంగసానుభూతి చూపిన హిట్లరు, టోజోలను మిత్రులుగా భావించడం వంటిదే.

బ్రిటిష్‌పెత్తనం పోతేనేగాని, అమెరికన్ పెట్టుబడిదార్లకు మనదేశంలో స్థానందొరకదు గాబట్టి, తియ్యని కబుర్లు చెపుతున్నాడు లూయీఫిషర్.

ఇది గుర్తించితే మనం తెల్లనివన్నీ పాలన్న భ్రమలో పడిపోకుండా వుంటాము. "మేడిపండుచూడ మేలిమైయుండును, పొట్టవిచ్చిచూడ పురుగులుండు" అన్నట్లుగా లూయీఫిషర్ లాంటివారు చేసే కపట ప్రచారంలో కొట్టుకుపోకుండావుంటాము.

పెట్టి ఈశ్వరరావు

…టాలపై పోలీసు నిర్బంధవిధానం

కాంగ్రెస్ మంత్రులు మానాలి

సామ్రాజ్యవాదుల బాట విడచి ప్రజల తరపున నిలబడాలి

కోయంబత్తూరులో 11వ తేదీన కార్మికులపైన పోలీసులు తుపాకులు కాల్చారు. 11 గురు చనిపోయారు. 33 గురికి తీవ్రంగా గాయాలు తగిలాయి. 11 గురు ప్రమాదస్థితిలో వున్నారని వార్తలు వచ్చాయి. కాంగ్రెసు మంత్రుల హయాములో జమీందారుల - పెట్టుబడిదారుల పక్షం వహించి పోలీసులు ప్రజల ప్రాణాలను బలిగొనడానికి యిది మొదటిసారికాదు. అరెస్టులు, లాఠీచార్జీలు, తుపాకి కాల్పులు నిత్యకృత్యాలయిపోయాయి.

★

…సులో
…నెలలలో
…పర్యాయం
…వర్గం అనుస
…లను తోవ్వడు

…టాలు

…కార్మికులు సమ్మె … ఇచ్చే జీతాలు చాలవు … న్నారు. గుంటూరు బొగాకు …లు సమ్మెను భగ్నం కావించ… విశ్వప్రయత్నం చేశారు. కమ్యూనిస్టుల ఇండ్లమీద రాళ్ళు రువ్వించారు. దాడులు చేయించారు. ఆత్మరక్షణకోసం కమ్యూనిస్టులు పూనుకున్నారు. రాత్రి జరిగిన యీ ఘర్షణలో ఏ పార్టీకి చెందని ఒక ముసలి చనిపోయాడు. దీనిని సాకుగా తీసుకొని గుంటూరు పోలీసులు గుంటూరు పట్టణంలోని 9 మంది కార్మిక నాయకులమీద ఖూనీకేసు పెట్టారు. పోలీసులు తలచుకుంటే సాక్ష్యానికి ఏమి తక్కువ? కాంగ్రెసువాదుల మీద, ప్రజలమీద అనేకసారులు లాఠీఛార్జీ చేసిపైకివచ్చిన డప్పుల సుబ్బారావు(డిప్యూటీ పోలీసు సూపరెంటెండెంటు) ఇందులో ప్రత్యేకంగా శ్రద్ధ వహించాడు. 10 ఏండ్ల శిక్ష ఇప్పు కామ్రేడ్సుకు చెప్పారు. కాంగ్రెసు మంత్రివర్గం తప్పుడు కేసులుపెట్టిన పోలీసులమీద చర్య తీసుకోలేదు. కడప కేసులనైనా రద్దుచేయలేదు.

ఆంధ్రలో మ్యునిసిపలు కార్మికులకు 4 రూపాయలు మొదలు 12 రూపాయలవరకు జీతాలున్నాయి. బియ్యపుధరలు, గుడ్డ ఇతర ఆత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. జీతాలు చాలవు, నెలకు కనీసపు జీతం 30 రూపాయలు కావాలని అనేక పర్యాయాలు మంత్రివర్గానికి తెలుపుకున్నారు. ఒకటి రెండు సారులు సమ్మెకు నోటీసిచ్చికూడ కాంగ్రెసు మంత్రివర్గం తమకు న్యాయం కలుగజేస్తుందని ఆశతో మానుకొన్నారు. మూడు నెలలు వేచియుండి కడకు విధిలేక 10 వేలమంది కార్మికులు సమ్మెచేశారు. 144వ సెక్షన్‌ను ఉపయోగించింది. లాఠీచార్జీ చేయించింది. వందలకొలది కార్మికులను అరెస్టుచేసి శిక్షించింది. (మద్రాసులో ఒక ముసలి కార్మిక స్త్రీ పోలీసు దెబ్బలకు చనిపోయింది) నేటికికూడ రాజమండ్రిలో 13 గురి కార్మిక నాయకులమీద కామ్రేడ్ కొరపాటి పట్టాభిరామయ్యగారిమీద కేసులు నడుపుతూనే ఉంది.

యస్. ఐ. ఆర్. రైల్వే కార్మికుల సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలని, ఇంగ్లీషు పెట్టుబడిదారుడు, కంపెనీ ఏజెంటు రేనాల్డ్సు, సంఘకోసం పనిచేసే కార్మికులను 7 మందిని పనిమండి తీసివేశాడు. 1000 మందిని ఒక స్థలాన్నుండి మరో స్థలానికి బదిలీచేసి (ట్రాన్స్ఫరుచేసి), వారిని తక్కువ పనిలోకి పెట్టసాగాడు. మంత్రివర్గానికి విన్నవించుకున్నా, మోక్షం కలుగజేసుకోలేదు. ఒక నెలరోజులు గడువిచ్చారు. అప్పటికీ అన్యాయం మానకుంటే మొత్తం 48 వేల కార్మికులలో 42 వేలమంది సమ్మెచేశారు. ఈ సమ్మెను అణచడానికి హారిసన్ పోలీసు ఉద్యోగికి సర్వాధికారాలిచ్చారు. రైల్వే లైనుమీదంతా అరెస్టులు, లాఠీచార్జీలు సర్వసామాన్యమైపోయాయి. 40 వేలమంది సమ్మె అణచడానికి 1500 మంది రైల్వేకార్మికులను ప్రతిజిల్లాలో వున్నకార్మికనాయకులందర్నీ అరెస్టుచేశారు. …లైన్ రాక్‌లో లాఠీచార్జీ చేశారు. …పాకులు కాల్చారు. … మంది …చనిపోయారు. 100 మందికి గాయాలు తగిలాయి. యూనియన్ ఆఫీసును ధ్వంసం చేశారు. 50 వేల రూపాయలు నష్టంకలుగజేశారు. పోలీసులు యిష్టంవచ్చినట్లు దోచుకున్నారు. నేటికీ కార్మికులమీద, కార్మిక నాయకులమీద కేసులుసాగుతూనేవున్నాయి.

నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు తమకు ఎక్కువ జీతాలు చేయమని అడిగితే ఊదుతున్నారు. ఎక్కువ చేయనిపక్షాన సమ్మె చేయవలసి వుంటుందని తీర్మానిస్తే, మీ సంఘాన్ని గుర్తించం, సంఘ అధ్యక్ష, కార్యదర్శుల మీద చర్యతీసుకుంటామని నోటీసిచ్చారు.



వ్యాసకర్త: పుచ్చలపల్లి సుందరయ్య

ఉపాధ్యాయులజీతాలను ఎక్కువ చేయాలని వారాందోళనసాగిస్తూంటే, ఇంతవరకు దానినిగూర్చి ప్రత్యేకంగా శ్రద్ధపట్టించుకోవటంలేదు. ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘాలపై అద్వయిజర్ల ప్రభుత్వం పెట్టిన నిషేధాన్ని ఇంతవరకు తొలగించలేదు.

దొంగమార్కెటుదారులకు పోలీసు మద్దతు

బెజవాడ, నర్సారావుపేట, నంద్యాలలో విపరీత లాభాలువేసుకొని గుడ్డలు, బియ్యం వగయిరా జీవితావసర వస్తువులను అమ్మే పెద్ద పెద్ద దొంగవ్యాపారస్తుల, దుకాణాలను ప్రజలు, ప్రజాసేవకులు పికెటింగుచేశారు. కంట్రోలు రేట్లకు వస్తువులు యిప్పించవలసిందిగా కోరారు. పోలీసు ఉద్యోగస్తులు, పికెటింగు చేస్తున్న ప్రజాసేవకులను దోపిడీ చేయడానికి వచ్చారంటూ అరెస్టుచేసి జెయిలులో పెట్టారు. కేసులునడిపారు.

అదే విధంగా పెద్దాపురంలో నూలును దొంగ వ్యాపారంచేసి, 10 రూపాయలకు అమ్మవలసిన పెట్టె నూలును 40, 50 రూపాయలకు అమ్మే మాస్టరు వీవరులకు వ్యతిరేకంగా అచ్చట చేనేత పారిశ్రామికులు కమ్యూనిస్టులు ఆందోళనచేశారు. పోలీసులు మాస్టరువీవర్లు చెప్పినట్లు అచ్చటి ప్రజాసేవకులను కమ్యూనిస్టు నాయకులందరిని అరెస్టుచేసి జెయిలులోపెట్టి కేసులు పెట్టారు.

రైతు పోరాటాలు

(1) చల్లపల్లి జమీందారు గ్రామంలోని సాముదాయిక భూములను చాల సంవత్సరాలుగా ఆక్రమించుకుంటూనే ఉన్నాడు. కొన్ని కొన్ని ప్రాంతాలలో రైతులు దానిని వ్యతిరేకించి ఆక్రమణ కానివ్వకుండా అపుచేయగలిగారు. చినకళ్ళేపల్లిలో గుండేరు ప్రాంత భూములట్టివి. ఈ కక్షకొద్దీ రైతుసేవకులపై తన మనుష్యులను దౌర్జన్యం చేయడానికి పంపాడు. ఘర్షణలో ఇరుపక్షాలవారికి దెబ్బలు తగిలాయి. కాని చల్లపల్లి జమీందారు చెప్పుచేతలలోనువ్వ ఉద్యోగస్థులు ఆగ్రామంలోని కమ్యూనిస్టుముఖ్యులందరిని, తాలూకాలోని కమ్యూనిస్టు ప్రముఖులను, మాలెంపాటి సీతారామయ్య, రావి దుర్గా ప్రసాదరావు, గుత్తికొండ కోదండ రామయ్య మొత్తం 31 మందిమీద కేసులు బనాయించారు. బెయిలు కూడ ఇవ్వ నిరాకరించారు. హైకోర్టుకు పోయినప్పుడే బెయిలు వచ్చింది.

(2) కాజకోటూరు చల్లపల్లి జమీందారు సాముదాయిక భూములను అమ్మడానికి ప్రయత్నిస్తే గ్రామస్థులు, రైతులు, కూలీలు కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులూ అందరు కలసి వ్యతిరేకించి ఆ భూములను అన్యాక్రాంతం గానివ్వకుండా అడ్డుపడ్డారు. వీరిపైకి జమీందారు తన మనుష్యులను 200 మంది వరకు పంపాడు. కాని ప్రజలందరు కలసి ఎదుర్కోడానికి తయారుగ ఉండడం జూచి కాలికి బుద్ధిచెప్పారు. అయితే పోలీసు ఉద్యోగస్థులుచేసిన పని ఏమిటో చూడండి. 19 మంది గ్రామస్థులమీద సెక్యూరిటీకేసులు బనాయించారు. కామ్రేడ్స్ జగన్నాధరావు, తాతయ్య వగైరా ఆరుగురిమీద, కాజ పొలిమేరలలోకి రాకూడదంటూ ఆర్డరొకటి జారీచేశారు. జమీందారు మనుష్యులు, జమీందారు, దివాను మాత్రం స్వేచ్ఛగ తిరుగవచ్చు! తమ ఘాతుక చర్యలకు ఎప్పటివలె ప్లానులువేస్తూ ఉండవచ్చు!

(3) గాజుల్లంక, కిష్కిందాపాలెం, ఆముదాలలంక, పోతార్లంక, తిప్పలకట్ట, లంకల పొలాలు అచ్చటి రైతులు సంవత్సరాల కొలదీ చేసుకుంటున్నారు. 1860 నాటి సర్వే లెక్కలలో ఈ పొలాలన్నీ రైతు భూములుగ చూపబడి ఉన్నవి. కాని ఈ లంకలు విరిగి నదీపాతమై తిరిగి బయటపడినప్పుడంతా జమీందారు ఈ పొలాలన్నీ తన సొంత భూములుగా కరణాలచేత నమోదు చేయించుకుంటూ వచ్చాడు. తాను సొంతంగా సాగుచేస్తున్నట్లు తప్పుడు వ్రాతకోతలు ఒక ప్రక్క తయారుచేస్తూవచ్చాడు. మరో ప్రక్క రైతులలో చీలికలు పోటీలుపెట్టి, విపరీత కౌళ్లు ప్రతిసంవత్సరం వసూలు చేయసాగాడు. రైతులకు శిస్తాయితీ పట్టాలిచ్చి, యెకరానికి రూ. 3-7-0 శిస్తు వసూలు చేసుకోడానికి బదులు, యెకరానికి 60 నుండి 200 రూ. ల వరకు కౌలు వసూలుచేస్తూ వచ్చాడు.

ఈ సంవత్సరం అంతటితో ఆగలేదు. ఈ పొలాలు తన పేరిట ఎన్ని తప్పుడు వ్రాతకోతలలో ఉన్నప్పటికీ, కాంగ్రెసు మంత్రివర్గం తేబోయే చట్టంతో కొంతైనా నష్టం కలుగుతుందనుకున్నాడు. ముందుగానే అమ్ముకుంటే ఏదిక్కూ లేదనుకున్నాడు. గాజుల్లంకలో 60 యెకరాలు 60 వేల రూపాయలకు లాలావారి లంకలోని 280 ఎకరాలు దోనేపూడి షాహుకారులకు సుమారు 4లక్షల రూపాయలకు అమ్మాడు. రైతులు అమ్మకాన్ని వ్యతిరేకించారు. తమ్ము ఇన్ని సంవత్సరాలుగా మోసంచేసి శిస్తు రేటుకు బదులు విపరీతమైన కౌలు రేట్లను వసూలుచేస్తూ వచ్చారని గ్రహించారు. ఈ పొలాలన్నిటి మీద తమదే పట్టాహక్కు అని తెలుసుకున్నారు. తమ పొలాలు ఇతరులకు అన్యాక్రాంతం కానివ్వకుండా నిలబడి పోరాడుతున్నారు.

జమీందారు ఎస్టేటంతటినుండి 3, 4 వందలమందిని ప్రోగుచేసి రైతులపైకి పంపించాడు. రైతులు గట్టిగా ఎదుర్కొని నిలబడేటప్పటికి కాలికి బుద్ధిచెప్పారు. కాని పోలీసు అధికారులు, ప్రభుత్వోద్యోగులు చేసిందేమిటి? రైతులపై దౌర్జన్యానికి పంపిన దివానును, జమీందారును అరెస్టుచేశారా? లేదు. ఇన్ని సంవత్సరాలుగా రైతులనుండి అన్యాయంగా దోచుకొన్న విపరీత కౌలు డబ్బును వాపసు చేయించలేదు. రైతులకు పట్టాలిప్పించడానికి ప్రయత్నించలేదు. చేసిందంతా రైతులను, జమీందారు మనుష్యులను ఇద్దరికీ పొలాలలోకి పోవద్దని 145 సెక్షను జారీచేశారు! పోలీసులను కాపలా పెట్టారు!

(4) వెలివోలులో రైతులపైకి చల్లపల్లి జమీందారు తన మనుష్యులను పంపించి దౌర్జన్యం చేశాడు. కాని పోలీసులు రెండు పక్షాలవారిని మొదట అరెస్టుచేశారు. కాని జమీందారీ మనుష్యులను త్వరలో విడుదల చేస్తే ఆశ్చర్యమేమీ ఉండదు.

వడకుదురు, నిమ్మగడ్డ, పుర్రిటిగడ్డ, నాదెళ్ళవారిపాలెంలో లంక పొలాలు సాగుచేసుకుంటున్న రైతులను జమీందారు మాటలువిని పోలీసులు 10 మందిని అరెస్టుచేశారు.

(5) ఎరుకోపాడులో గంపలగూడెం జమీందారు హరిజనుల పొలాలు ఆక్రమించుకోవాలని ప్రయత్నించాడు. తిరువూరునుండి రౌడీలనుతెచ్చి వారిపై దౌర్జన్యం గావించాడు. కడకు పోలీసులు జమీందారు మనుష్యులను తాకకుండా అచ్చట రైతులను 36 మందిని అరెస్టుచేసి సెక్యూరిటీకేసు (జామీనుకేసు) పెట్టారు. 50 మైళ్ళ దూరంలో నున్న బెజవాడలో కేసు విచారణకు అని రైతులను త్రిప్పుతున్నారు.

(6) చింతలపూడి తాలూకాలో పోతునూరు మొఖాసాదారుడు, రైతుల పొలాలను ఆక్రమించుకోవాలని జూచాడు. రైతులు వ్యతిరేకించారు. రైతులు 26 మందిని జామీన్ కేసుపెట్టి 22 మందినుండి పూచీకత్తులు తీసుకున్నారు.

(7) మూరావరం రైతుల పొలాలను 150 యెకరాలను, కలవలపల్లి జమీందారు ఆక్రమించుకోవాలని చూస్తున్నాడు. తన మనుష్యులను పంపి రైతుల పొలాలనుండి పంటను కోయించి తెచ్చాడు. ఈమధ్యనే రైతులపై దౌర్జన్యం గావించాడు. చాలమందికి బలమయిన గాయాలు కూడ తగిలాయి.

(మిగతా 11వ పేజీలో)

జాగీర్దారుల వతన్దార

ఎదిరించిన

జిల్లాలో ఆంధ్రమహాసభ ఉద్యమం, దాని ప్రక్కనే చేనేత పారిశ్రామికఉద్యమం చిలువలు పలువలువలై ముంచుకురుకు తుండడం,ప్రజాప్రతిఘటనరోజురోజూఅధిక మవుతుండడం, చూచి అధికారులు, దొపిడీ ముఠా ఓర్వలేకపోయారు. కుట్రలు పన్ని ప్రజాఉద్యమ వ్యాప్తిని అరికట్టడానికి ముగ్గురు జిల్లానాయకులను, బద్దం ఎల్లా రెడ్డిగారిని ప్రభుత్వం వారి స్వగ్రామాలలో నిర్బంధించింది.

లెవీవసూలు దౌర్జన్యాలు

హుజూరాబాదు తాలూకాలోని కేశవా పురం గ్రామంలో ప్రజలంతా గ్రామాధికారి బాధలు పడలేక ఆంధ్రమహాసభలో చేరి ఐక్యంగా ప్రతిఘటించడం మొదలుపెట్టారు. ఆ గ్రామాధికారి, ఆ ప్రాంతపు పెద్ద జమిం దారుకైన, అక్కన్నపేట దొరాకారు, గుండవరం జగన్నాధరావు (సీటు జనగామ జమీందారులకు బంధువులు) లు అధికారు లతో కుట్రలుపన్ని ఆ గ్రామ ప్ర జ ల ను అణచడానికి పూనుకున్నారు. దువ్వం తాలు క్దారు (రెండవ తాలుక్దారు) తహసీల్దారు లను వాని సిబ్బందితో సహా గ్రామానికి తీసుకవచ్చారు. రైతులు తాము యివ్వ వలసిన లెవీ ధాన్యాన్ని అదివరకే గోదా ములో దాఖలు చేసినప్పటికీ రెండవ తాలు క్దారు తన సిబ్బందిని రైతుల యిండ్లలో బలవంతంగా దూర్పితిండి. విత్త నాల కొరకు ఉంచుకున్న ధాన్యాన్నంతా దోచ్చివేశారు. రైతులు యిదేమన్యాయ మని చెప్పకుంటే దువ్వం తాలూక్దారు రైతులపైబడి తన చేతి కర్రతో కొట్ట సాగారు. రైతులు దీన్ని సహించలేక ఎదురుతిరిగి తగినబుద్ధి చెప్పారు. ఉద్యో గులు కాలికి బుద్ధిచెప్పి పారిపోయారు. తర్వాత రిజర్వు పోలీసులు గూడావచ్చి 31 గురు రైతులను అరెస్టుచేసి కేసు పెట్టారు. ప్రజలు భయపడక ధైర్యంగా చెబ్బాన్నారు ఆ ప్రాంతమంతా కదిలి పోయింది. హుజూరాబాదుమున్సిఫ్కోర్టులో కేసు నడుస్తున్నది. ఆకునూరు దురంతాలు జరిగిన కాలంలోనే యిదిజరిగింది. దీనితో అధికారుల, జమీందారుల దౌర్జన్యాలను దోపిడీని ప్రజలు ఎదిరించడంచూచి ప్రభుత్వంగాభరావద్దని. వెంటనే పైవిధంగా నాయకులను నిర్బంధించింది.

ఈ నిర్బంధాలతో ప్రజాపెల్లువ ఆగి పోతుందనీ, ప్రజలు భయపడిపోతారనీ ప్రభుత్వం ఆశించింది. కాని ప్రజలు వెను కటి ప్రజలుకారు. తమ ఐక్యత సత్తాను గుర్తించారు. ఈ నిర్బంధాలను నిరసిం చారు. దృఢనిశ్చయంతో ముందుకు వెళ్ళ డానికి నిశ్చయించారు. నాయకులు నిర్బంధం లోవున్నా బయటవున్న కార్యకర్తలకు తోడ్పడుతూ ఉద్యమాన్ని ముందుకు తీసుకపోతున్నారు.

నర్సక్కపేటలో గ్రామాధికారుల దుండగాలు

సిరిసిల్ల తాలూకాలో నర్సక్కపేట గ్రామంలో రైతులు చెల్లించిన లెవీ ధాన్యా నికి పైక మివ్వక పటేలు పటవారీలు (గ్రామాధికార్లు) మ్రింగివేశారు. ఎన్నిసార్లు అడిగినా యివ్వలేదు. పోలీసు పటేలు వరి పొలాలను కొందరు రైతులు ధాన్యం కౌలు పైన సాగుచేశారు. నీరుపారక పైరు చాల భాగం ఎండిపోయింది. ఆంధ్రమహాసభ కార్యకర్తలసహాయంతో దరఖాస్తులు పెట్టు కొని ప్రయత్నించడంవలన లెవీ, పర్చేజు ధాన్య మాఫు (రెమిషన్) అయినది. కాని పండిన కొద్దిమాత్రం పైరునుకోసి ఎయారు చేసిన ధాన్యాన్ని సొంతం ఏమి మిగుల్చ కుండా, కౌలుకిచ్చిన పటేలు, గుండాలను ప్రాగించి తెచ్చి ఆకస్మికంగా రైతులపైదాడి చేసి కొట్టించిఎత్తుకపోయారు.పోలీసులవద్ద దరఖాస్తుపెట్టినా ఏమీ చర్యతీసుకొనలేదు.

ఆంధ్రమహాసభ తాలూకా నాయకులు భూపతిరెడ్డి, అమృతలాలు గారు రైతు లను తహశీల్దారువద్దకు తీసుకపోయి పై రెండు విషయాలలో దరఖాస్తులు పెట్టించి పటేలు పట్వారీల దౌర్జన్యాలు మాన్పించా లని కోరారు. తహశీల్దారు ఆ గ్రామానికి వెళ్ళి ఆంధ్రమహాసభ కార్యకర్తల సమ క్షంలో విచారించక తప్పిందికాదు. విచా రణలో ప్రజలంతా ముందుకువచ్చి సాక్ష్య మిచ్చారు. తాహశీల్దారు లెవీధాన్యం పైకం ఎత్తుకపోయిన రైతుల ధాన్యాన్ని వెంటనే యివ్వాలెననీ, లేకపోతే మోఅత్తల్ (సస్పెండు) చేస్తాననీ బెదరించి వెళ్ళిపో యాడు. కార్యకర్తలు లెక్కప్రకారం రైతులకు రావలసినపైకం, ఎత్తుకపోయిన ధాన్యాన్నీ యిప్పించారు

వల్లంపాట్లలో ఉద్యోగుల లంచాలు

లెవీధాన్యం ఎకరానికి 3 మణుగులు చెల్లించినప్పటికీ కొనుగోలు (పర్చేజు) ధాన్యం పేరుతో బలవంతంగా వసూలు చేయడానికి అధికారులు పూనుకున్నారు. లెవీధాన్యం చెల్లించిన తర్వాత బీదరైతుల వద్ద మిగిలేది తక్కువ. అది వాళ్ళ అవ సరాలకే సరిపోదు. ధనికరైతులు, యిజ మానులు లంచాలిచ్చి తప్పుకొని బ్లాకు మార్కెటులో అమ్ముకుంటారు. ఎటుతిరిగీ బీదరైతులకే తిప్పలంతా. ఈ కొనుగోలు ధాన్యం కొరకు ఉద్యోగులు, ముఖ్యంగా గిర్దావరులు (ధాన్యం ఇన్స్పెక్టరులు) గ్రామాలమీద వస్తారు. ఇది వాళ్ళ లంచాల పంట. రైతులకు ప్రాణసంకటం: ధాన్యం సాంతం తీసుకపోతానని బెదరిస్తూ ధాన్యం లేకపోతే కొని తెచ్చి యివ్వడానికి నిర్బం ధిస్తూ రైతులందరినుండి విరివిగా లంచాలు వసూలుచేసుకుంటూ గ్రామాలలో తిరగడం మొదలుపెట్టారు. రైతులను నానాబాధలు పెట్టారు. వ్యవసాయపు పనులనుగూడ మాన్పించారు.

వల్లంపాట్ల గ్రామానికిగూడా గిర్దావరు వచ్చి గ్రామాధికారుల తోడ్పాటుతో రైతు లను కొనుగోలు ధాన్యం కొరకు నిర్బం ధించసాగాడు. రైతులు అదివరకే లెవీ ధాన్యం చెల్లించుకున్నారు. కొందరిరైతుల వద్ద మాత్రం తిండి, విత్తనాల కొరకు ఉంచుకున్న ధాన్యం కొద్దిగా ఉన్నది. కొందరివద్ద అదీలేదు. రైతులు వెంటనే కరీంనగరం వెళ్ళి ఈ అన్యాయం మాన్పిం చమని తాలూక్దారువద్ద దరఖాస్తు పెట్టు కున్నారు. రైతులలే... గిర్దావరు గ్రామాధికారులు పై బలవంతంగా దొంగలవలె దొరల ధాన్యమంతా ఒక గింజైనా మిగులకుం.. ఎత్తుకపోయి చావడిలో పోసుకున్నారు. పైగా తూకంవేసి తీసుకోవలని యుంటే కొలపాత్రతో తీసుకొని అసలు తీసుకున్న ధాన్యానికి తక్కువలెక్కలు వ్రాసిపెట్టారు.

రైతులు తిరిగివచ్చి జరిగిన యీ గారు జాన్ని చూచి దుఃఖించారు. తమ కుటుం బాలు యిక తిండిలేక మాడవలసిందేనా యని తలపుకువచ్చి క్రోధావేశం పొందారు. రైతులంతా కలసి ఆవేశంతో చావడివద్దకి వెళ్ళారు. గిర్దావరును, గ్రామాధికారులను గట్టిగా మందలించి తమ ధాన్యాన్ని తిరిగి

ఈ కీలుబొమ్మలెందుకు?

"స్వదేశ సంస్థానాధిపతులు బ్రిటిష్వారికి చాలా విధేయులుగా వుంటున్నారు. బ్రిటిష్వారి కరుణపైనీ, ఆయుధాలపైనీ వాళ్ళు బ్రతుకు తున్నారు. 18 వ శతాబ్దం రెండవ భాగంలోనూ, 19 వ శతాబ్దం మొదటి భాగంలోనూ వచ్చిన పోరాటాల్లో బ్రిటిష్వారు బలపర్చి వుండకపోతే చాలమంది స్వదేశ సంస్థానాధిపతులు యీనాడు కనిపించకుండా పోయి వుండేవారు. శాంతదేశాన్నంతటికీ విరుగుడుగా ఉపయోగపడుతూన్న యీ సంస్థానాలు మనకు బ్రహ్మాండమైన రక్షణ నిస్తున్నాయి. విధేయులైన యీ సంస్థానాధిపతులవల్ల బ్రిటిష్వారిని తుడిచిపెట్టే తిరుగుబాటు భారతదేశంలో రావడం కష్టమైన సంగతి."

— సామ్రాజ్యవాద చరిత్రకారుడు రష్బ్రూక్ విలియమ్స్

(ఈవెనింగ్ స్టాండర్డ్ పత్రికలో 28-5-1930)

"రాజకీయాధికారం లేకుండా, కీలు బొమ్మలుగా స్వదేశ సంస్థానా లను మన చేతిలో వుంచుకుంటే, మన నౌకాధిపత్యం వున్నంతకాలం మనం భారతదేశంలో వుండిపోవచ్చు."

— గవర్నర్ జనరల్ కానింగ్

(30 ఏప్రిల్ 1860)

"భారతదేశంలోని జుగుప్సాకరమైన బ్రిటిష్ విధానానికి, యీ స్వదేశ సంస్థానాధీశ్వరులు పెద్ద అండలు. భారతదేశాభివృద్ధికి పెద్ద అడ్డంకులు."

— కారల్ మార్క్స్

(1853)

మిలిటరీ ... పట్టిచేతులతో పున్నప్రా (తిరువా...

అక్టోబరు 24 న ఆలప్పీ వీధులు ప్రజల ప్రదర్శనాలతో దద్దరిల్లి పోతున్నాయి. పట్టణానికి 3 మైళ్ళ దూరంలో పున్నప్రా వద్ద తిరువాన్కూరు దివాన్ సర్ సి. పి. పెట్టిన మిలిటరీ ఇన్నాళ్ళుగా సాగిస్తూన్న దురంతాలను, ఇంక ప్రజలు భరించలేక పోయారు. పదివేలమంది పెద్ద ఊరేగిం పుగా బయల్దేరి మిలిటరీ క్యాంపును స.. పించారు.

క్యాంపులో 48 గురు సోల్జర్లువున్నారు తమపై వస్తూన్న జనప్రవాహాన్ని చూసే టప్పటికి వారికి బెదురుపుట్టింది. కాని కెప్టెన్ తన కుక్కబుద్ధి మానదలచుకో లేదు. బహువినయంగా దిగివచ్చి ప్రజలన క్యాంపులోనికిఆహ్వానించాడుప్రజలువగ్గర రాగానే కాల్చమని ఆజ్ఞయిచ్చాడు. వెంట మిలిటరీ విడిసిన రెండస్థులమేడ కిటి నుండి తుపాకి గుళ్ళు కురియ సాగాయి.

కార్మికుల వీరత్వ...

కార్మికులు వెంటనే నేలపై ప... క్యాంపువేపు అతి వేగంగా పాక... వారిపై రివాల్వరుతో కాలుస్తూ, ... నిలబడ్డ కెప్టెన్ను కార్మికులు బల్లె పొడిచిచంపివేశారు జనసమూహ.. ప్రవేశించింది. తోటాల్లు పోగానే సిపాయిలు బైనెట్లనాగి... పడ్డారు. కాని, కార్మికులన్ని ముఖాముఖి పాలసేప్ప పో... కొద్దిమంది సైనికులు ...

...ర్జన్యాలను అక్రమాలను

...త పోరాటాలు

...ఐక్యకంఠంతో కోరారు ...న్నంతా మాటలలో మాత్రం ...రు. దీనితో గిర్దావరు పటేలి ...యాడు తనమీద దాడీ చేయ డానికి వచ్చారని రిపోర్టు చేశాడు. రైతులు, కేసుపెట్టాలనే వీరి కుట్రను గ్రహించి భయపడక గ్రామరైతులంతా సిరిసెల్లకు కదిలిపోయారు. భూపతిరెడ్డి అమృతలాలు, ఆంధ్రమహాసభ నాయకుల, నాయకత్వంతో తహసీల్దారువద్ద దరఖాస్తు పెట్టి ధాన్యాన్ని తిరిగి యిప్పించాలెనని కోరారు. తహసీలుదారు వచ్చి విచారణ చేయువరకు సిరిసెల్లనుండి కదలమని పట్టు బట్టారు. తహసీల్దారు వెంటనే వెళ్ళక తప్పిందికాదు. విచారణలో గిర్దావరు, పటేలు పటువారీల దౌర్జన్యాలు లంచాలు, వసూలు చేసుకోదలెననే వారి దురాలోచన బట్టబయలైనవి. తహసీల్దారు అక్కడికి వెళ్ళేముందు ఆంధ్రమహాసభ వారినెవరినీ తీసుకరావద్దని రైతులను బెదరించాడు. కాని నేటి రైతులు వేరనే సంగతి అతనికి తెలియదు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు గూడ విచారణ సమయంలో వెంట ఉన్నారు. తహసీల్దారు గిర్దావరును పటేలు, పటువారీలను గట్టిగామందలించి అధికంగా వసూలుచేసిన ధాన్యాన్ని రైతులుకిచ్చివేయు మని చెప్పక తప్పిందిగాదు. ఆ ధాన్యాన్ని ఆంధ్రమహాసభ కార్యకర్తల తోడ్పాటుతో వాపను తీసుకున్నారు.

తంగెలపల్లిలో పెళ్ళికట్నాలు

తంగెలపల్లి గ్రామం గ్రామాధికారి రంగారావు కుమారుని పెండ్లివచ్చింది. ఈ పెండ్లి ఖర్చులన్నీ గ్రామప్రజలే భరించాలి గదా! అంతేగాదు దీన్ని పురస్కరించు కొని తన సంపాదనకూడ కొంత పెంచు కోవాలి. గ్రామ ప్రజలపైన 10 వేల రూపా యల పన్ను వేశాడు. ఒక్క చేనేత పారి శ్రామికులపైననే 7 వేల రూపాయలు వేశాడు. గొల్లవాండ్లు తమకున్న ప్రతి 10 గొర్లు మేకలకు ఒక గొర్రె లేక మేక చొ॥న దాదాపు 100 యివ్వాలని విధిం చాడు. ప్రజలకిది గోరుచుట్టుపై రోకటిపోటై పోయింది. ఆంధ్రమహాసభ నాయకత్వంలో ఐక్యమై ప్రతిఘటించారు. తత్ఫలితంగా యీ అక్రమ వసూళ్ళు ఆగిపోయినవి. ప్రజలను లొంగదీయడానికి నానా కుట్రలను పన్నాడు ఎన్నో చిక్కులు కల్పించాడు. కాని ప్రజలు చలించక ఎదిరించారు. ఏమీ చేయలేక గ్రామాధికారి లోక ముడుచు కున్నాడు.

షాబాసుపల్లిలో అక్రమ వసూళ్ళు

షాబాసుపల్లి జాగీరు గ్రామం జాగిర్దారు ముస్లిం గూండాలను కొందరిని పెట్టుకొని చిరకాలంగా రైతులను అణచిపెట్టి యుంచాడు. జాగీర్దారు సెటిల్మెంటు (బందో బస్తు) చేయించలేదు. మాగాణి వరిపైరు (తరి)కు శిస్తు రొఖ్ఖరూపంలో గాకుండా ఎకరానికి 12 మణుగుల ధాన్యం వసూలు చేసుకుంటున్నాడు. నగటు పంట 16 మణు గులు, బలంచేసుకుంటే కష్టంగా 20 మణు గులు పండుతుంది. మెరక పొలాలకు గూడ శిస్తులు అధికమే. ఇంకా యెన్నో అక్రమ పన్నులున్నవి. దీనికితోడు అన్ని కులాల, వృత్తులవారిచేత రకరకాల వెట్టి తీసుకుంటాడు.

ఆంధ్రమహాసభ ఆ గ్రామాలకు ఆశా జ్యోతిగా కన్పించింది. వెంటనే దాని నాయకత్వంలో ఐక్యమయ్యారు. సెటిల్ మెంటు చేయించమనీ, అక్రమ వసూళ్ళు, వెట్టిచాకిరీ, దౌర్జన్యాలను ఆపివేయించమనీ తాలూక్దారువద్ద దరఖాస్తులు పెట్టుకున్నారు, కాని జాగీర్దారు వినిపించుకోలేదు. కాని ప్రజలు తమ కోర్కెలను స్వయంగా సాధించ బూనుకున్నారు. ధాన్యరూపక శిస్తును, అక్రమ వసూళ్ళను, యివ్వ నిరాక రించారు. వెట్టి చాకిరిని ఆపివేశారు. జాగీ ర్దారు ముస్లిం గూండాలను తయారుచేశాడు: తుపాకులు చేతబుచ్చుకుని గ్రామంలో తిరు గుతూ ప్రజలను, ఆంధ్రమహాసభ కార్య కర్తలను కాల్చివేస్తామని బెదరించారు. తాటాకుల చప్పుడుకు బెదిరే రోజులు పోయినవని తెలియదు పాపం! ప్రజలు భయపడక ఎదిరించడానికి సిద్ధపడేసరికి జాగిర్దారు దిగివచ్చాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలతో రాజీబేరాలు జరిపి రాజీ చేసుకున్నాడు.

సెటిల్మెంటు చేయించడానికి, యిప్పటి పంటకు మాత్రము వరి పైరుకు ఎకరానికి 8 మణుగులు తీసుకొని ముందు నుండి చుట్టుప్రక్కల ఖాల్సా (రైత్వారీ) గ్రామాల శిస్తులనుబోలిన శిస్తులనే తీసు కొనడానికి, వెట్టిచాకిరి, అక్రమ వసూళ్ళు మానుకోవడానికి జాగీర్దారు అంగీక రిం చాడు. తర్వాత పై షరతులలో రాజీ పత్రంవ్రాసి సిరిసెల్ల తహశీలు కచేరీలో దాఖల్ చేశాడు.

పర్చేజింగ్ ఆఫీసర్ల దుండగాలు

సిరిసిల్లతాలూకా తహసీల్దారు తహసీల్ సిబ్బందికొనుగోలు(పర్చేజు) ధాన్యంకొరకు గ్రామాలమీద విజృంభించారు. తహసీల్దారు "తాళ్ళపల్లి" గ్రామానికివెళ్ళి బీద, ధనిక రైతుభేదంలేకుండా కొనుగోలు ధాన్యమివ్వా లెనని నిర్బంధించాడు. లెవీ ధాన్యమిస్తా మనీ, కొనుగోలుధాన్యం యివ్వజాలమనీ అన్నారు రైతులు. ఇద్దరు బీదరైతుల ఇం డ్లలో దూరిచూచాడు. ఒక రైతుయింటిలో ధాన్యమేమీ లేదు. ఒకో రైతు యింట్లో $1\frac{1}{2}$ బస్తా (1 పల్లా) ధాన్యం మాత్ర మున్నది. కొనితెచ్చియైనా లెవీధాన్యం చెల్లి స్తామని ఆ యిద్దరు రైతులు యెంత మొత్తుకున్నా వినక వారు చెల్లించవలసిన లెవీకి 10 రెట్లు అపరాధపు పన్ను విధించి వెంటనేవారి వ్యవసాయపు యెద్దులను, బం డిని జప్తుచేసి అప్పటికప్పుడే వేలం వేశాడు. ఇదంతా ఒక గంటలో జరిగి పోయింది.

కనగర్తిలో రైతుల పోరాటం

కనగర్తి గ్రామంపైన తహసీలుదారు శితకన్ను పడినది. ఇక్కడ ఆంధ్ర మహా సభ బలమున్నది. కొనుగోలు ధాన్యం కొరకు రైతుల పశువులను జప్తు చేశాడు. ఇక్కడి పోలీసు పటేలు(గ్రామమునసబు) పెద్ద భూస్వామి. సాలీనా 80 పుట్ల వరి ధాన్యం పండుతుంది. రైతులే పొలాలకు నీరు యివ్వకుండా తన పొలాలకు పారించు కుంటాడు. రైతులు చాలకాలం నుండి ఘర్షణపడుతున్నారు. ఈ భూస్వామి లం చాలుపెట్టి గెలుపొందుతున్నాడు. తన ధాన్యాన్నంతా బ్లాకుమార్కెటులోఅమ్మి చాల ధనమార్జించుకుంటున్నాడు. ఈ సంవత్స రం పల్లా 36 రూ. (బస్తా 24 రూ) అమ్ముకున్నాడు. తమమీదపడకుండాయితని వద్దధాన్యం తీసుకొమ్మనిరైతులు కోరుచూ వచ్చారు. గత తాబీలో రైతులు బావులతో కొద్దిగా వరిపైరు సాగుచేసుకున్నారు. పంట గూడ నష్టపడినది. ఐనా తమ వంతు లెవీని చెల్లించారు. ఇక వారివద్ద మిగిలింది

(మిగతా ప్రక్కపేజీలో)

మేలుకోవోయ్

తెలుగుబిడ్డా మేలుకోవోయ్
నైజాము
తెలుగుబిడ్డా లేచిరావోయ్ ॥తెలు॥
నదులు నగములు గనులు - వలనల్ల భూములూ
కలవు నీదేశాన - గంజినీళ్ళే కరువ! ॥తెలు॥
దున్ని చెమటోడ్చి ఈ - మన్ను బంగరుజేసి
కరువుతో జచ్చేటి - గతి ఏమివట్టినది? ॥తెలు॥
ఉన్నభూమిని విడచి - కన్నీరు గార్చుచూ
ఇన్నిటికి రిక్తాను - ఎన్నాళ్ళు లాగెదవు ॥తెలు॥
ఈ భూమి నీదెరా - ఈ గనులు నీవెరా
ఎవడు ఈ నైజాము? - ఎవరు ఈ దొరలంత? ॥తెలు॥
రుద్రమాంబ ప్రతాప - రుద్రులకు వారసుడ!
పౌరుషము జూపించి - పరువు నిలబెట్టరా ॥తెలు॥
బండగి రక్తంబు - చింది జ్వాలై లేచి
జాగీరుదారులను - ఊగించివేసింది ॥తెలు॥
నిన్న సూర్యాపేట - మొన్న జనగాములో
నీ యన్నదమ్ములను - నిలబెట్టి కాల్చారు ॥తెలు॥
మగల కండ్లెదుటనే - మగువలను చెరిచారు
ఇంత నీచపుబ్రతుకు - ఎందుకోయీ బ్రతికి ॥తెలు॥
మాడి చచ్చేవారి - మతములన్నీ ఒకటె
కొంపలార్చేవారి - కుట్రలో పడబోకు ॥తెలు॥
కదిలించి బలగాన్ని - ఎదిరించి వైరులను
శక్తిచూపించగల - సమయమిదె లేలెమ్మ ॥తెలు॥

— సుంకర సత్యనారాయణ

...పాకులను ఎదుర్కొన్న (...ంకూర్) వీరులు

చాలమంది గాయాలతో తప్పించుకున్నారు. కార్మికులలో 7 గురు స్వాతంత్ర్య పోరా టంలో వీరమరణం చెందారు. మిలి టరీకి చెందిన రైఫిళ్ళు అన్నీ కార్మికుల చేతుల్లో పడ్డాయి.

ఒక కార్మికుడు తనను బైనెట్టుతో పొడి చిన సిపాయిని చంపి ఆరైఫిలును లాగుకొ న్నాడు. తీవ్రమైన గాయం తగలడంచేత అతడు పాకుకుంటూ యూనియను ఆఫీసు వేపు సాగాడు. అంత బాధలోనూ అతడు రైఫిలు వదలలేదు. చివరకు యూనియను ఆఫీసు చేరకముందే అతడు చనిపోయాడు. చనిపోయేముందు అతడు రైఫిలు శత్రువు లకు దొరకకుండా తగు జాగ్రత్త తీసు కున్నాడు.

రిజర్వు నడ్డగించారు

మిలిటరీ క్యాంపువద్ద ఈయుద్ధం జరుగు ...న్న సమయంలో ఈ వార్తవిని వారిని ...ంచడానికై నాలుగు లారీల నిండుగా ...ర్వ పోలీసును అధికారులు పంపారు. దారిలో 500 మంది మాజీ సైనికులు అడ్డుకొట్టారు. ఒకగంటసేపుఉభయుల పోరాటం జరిగింది. పోలీసుకాల్పుల ...క్కడ ఒకరు చనిపోయారు.

రిజర్వుపోయి చూసేటంతకు ...క్కడ? ఆయుధాలతో కార్మి... ...రూరు. నలుగురు బ్రతికివున్న ...చ్చినవారి శవాలు, మాత్రం ...కనపడ్డాయి.

కరీంనగర్ జిల్లా ప్రజా పోరాటాలు ★

భూమి దురాక్రమణను ఎదిరించిన వీరగాథ

(8వ పేజీ తరువాయి)

కొద్ది! ఐతే మాత్రమేమి? రైతులను, తద్వారా గ్రామప్రజలందరినీ అణచివేయాలి. తహశీల్దారు, హైదరాబాదు కమర్షియల్ కార్పొరేషను (వర్తక కంపెనీ) ఆఫీసరు, ఆ భూస్వామీ కుట్రపన్నారు. తహశీల్దారు, కార్పొరేషను ఆఫీసరు ఆ గ్రామానికివెళ్ళి కొనుగోలు ధాన్యం యిమ్మని రైతులను నిర్బంధించారు. రైతులు యివ్వజాలమన్నారు. అధికారులు పశువులను, ఆస్తిని జప్తు చేస్తామని బెదరించారు. పోలీసులను రప్పించారు. రైతులు ఈ యార్పాటాన్ని చూచివెంటనే కరీంనగరం తాలుక్దారువద్దకు వెళ్ళారు. ఇక్కడ రైతుల పశువులను 93 ని జప్తు చేశారు. రైతులకు నాయకత్వం వహించి నడుపుతున్న రాహులపల్లి నర్సయ్య యను రైతు యింట్లో దూరి విత్తనాలు, తిండికొరకుంచుకొన్న ధాన్యమంతా-వడిధాన్యం, బియ్యం, జొన్నలు, కనగలు-పొగాకు, సొమ్ములు, పాత్రలు వగైరా కనపడినవన్నీ జప్తు చేసుకున్నారు.

ఈ దెబ్బతో భయపడి యీ రైతు నాయకుడు దాసోహం అంటాడనీ, దానితో గ్రామమంతా లొంబడిపోతుందనీ వీరి దురాలోచన. కాని ఎన్ని ఆపదలు వచ్చినా చలించని ధీరుడని వీరికి తెలియదు అతని యింటివద్ద నున్న ముసలమ్మపై దౌర్జన్యం చేయబోతే ఆమె ఎదురుతిరిగి గట్టిగా మందలించింది. దానితో చల్లగా జారుకున్నారు. సొమ్ములు మాత్రం వాపసు యిచ్చి తక్కినవన్నీ పట్టుకపోయారు. పశువులను 3 రోజులు సిరిసిల్లలో ఉంచారు. ఆ 3 రోజులూ తుంపర వాన. పశువులకు మేత లేదు. వణుకుబట్టి ఒక పశువు చచ్చిపోయింది. రాహులపల్లి నర్సయ్యవి రెండు వ్యవసాయ ఎద్దులను, తహశీల్దారు చట్టం ప్రకారం యివ్వవలసిన వ్యవధిని గూడ యివ్వకుండా, వేలం వేశాడు. ఒక పశువు చచ్చిపోవుటవలన తన పశువులనైనా కాపాడుకోవలెనని కొనుగోలు ధాన్యం చెల్లిస్తామని తహసీల్దారు అంతర్నాటకం వలన తనంతటతానే ముందుకు వచ్చినయొక జమీందారును జామీనిచ్చి పశువులను విడుదల చేయించుకున్నారు. తాము కరీంనగరం పోకుండా ఉంటే పశువులను, వస్తువులను జప్తు చేయకుండా నిరోధించేవారమని రైతులు తర్వాత పశ్చాత్తాపపడ్డారు. ఇంత జరిగినా ఆ రైతులు, వారినాయకుడు దాసోహమనక గట్టిగా నిల్చి, పోరాడుతున్నారు. ఈ అక్రమాన్ని అరికట్టాలని ప్రభుత్వానికి తంతులనిచ్చారు. దరఖాస్తులను పంపుకున్నారు. కరపత్రాలద్వారా, పత్రికలద్వారా తీవ్రంగా ఆందోళన సాగించారు.

కరపత్రాలను పంచుతుంటే గోపాలరెడ్డి అను కార్యకర్తను తహసీలు కచేరీలో పేష్కారు అరబ్బులచేత కొట్టించారు. పైగా కార్యకర్తలమీద పోలీసులచేత రక్షణచట్టం 29వ సెక్షన్ క్రింద కేసుపెట్టిందారు. అప్పటికి రైతులు లొంగి రాకపోతే రైతులపైనగూడ కేసులు కల్పించాలని చూచారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్ళి హడావిడిచేశారు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఈ దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపరచారు. రాహులపల్లి నర్సయ్యను, ఇతర రైతులను నిర్బంధించి అరదండాలు ముందట వేశారు. కాని వారు జంకలేదు. ప్రజలే దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సిద్ధపడ్డారు. ప్రజల వైఖరిని కనిపెట్టి నిర్బంధించిన వారిని వదిలిపెట్టి కేసులు పెట్టకుండా పోలీసులు గ్రామం విడిచి వెళ్ళిపోయారు. రాహులపల్లి నర్సయ్య ఈ పోరాటంలో గట్టిపడి రైతుగేయాలు, జాతీయగీతాలు కంఠస్థం చేసుకొని గ్రామప్రజల కెప్పుడూ మేల్కొల్పులు పాడుతూ సంఘటిత పరుస్తున్నాడు.

మల్లారెడ్డిపేటలో పొలాలకు నీరు

"మల్లారెడ్డిపేట" గ్రామంలో చిరకాలం నుండి రైతులు సాగుచేసుకుంటున్న దాదాపు 120 ఎకరాల పోరంబోకు భూములపైన అక్కడి పట్వారీదృష్టి పడింది. యుద్ధంలోకి పోయివచ్చిన ఒక సిపాయిని పట్టుకొని అతనిచేత పైభూముల పట్టాకొరకు దరఖాస్తు పెట్టించి తేలికగా పట్టా చేయించాడు. తర్వాత ఆ సిపాయికి కొంత డబ్బు యిచ్చి తనపేర ఆ భూమిని మార్పించుకున్నాడు. ఆ భూములగుండానే వాటి కవతల నున్న రైతుల సొంత వరిపొలాలకు నీటికాలువ పోతుంది. ఆ పోరంబోకు భూములను కాజేయడంతో తృప్తిజెందక రైతుల పొలాలకు నీటిని బందుపెట్టి ఆ నీటితో తానాక్రమించుకున్న ఈ భూమిలో వరిపైరు సాగుచేయ నారంభించాడు. 2 ఎకరాలవరకు చేసుకున్నాడు. క్రమంగా ఇంకా చాల భూమిని మాగాణి చేసుకోవాలని ప్లాను వేసుకున్నాడు. అవతల రైతుల వరిపొలాలు నీరులేక ఎండిపోతున్నవి. రైతులకు ఎటూ దిక్కుతోచక ఆంధ్రమహాసభను ఆశ్రయించారు. తాలూకా నాయకులు భూపతిరెడ్డి, అమృతలాల్ గారలు వెంటనే అచటికి వెళ్ళి గ్రామప్రజలనందరినీ ఐక్యంచేసి బందుపెట్టిన నీళ్ళను రైతుల పొలాలకు పెట్టించారు. అప్పుడు రైతుల పొలాలు యెండిపోతే ఇప్పుడు అక్రమంగా సాగుచేసిన ఆ పట్వారీ (కరణం) వరిపొలం యెండిపోయింది. చాల పోరంబోకు భూములలో గ్రామాధికారులు గడ్డినాపుకొని రైతుల పశువుల పోనీయకుండా చిరకాలంనుండి తమ పశువులనే మేపుకుంటూ వస్తూన్నారు. పై పోరాటం తర్వాత రైతులు తమ పశువులను తోలి ఆ గడ్డిని మేపుకున్నారు. గ్రామాధికారుల ఇతర అక్రమ వసూళ్ళను, వెట్టిని తమ ఐక్యతాబలంతో ఎదిరించారు. లొంగదీయడానికి గ్రామాధికారుల కుట్రల నన్నిటినీ ఐక్యంగాఎదిరించి, భగ్నం చేస్తున్నారు.

గంభీరావుపేటలో కార్యకర్తలపై వతన్దారుల దాడి

పై మల్లారెడ్డిపేట, అడవికి సమీపంలో ఉన్న గ్రామం. అడవులకు మధ్యను, అడవులకు దగిలియు చాలా గ్రామాలున్నవి. ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద జమీందారులు బలవంతులైన గ్రామాధికారులు (వతన్దార్లు) వేల ఎకరాల భూములు గలిగినవారున్నారు. ప్రజలపైన సాగించే దోపిడీ, హింస అపరిమితం. ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఈ మల్లారెడ్డిపేట పోరాటం ఆ ప్రాంతం ప్రజలకు ఆశాజ్యోతిని చూపించింది. ప్రజలు కదులుతున్నారు. దీనిని జూచి ఆ ప్రాంతపు జమీందారులూ, దోపిడీకి ప్రసిద్ధిజెందిన వతన్దారులు అదిరిపడ్డారు. ప్రజలంతా తిరుగబడతారని భయపడ్డారు. ఆంధ్రమహాసభ ఉద్యమం ఈ ప్రాంతంలో వ్యాపించకుండా చేయడానికీ, మల్లారెడ్డి ప్రజలమీదా, కార్యకర్తలమీదా దెబ్బతీయడానికి కుట్రలు సాగించారు. మల్లారెడ్డి పేటకు 3 మైళ్ళ దూరంలోనే గంభీరావుపేట అనే పెద్ద గ్రామం (కస్బా) ఉన్నది. అక్కడ పోలీసు స్టేషన్ హౌసున్నది. అక్కడ ముస్లింలుగూడ వున్నారు. ఆ ప్రాంతానికది అన్నివిధాలా కేంద్రం. అక్కడ గాంధీ జయంతి బహిరంగసభ జరపడానికి కార్యకర్తలు నిర్ణయించారు. ఒక సంవత్సరం పైనుండి యీ జిల్లాలో యే సభలకూ అధికారులు అనుమతినివ్వడం లేదు. ఈసారిమాత్రం గంభీరావుపేటతో సహా కొన్నిచోట్లకు అనుమతినిచ్చారు. గంభీరావుపేటలో సభ జరిపితే ప్రజలలో చైతన్యం కలిగి ఇక తమ పని పడతారనుకున్నారు జమీందారులు. దోపిడీకి పేరు బొందిన ఆ వతన్దారు భూస్వాములు, ఇక తమ ఆటలు సాగవనుకున్నారు పోలీసులు. ఈ దెబ్బతో ఆంధ్రమహాసభను ఈ తాలూకాలో అణచివేయా అనుకున్నాడు తహసీల్దారు. కొందరు గూండాలను దట్పించ్చి తయారుజేశాడు. కల్లు త్రాగించాడు.

దీనికంతటికీ నాయకత్వం వహించాడు గయసింగారం గ్రామం వతందారు రాజేశ్వర్రావు. ఇతనికి వేల యెకరాల భూమి యున్నది. దీనిలో అధికభాగం బీదరైతులు అడవిని కొట్టి సాగుకు యోగ్యంగా చేసుకుంటే తాము అక్రమంగా పట్టా గట్టుకున్న బాపతే. దాదాపు 8 సంవత్సరాల క్రిందట ఒక బీదరైతు భూమిని ఆక్రమించుకోడానికి 200 మందిని కత్తులు, తుపాకులు, లాఠీలతో సమాయత్తమై పోయాడు. ఆ రైతు జంకక తన ప్రాణాలను గూడ సరకుజేయక లాఠీ తిప్పుతూ తన భూమిలోకి రాకుండా వారి నందరినీ అరికట్టాడు. ఆ రైతుసింహంతో తలపడడానికి ఎవరికీ దమ్ములు చాలలేదు. పిరికితనంగా తుపాకి గురిబెట్టి కాల్చారు, రైతుసింహం నేల కొరిగాడు. 10 వేల రూపాయలు ఖర్చు పెట్టి ఆ హత్యాపాపాన్ని కడుగుకొని శిక్ష పడకుండా తప్పించుకున్నాడీ వతందారు ప్రబుద్ధుడు.

ఇప్పుడు మళ్ళీ ప్రజలమీద కత్తిగట్టి రంగంలో దూకాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు మల్లారెడ్డి పేటలో ఊరేగింపు తీశారు. అజాలగోపాలం స్త్రీలు సహా ఊరేగింపు 200 కుంటు ఊరేగిం ఉన్నారు హిందూ నినాదాలు నడుస్తున్న నున్న మసీ ముస్లిం గూ దారిన పోవద్దని ంగాదా యెందుకని ది మరలించారు కార్యకర్త వెనుకభాగం పైబడి ముస్లిం కొట్టసాగారు. తిరుపతిరెడ్డి, గోపాల గారలకు, కొందరు రైతులకు దెబ్బలుతగిలాయి. ఐనా ప్రజలనురెచ్చిపోయకుండాచేసి శాంతంగా ఊరేగింపును ఇంకో దారిగుండా తీసుకుపోయి సభాస్థలం చేరుకున్నారు. ఇంతలోనే ఇది లోకల్‌బోర్డు స్థలమనీ, తహసీల్దారు అనుమతిలేనిదే ఈ స్థలంలో సభ జరుపుకోగూడదనీ, తహసీల్దారువద్దకి వచ్చి అనుమతి తీసుకోండనీ తహసీల్దారు వద్ద ఉండే ప్యూన్ (చప్రాసీ) చెప్పాడు. దానిపైన అమృతలాల్‌గారు ఆ గ్రామంలోనే మకామున్న తహసీల్దారువద్దకివెళ్లారు. తహసీల్దారు లోపలనుండి బయటికిరాలేదు. అమృతలాలుగారు తిరిగి వస్తుండగా మళ్ళీ ముస్లింగుండాలు అడ్డగించి తీవ్రంగా దెబ్బలు గొట్టారు.

సభాస్థలాన్ని వారు చేరుకున్న తర్వాత జరిగినదంతా తెలిసిమల్లారెడ్డిపేట రైతులూ స్థానిక యువకులూ ఇంక సహించలేకపోయారు. ఉద్రేకపూరితులై ఈగుండాల పని పడదామని సెలవియ్యమన్నారు. కార్యకర్తలు వారించి శాంతపరచారు. ఆ రౌడీలలోసాదాదుస్తులతో పోలీసు కానిస్టేబుల్సు గూడా ఉన్నారు. వారిలో హిందూ కానిస్టేబుల్సుగూడా ఉండి ముస్లిం గుండాలతో పాటు కూతలు కూశారు. దీనితో ఆంధ్రమహాసభను అణచదమేకాక, హిందూ-ముస్లిం తగాదాలు తీసుకురావలెనని పన్నాగము పన్నారు. ఇంత జరిగినా ప్రజలు భయపడలేదు. స్థానిక యువకులు, విద్యార్థులు 200 వరకు సభకు వచ్చారు. మల్లారెడ్డిపేట ప్రజలు 200 మంది అట్లే ధైర్యముగా నిల్చున్నారు. ఉద్యోగులు, జమీందారులు, వతన్దారులు చేసిన కుట్రను బట్టబయలుచేసిసభను ముగించారు. అంతా అయిపోయిన తర్వాత సబ్‌ఇన్స్పెక్టరు కులుకుతూ వచ్చి దెబ్బలుకొట్టిన వారెవరో గుర్తుపడ్తారా అని అడిగాడు. ఇదంతా నీవూ, తహసీల్దారూ, జమీందారులూకలిసి చేసినకుట్రయే. అంతా అయిపోయినాక ఇప్పుడు అడుగవచ్చినావాయని చీవాట్లుబెట్టితే చల్లగాజారుకున్నాడు.

ఇలా కరీంనగర్ జిల్లా ప్రజలు వీరోచిత పోరాటాలు సాగించారు. ఇంకాసాగిస్తారు. వారిలో ఒకనూతనజాగృతి వస్తూంది.

ఉత్తరబెంగాల్‌లో కరువురాక్షసిపై హిందూ-ముస్లిం రైతుల ఐక్యదాడి

జమీందార్ల దొంగనిలవలు పైకిలాగి అమ్మించారు ఐక్యతకై నాయకులకు ఒరవళ్ళుదిద్దారు

ఉత్తర బెంగాల్‌లో రంగపూర్ జిల్లాలోని కూరీగ్రామం మొదలు జల్పయ్‌గురి జిల్లాలోని దేవీగంజ్ వరకుగల మధ్యప్రదేశంలో పెద్ద పెద్ద భూస్వాములు కేంద్రీకరించి వున్నారు. ఒక్కొక్కళ్ళ చేతులలో వేలకొద్ది ఎకరాల భూములుగలవారు ఉన్నారిక్కడ. వీరి భూములు పాలికి దున్నుకుంటూ 15 లక్షల అధీరులు (పల్లెకారులు) బానిసత్వంలో జీవితాలు గడుపుతున్నారు. ఈ అధీరులలో ఎన్రతెంతాకు విశేషమైన పలుకుబడివుంది. ఈ ప్రదేశమంతటా ఈ ఏడాది మరలకరువు సూచనలు తలయెత్తి 1943 కంటె తీవ్రతరమైన కరువు ఏర్పడేలా తోచింది. ప్రభుత్వం బియ్యం సరఫరాచేయలేకపోయింది. బియ్యం ధర మణుగు 50 రూ॥ల (బస్తా 13 రూ. 150 లు) కు పైగా పెరిగింది. అధికారులు కలుగ దొక్కుకొనడంతప్ప ఏమీ చేయలేకపోయారు. భూస్వాములవద్ద ధాన్యంవుంది. తిండిలేక ప్రజలు మాడిపోతున్నా వారు ధాన్యం, బియ్యం ఎగుమతి చేస్తూనేవున్నారు.

కరువుపై కిసాన్ సేనల దాడి

ఈ పరిస్థితులలో కిసాన్‌సభ వెంటనే కార్యక్రమంవేసుకొనివలంటీర్లకోసం పిలుపునిచ్చింది. రంగపూర్ జిల్లాలోనూ, దినాజ్‌పూర్ జిల్లాలోని ఠాకుర్‌గావ్ సబ్‌డివిజన్ అంతటిలోనూ, బోదాపచాపూర్‌లోని మూడు థానాలలో, దేవీగంజ్ థానాలోను కిసాన్ సభకు పూర్తి పలుకుబడివుంది. ఆ ప్రాంతము అంతటా ప్రతి గ్రామంలోను వలంటీర్లు ముందుకు వచ్చారు. పదివేలమంది పైబడ్డ ఈసైన్యంతో కిసాన్‌సభ [illegible] నెదుర్కొ
దానికి పూనుకొంది [illegible] పిట [illegible] యిప్పంట
లకు రెచ్చిపోం [illegible] యిష యిప్పుడు
అది. ఎర్రనా [illegible] నా భి వృ
మెలగుతూ [illegible] గరిక జాతు
ప్రధానద [illegible] పోకల [illegible] కాలం, సొంతంగా
మెరుగా [illegible] రమిచ్చే
ప్రజలకు [illegible] యతులులేవు
జమీం[illegible]

బయటకు తెచ్చారు

[illegible]దళం పూర్ణోకివెళ్ళి స్థానిక వలం[illegible]ం సహాయంతో ఆ గ్రామంలోని [illegible] భూస్వాముల గాదెలను స్వాధీన[illegible]ంది. ఆ ధాన్యాన్ని గ్రామస్థు[illegible]దరా కంట్రోలు ధరకు అమ్మి[illegible]దంగా వచ్చినధనాన్ని స్వంత[illegible]వేసి ముందుపూరుకు పెడతారు. [illegible]ంద్రగోళంలేదు. దోపిడీలేదు. [illegible]ంగా జరిగిపోతున్నాయి.

[illegible]హాట్ థానాలో ఒకగ్రామంలో [illegible] ప్రజల నగలు, వస్తువుల [illegible] మణుగు 13 రూపాయల[illegible]ం అమ్ముతున్నారు. రైతు[illegible]రులోకివచ్చాక ప్రజలవద్ద [illegible] వస్తువులన్నీ వారికి [illegible] అతనివద్ద ధాన్యాన్ని [illegible] అమ్మించారు.

[illegible]దూసి జమీందార్లు తమ [illegible]యడం ప్రారంభించారు. [illegible] జిల్లాలే దాటించడానికి [illegible]ంచారు. వం[illegible] లను పసికట్టాయి. ప్రతిబాటమీద నిశితమైన పహరాలు వేశారు. ప్రతిబండిని శోధించి, ధాన్యం పట్టుకొని వెంటనే కంట్రోలు రేటుకు అమ్మించారు. రహస్యపు పాతరల కూపీ లాగి బయటపెట్టి అమ్మించారు. సంతలు, రేవులు తీవ్రంగా కాపాకాచి అహారపదార్థాలు ఎగుమతి కాకుండా మంచి కట్టుదిట్టాలు చేశారు.

జమీందార్ల కుట్రలు

అధీర (పల్లెకారులు) జాతికి చెందిన హిందూ-ముస్లిం రైతులు జమీందార్లతో సాగిస్తూన్న ఈ ఆహారధాన్యాల పోరాటంలో ఐకమత్యంగా నిలబడ్డారు. వీరిని చీలదీసి పేచీలు పెంచాలని భూస్వాములు ఎన్నోనా ప్రయత్నాలు చేశారు. హిందూ-ముస్లిం జమీందార్లు రైతులను పిలిచి ఆశపెట్టి, భయపెట్టి, మతం పేరుచెప్పి రైతు దళాలలో పేచీలు తేవాలని తీవ్రంగా కృషిచేశారు. కాని, ఈ ప్రయత్నాలన్నీ ఆయా రైతులు వెంటనే రైతుసంఘానికి చెప్పివేస్తున్నారు.

ఠాకుర్‌గావ్ సబ్ డివిజనులోను, దినాజ్‌పూర్‌లోనూ కొందరు జమీందార్లు సరిహద్దులో వున్న పూర్ణియా (బీహార్) జిల్లానుంచి ముసల్మానులను చాలమందిని రక్షణకు తెచ్చుకొని వలంటీర్లు ధాన్యం పట్టుకొనేటందుకు వచ్చినప్పుడు మతకలహాలను రేగగొట్టాలని ప్రయత్నించారు. "ఈ పలం తీర్లు మాధాన్యం అంతా లాగివేస్తున్నారు. అందుచేత మీ జిల్లాకు పంపించలేకుండా వున్నాము. రాండి. ధాన్యం మీరు తీసుకువెళ్ళండి" అనిచెప్పి ముస్లిములను వారు తీసుకవచ్చారు.

రైతు సంఘాలు ఈసంగతిని వెంటనే పసికట్టాయి. వెంటనే హిందూ-ముస్లిం అధీర యువకులను బీహారు సరిహద్దు గ్రామాలకు పంపించి తీవ్రమైన ప్రచారం ప్రారంభించారు. ఇక్కడపూర్ణియా ముస్లిములకు అసలు విషయాలు చెప్పసాగారు. "మీరు మేమూ ఒకరినొకరు చంపుకొంటూ వుంటే ఆనందించాలని జమీందార్లు చూస్తున్నారు. మేము స్వాధీనం చేసుకొంటున్న ధాన్యంలో మీకు అవసరమైనంత మీరూ కొనుక్కోండి. జమీందారు మీవద్ద దొంగమార్కెటు ధర వసూలుచేస్తారు. మేము కంట్రోలు ధరకు అమ్మిస్తున్నాము."......దానితో బీహార్ ముస్లిములకు బుద్ధి తిరిగింది. జమీందార్లు తమరిని మోసపుచ్చినందుకు వారిమీద మండిపడ్డారు. తమ గ్రామాలకు వెళ్ళిపోయారు.

మతకలహాలు నివారించబడ్డాయి

ఠాకుర్‌గావ్‌లోని మరియాలో కాళీమాయిని పాలారించే విషయమై కలహం రగులుతూంది. మసీదువీధిలోంచి ఊరేగింపు నడవనియ్యనంటాడు ముస్లిం జమీందారు. ఆ వీధినే నడచితీరాలంటాడు హిందూ జమీందారు. ఇద్దరూ రైతుల సహాయం కోరారు. రైతుసంఘం వెంటనే కలుగచేసుకుంది. "కొట్లాటలలో చచ్చేది మనం. మనం కొట్లాడుకోవడంవలన బెదురుపోయి లాభపడేది జమీందార్లు. కనక పోరాడుకోవద్దు" అని హెచ్చరించింది. అక్కడ మరి కలహాలు రాలేదు. (మిగతా 13వ పేజీలో)

ప్రజలపక్షాన నిలబడాలి

(7వ పేజీ తరువాయి)

కాని ఇంతవరకు కలవలపల్లి జమీందారును గాని, ఆతడు రైతులపైకి ఎగద్రోలిన మనుష్యులను గాని అరెస్టుచేయలేదు.

(8) పెంద్యాల రైతులు. 360 యెకరాల భూమిని సంవత్సరాలకొద్దీ సాగుచేస్తూ వచ్చారు. రెండేండ్లక్రితం, ఎలమర్రు జమీందారు ఆ భూమిని పెంద్యాల రైతులను సాగుచేసుకోనివ్వక, తూర్పుగోదావరి వసంతవాడ, కాశీపూడి గ్రామాల్లో ముగ్గురికి కౌలుకిచ్చారు. పండిన పంట జమీందారుకు ఇవ్వవలసిన విపరీతమయిన కౌలుకు సరిపోలేదు. కాబట్టి వారీ సంవత్సరం వదులుకున్నారు. తిరిగి పెంద్యాల రైతులు సాగుచేసుకోడం మొదలుపెట్టారు. కాంగ్రెసు మంత్రివర్గం కౌలుచట్టం తెస్తామంది. దీనితో జమీందారుకు కంగారువేసి రైతులను తొలగించాలనుకున్నాడు. ఈ పొలమంతా తన సొంతపొలం, సొంతంగా వ్యవసాయం చేస్తున్నానని రికార్డు తయారు చేసుకోవాలి. అందుచే పోలీసులచేత పెంద్యాల రైతులపై 144 వ సెక్షను జారీ చేయించాడు. తిరిగి కాశీపూడి, వసంతవాడలో తన మనుష్యుల ద్వారా సాగుచేయడానికి పూనుకున్నారు. రైతులకు 144, జమీందారుకు స్వేచ్ఛ.

(9) ఏలూరుతాలూకా నాయుడుగూడెంలో 300 యెకరాల భూస్వామి గారపాటి చినకనకయ్య రైతులపై అనేక దౌర్జన్యాలు గావిస్తూ వచ్చాడు. తన పొలాలకన్నిటికీ నీళ్ళు పారనిదే ఇతర రైతులకు పోనిచ్చేవాడు కాడు. దీనిని వ్యతిరేకించి అచ్చట రైతులు కమ్యూనిస్టులు పనిచేశారు. ఈ అసూయతో అచ్చట కమ్యూనిస్టులపైన అనేక కేసులు పెట్టించాడు. అనేకసారులు దౌర్జన్యం గావించడానికి తన మనుష్యులను పంపాడు. కడకు గత నెల 18 వ తేదీ మాలపల్లిలో తగాదావస్తే దాన్నిసర్ది వస్తూన్న కమ్యూనిస్టు వర్కర్లమీదకు 20 మందిని తన మనుష్యులకు బల్లెములు, కర్రలు ఇచ్చి పంపాడు. ఎంతదూరం చెప్పినా ఆగక పైకివస్తే ఆత్మరక్షణకు పూనుకోవలసి వచ్చింది. అయినా కామ్రేడ్ రాజా రామమోహన్‌రావు బల్లెంపోటుకు గురిఅయ్యాడు. ప్రాణాలు వదిలాడు. కనకయ్యను ఇంతవరకు అరెస్టు చేయలేదు. కాని, గ్రామంలోని కమ్యూనిస్టులను, కనకయ్యకు వ్యతిరేకంగా ఉన్న రైతులను 12 మందిని అరెస్టుచేశారు.

ఏ రైతు పోరాటాన్ని చూచినా పోలీసులు భూస్వాముల జమీందారుల తరపున, యజమానుల తరపున జోక్యం కలిగించుకొని రైతు కూలీలపై నిర్బంధాలు, దౌర్జన్యాలు చేస్తూవచ్చారు.

విద్యార్థులపై లాఠీచార్జి

ఆంధ్ర విద్యార్థులంతా సెలక్షను పరీక్షలు పెట్టి పబ్లికుపరీక్షలకు పోనివ్వకుండా డిటెన్ చేయడం మానుకోవాలని 18 వ తేదీ సమ్మె చేశారు. బందరు ప్రిన్సిపాలు విద్యార్థులకు జరిమానాలు వేశాడు. దానిని వ్యతిరేకిస్తూ సమ్మెచేస్తున్న విద్యార్థులపైన, స్త్రీ విద్యార్థులమీద పోలీసులు లాఠీచార్జీ చేశారు. అలాగే పిఠాపురంలో డిటెన్షనులకు వ్యతిరేకంగా సమ్మె చేసిన విద్యార్థులను కొంతమందిని అరెస్టు చేశారు.

గుంటూరులో "ఆగస్టు 9 దినోత్సవం" జరుపుతూ సమ్మెచేసిన విద్యార్థులపై కక్ష పెట్టుకొన్నాడు వైపు ప్రిన్సిపాలు. మూడు నెలల పరీక్షలయ్యాయి. మరి 6 నెలలకు వచ్చే పబ్లికుపరీక్షలకు 61 మందిని పంపనని ప్రకటించాడు. మరి 256 మందికి వార్నింగు ఇచ్చారు. 186 మందిమీద రూ 500 లు జరిమానాలు విధించాడు. ఈ నిరంకుశచర్యలను వ్యతిరేకిస్తూ, ఒక మాసంరోజులుగ విద్యార్థులు సమ్మెచేశారు. ప్రభుత్వం విద్యార్థుల సమ్మెనునిరసిస్తూ వెంటనే కాలేజికి వెళ్ళాలని ప్రకటించింది. వైపు అమాయిత్యాన్నిగూర్చి పల్లెత్తు మాటకూడ చెప్పలేదు.

ప్రజలతరపున నిలబడాలి: సామ్రాజ్యవాదుల నిర్బంధ విధానాన్ని సాగనివ్వరాదు

"నేనే బయట ఉంటే నా ప్రజలపై దెబ్బ పడనిస్తానా" అన్న ప్రకాశంగారు ప్రధానిగా ఉన్నప్పుడే పోలీసుల దౌర్జన్యం ప్రజలపై ఇంత విరివిగా సాగిపోతూ ఉంది. ప్రజలపై లాఠీ ప్రయోగాలు, దాని వెనకాల సామ్రాజ్యవాదుల వికటాట్టహాసాలు సాగిపోతూ ఉన్నాయి. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని నాశనం గావించి, స్వాతంత్ర్య ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి ప్రజా ఉద్యమాన్ని పెంపొందించే పద్ధతి ఇది ఏ మాత్రమూ కాదు.

ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల క్రింద రైతు కూలీల జీవితం, మధ్యతరగతి ప్రజల జీవితం, మన ఆర్థిక విధానమంతా కుమిలిపోయింది. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల క్రింద బలసిపోయిన జమీందార్లు, పెద్ద భూస్వాములు, దొంగ వ్యాపారస్తులు, ఫ్యాక్టరీ యజమానులు వీరికి వ్యతిరేకంగా నేడు తిండి, గుడ్డకోసం ప్రజలు సాగిస్తున్న పోరాటాలే ఇవి. ఈ ప్రజా పోరాటాలను కమ్యూనిస్టులం అన్నివిధాలా బలపరుస్తున్నాం. మేం ఎంత విష ప్రచారానికి గురిఅయినా ఎన్ని నిర్బంధాలకు గురిఅయినా తమ హక్కులకోసం, తిండి, గుడ్డకోసం పోరాడుతున్న ప్రజలను వదిలి పెట్టలేము.

కాంగ్రెసుమీద అభిమానమున్న ప్రజలనందరినీ మేము కోరేది ఒకటే. ఈ కార్మిక సమ్మెలు రైతుపోరాటాలు విద్యార్థుల ఆందోళన వీటి కన్నింటికీ కారణం కాంగ్రెసు మంత్రివర్గాన్ని పడగొట్టడానికి కమ్యూనిస్టులు చేసే కుట్ర అని కాంగ్రెసు మంత్రివర్గం ప్రచారం చేస్తూఉంది. దీనిలోని నిజానిజములు ఆలోచించండి. కాంగ్రెసు మంత్రివర్గాన్ని కూలద్రోయాలని ఏ కమ్యూనిస్టూ కోరడంలేదు. కాంగ్రెసు మంత్రివర్గాన్ని మేము కోరేదంతా ప్రజల తరపున నిలబడమని కోరుతున్నాం. జమీందారులు భూస్వాములు, ఫ్యాక్టరీ యజమానుల తరపున పోలీసులను పంపవద్దని కోరుతున్నాం. ప్రజలపై సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానాన్ని సాగనివ్వద్దని మాత్రమే మేము కోరుతున్నాం.

కాంగ్రెసుమీద అభిమానమున్న ప్రజలంతా మంత్రివర్గం ప్రజలతరపున నిలబడి పనిచేసేటట్లు, యీ నిర్బంధ విధానాన్నిమానుకొనేటట్లు చేస్తారని మేము కోరుతున్నాం.

ఫారెస్టు ప్రజల కనీస కోర్కెలు నెరవేర్చాలి

అటవీశాసనాన్ని మార్చాలి

మాదల వీరభద్రరావు

1920 లో పల్నాడు ఫారెస్టు సత్యాగ్రహం, 1922-25 లో కోయల మన్యవిప్లవం, 1930 లో వెంకటగిరి ఫారెస్టు రైతుల సత్యాగ్రహం, ఆంధ్ర దేశంలో అటవీశాసనాన్ని ధిక్కరించి వీరోచితంగా పోరాడిన నిదర్శనాలు. ప్రజలను పీడించే ఫారెస్టుశాసనం, అవినీతిపరులైన ఉద్యోగస్థుల లంచగొండితనం, దౌర్జన్యం, నిరంకుశ శిక్షలు, ఫారెస్టు ప్రాంతాలప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నవి. రాష్ట్రంలో 18 వేల మైళ్ళ అడవులున్నా, ప్రజోపయోగాలకు హెచ్చు వుపకరించడంలేదు. వీటినిండా గడ్డివుంది; కాని మన పశువులు గ్రాసం లేక వేలాది చచ్చిపోతున్నై. అడవుల నిండా వృధాగాపోతున్న కట్టెలున్నాయి; కాని వంటచెరుకు కరువై ప్రజలు యిబ్బందిపడుచున్నారు. ఇక్కడ వ్యవసాయ పనిముట్లకు వుపయోగపడే కలప ఎంతో ఉన్నది. కాని రైతాంగానికి వ్యవసాయ పనిముట్లు దొరకక వ్యవసాయమే కుంటుపడుతున్నది. రిజర్వులో 'బేచరాకు' గ్రామాల్లో సేద్యానికి లాయకైన, సారవంతమైన భూములున్నై. కాని లక్షలాదిజనం సెంటు పొలంలేక తెంపరలాడవలసి వస్తున్నది. చిల్లర అడవి ఫలసాయాన్ని సక్రమంగా వుపయోగించక పోవడంవల్ల యీ అడవులనుండి రాబడికూడా తరుగైంది. అడవులనుండి వచ్చు అదాయం అధికార్ల జీతాలకు, ఎష్టాబ్లిష్‌మెంటులకే సరిపోతున్నది. వీటినిగూర్చి ప్రభుత్వానికింతవరకు సమగ్ర దృక్పథంలేదని బడ్జెటు చర్చవల్ల తేలుతున్నది. ప్రైవేటు ఫారెస్టులను ప్రభుత్వం స్వాధీనం చేసికొనుటకు ఇప్పట్లో సాధ్యంకాదని, 'పంచాయతీ ఫారెస్టులను ఫారెస్టు డిపార్టుమెంటు కంట్రోలుక్రింద వుంచితే బాగుంటుందేమోనని రెవెన్యూ మంత్రి కరంత్‌గారు సమాధానం చెప్పారు. 1938 కాంగ్రెసు మంత్రివర్గం తగు శ్రద్ధ తీసుకోకముందే రాజీనామా యిచ్చింది. ఇప్పటికయినా ప్రజాస్వామికపద్ధతులలో యీఅటవీ శాసనాన్ని సాకల్యంగా మార్చాలి. ఫారెస్టు ప్రజల కష్టాలను తొలగించాలి. అందులకు యీ క్రింది కనీసకోర్కెలను నెరవేర్ప గోరుతాము.

ఫారెస్టు చట్టం మార్చాలి

ఇపుడున్న చట్టం ప్రకారం కోర్టులో కేసు జరుగుతుండగనే బండి, ఎద్దు, ఆస్తి మొత్తాన్ని వశపరచుకో వచ్చు. వేలం గూడా వేయవచ్చు. అనుమానమున్న పశువులనల్లా స్వాధీనపరచుకో వచ్చు. ఎంక్వయిరీకిగాను 'సెర్చివారంటు' యివ్వవచ్చు. మేజస్ట్రేటు నుంచి అరెస్టు వారంటు లేకుండానే ఫారెస్టు ఆఫీసరు ఎవరినైనా, ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు. కాంపౌండు ఫీజు 15 రెట్లవరకు పెనాల్టీ వేయవచ్చు.

ఈ చట్టంలో ప్రజలకు యిబ్బంది కల్గించేభాగాలు అనేకమున్నవి. అందుచేత ప్రజా ప్రతినిధులతో గూడిన విచారణ సంఘముతో సంప్రదించి మొత్తం చట్టాన్నే ప్రజోపయోగకరంగా మార్చాలి.

పంచాయితీకే అధికారం

ఇన్ని నిర్బంధాలు ఉన్నందున లక్షలాది అరెస్టులు జరుగుచున్నవి. విపరీతమైన జరిమానాలు విధిస్తున్నారు. వీటన్నిటిని ఆపుచేయించాలంటే ఆయా గ్రామస్థులైన పంచాయితీదార్లే చేయగల్గుతారు. చట్టంకంటె ఎన్నోరెట్లు లోకానుభవమే ముఖ్యం.

ఫారెస్టులమీద వయోజన వోటింగుతో ఎన్నుకోబడిన పంచాయితీబోర్డులకే కంట్రోలు వుండాలి. ఇప్పటివలె గ్రామోద్యోగులను ఎక్స్ అఫీషియో మెంబర్లుగా వుంచటం మానాలి. పంచాయతీదార్ల విధులను స్పష్టంగా వివరించాలి.

కూపుల మార్పు

అడవిని అభివృద్ధిపరచటానికని 'కూపుల పద్ధతి' ఏర్పరిచారు. వీటని రహదారీ ప్రక్కనో, నీటివసతులున్న చోటనో ప్లాట్లుగా పెడుతుండుటవల్ల పశువులుసులభంగా వీటిలోపడుతుంటై. ఇప్పుడు ఎమర్జెన్సీ కూపులని 400 ఎకరాలు లాట్లు పెట్టి యుద్ధకాలంలో వంటచెరుకు క్రింద కొట్టించారు. బొగ్గుకాల్చు కంట్రాక్టర్లు వేలుగడించారు. ఈ కూపులను సాగుబడిభూములకు 1 మైలు దూరంలో వుండునట్లు చేయాలి. ఏపె మొదలయిన కలపచెట్లు, మంచి గంధం చెట్లువేసి అడవిని అభివృద్ధి పరచాలి.

పుల్లరి రద్దుచెయ్యాలి

పుల్లరి 1910 సం॥ వరకు ఆవుకు 0-4-0, గేదెకు 0-8-0, గొర్రెకు0-2-6. తర్వాత వీటిని రెట్టింపుచేశారు. 1940 లో కాంగ్రెసు హయాములో సగం పుల్లరి తగ్గించారు. బొంబాయి రాష్ట్రంలోవలె మన రాష్ట్రంలోకూడ అడవిపుల్లరిని పూర్తిగా రద్దుచేయాలి.

అడవి ఫలసాయం

అడవిలో ఆకు తెచ్చుకొనుటకు అణా చీట్లిస్తారు. ఈ చీట్లకు పర్మిషన్ వచ్చేదాకా వేచివుండాలి. ఇదివరలో గడ్డి బండ్లు తెచ్చుకొనుటకు రహదారీ లిచ్చేవారు ఇప్పుడదిలేదు. గాలి, వర్షాలకు అనేకచెట్లు విరిగి పడిపోయినై. కంట్రాక్టర్లు కూపులలో కొట్టగా మిగిలినకట్టెలు వృధాగా పడివున్నై. వ్యవసాయ పనిముట్లు చిన్నవి కొట్టుకున్నా క్రిమినల్ కేసులుపెట్టి జరిమానాలు విధిస్తున్నారు. అడవి ఫలసాయాన్ని వేలం వేడుతున్నారు. అడవి మృగాలువచ్చి పొలాలను నష్టపరచకుండా కావలికి మంచెలు వేసుకోటానికి చిన్నకట్టెలు తెచ్చుకున్నా కేసులు పెడుతుంటారు.

అందుచేత పశువుల మేతకు పనికి వచ్చు పచ్చిగడ్డి, ఎండు వంటచెరుకు, వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, చిల్లర అడవిఫలసాయం మొదలైన వాటిని నెత్తిమోపులతో ఉచితంగా తెచ్చుకునే ఏర్పాట్లు చేయాలి.

—ఇతరగ్రామస్తులు బండ్లపైతెచ్చుకొనగోరేవారికి స్వల్ప రేటు నిర్ణయించి రహదార్లు నొసగాలి.

—ఈరహదార్లనిచ్చేబాధ్యత ప్రజలకందుబాటులో గల గ్రామ పంచాయితీలకివ్వాలి

— అడవి ఫలసాయాన్ని యీ ఫారెస్టు కేంద్రాలలోనే కార్ఖానాలు పెట్టి సామానులుగా మార్చి స్వల్పధరలకు ఎగుమతి చేయాలి. కంట్రాక్టులు, వేలం పాటలు మానాలి.



పార్టీపండుకు తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా యేదిద గ్రామంలో పార్టీసభ్యులు పాటబూరివరులు వరికోతకోసినదృశ్యం

సాధారణంగా అరకకు ... లంచం. పుల్లరిచీటీ వ్రాసినం... అలంచం. పడక పుల్లరి 0-4-0. వ్యవసాయ పనిముట్లు అమ్ముకునేవారిష్టం 4-0-0 లంచం. ఈ విధంగా అధికార్లకు ముడుపులు చెల్లించుకొంటేనేగాని పని జరగడంలేదు. లేదా దొంగతనం చేయాలిసివస్తోంది. ఆఫీసర్ల క్యాంపుల సందర్భంలోను, రోడ్డు మరమ్మతు చేయటంలోను, వ్యక్తిగతంగా యిండ్లలో పనిచేయుటద్వారానూ, నిమ్నజాతీయులచేత ప్రత్యేకంగా వెట్టి చేయించుకుంటున్నారు.

లంచాలనూ, వెట్టిచాకిరినీ పూర్తిగా ఆపించుటకై తగు చర్య తీసుకోవాలి.

ఫారెస్టు బంజర్లను సాగుకివ్వాలి

అడవిభూమిని సేద్యానికిస్తే శాస్త్రీయంగా వర్షం తగ్గుతుందంటారు. కాని యీ చిన్న అడవులున్నందున వర్షములు హెచ్చుగా కురుస్తవి అనేదానికి నిదర్శనా లేమీ లేవు. వర్షంయొక్క హెచ్చుతగ్గులు వాయుప్రచారం, భూమధ్యరేఖ నుండి దూరం, సముద్రతీరం నుండి దూరం మొదలైన అనేక స్థితిగతులనుబట్టి వుంటుంది. దీనివల్ల అడవి నష్టపడేదేమీలేదు.

అంచేత సాగుకు లాయకైన అడవి బంజర్లను కూలీలకు, సైనిక కుటుంబాలకు, క్రిమినల్ ట్రైబ్సుకు అమ్ముకునే హక్కులేకుండా సాగుకివ్వాలి. అక్కడ "కాలనీలు" ఏర్పాటు చేయాలి.

జమీందార్లు, అగ్రహారందార్లు మొదలైన ప్రైవేటు మేనేజిమెంటు అధీనంలో వున్న అడవులను వెంటనే ప్రభుత్వాధీనం చేసుకొని, ... అడవి పంచాయితీకే అజమా... ...యాలి.

విజ్ఞా...

అడవి అన... నిలయమైంది. రా... ...లేవు. విద్యా విజ్ఞా... ...లులేవు. ఆస్పత్రి వ... మూఢవిశ్వాసాలతో అజ్ఞానంలో వున్నారు.

స్కూళ్ళు, ప్రసూతి పశువైద్యశాలలు, రోడ్లు నిర్మించాలి. వీరి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

రిజర్వు లైను

గ్రామముల సమీపమున రిజర్వు అడవులున్న, వాటి సరిహద్దుల రిజర్వు లైనును సాగుపొలాలకు ¼ మైలు దూరముగా డిమార్కేటు చెయ్యాలి. చుట్టూ కడపజిల్లాలోవలె ఫెన్సింగ్ వేయాలి.

తుపాకి లైసెన్సులు

రిజర్వులో ప్రత్యేక లైసెన్సులు లేకుండా చేయాలి. ప్రజలను, పైర్లను, పశువులను రక్షించుకొనుటకు ఉచిత తుపాకి లైసెన్సులివ్వాలి.

— పశువుల కాపర్లకు ...గో నిప్పుసంచి వగైరాలు వుంచుకొ... హక్కు యివ్వాలి. కేసులు పెట్టి...

లోగడ రిజర్వులో ... లను మరమ్మతు చేయిం...

'పీపుల్స్‌ఏజ్' సంపాదకీయం

ఆంగ్‌సాన్ విధానం బర్మాకు వచ్చుపన్నతకుదారి

జాతీయైక్య సంఘటనకై కమ్యూనిస్టుల కృషి

బర్మాలో ప్రజలు ఆహారసప్లయిలకోసం ఆందోళన చేస్తున్నారు. శిస్తులను తొలగించమంటున్నారు. బీదరైతులు జమీందారులభూమిని తమకుపంచి పెట్టమంటున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం తొలగిపోయి, దేశం సంపూర్ణస్వాతంత్ర్యం పొందాలని ప్రజలు ఆబాలగోపాలం ఆందోళన చేస్తున్నారు. తిండిదొంగలపై, లంచగొండి ఉద్యోగులపై, బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వంపై పోరాటదీక్షతో ముందుకు వస్తున్నారు. కాని, ఆంగ్‌సాన్ నాయకత్వంక్రింద ఏర్పడిన కొత్త కార్యవర్గం ఈ ప్రజాశక్తిని అందగాతీసుకొని ప్రజాకంటకులపైని, సామ్రాజ్యవాదులపైని పోరాటం కొనసాగించడం లేదు. దాని దృష్టి ఈప్రజాకంటకులపై లేదు. కమ్యూనిస్టులపై పోరాటంమీదనే దృష్టినంతటినీ కేంద్రీకరించింది. కమ్యూనిస్టులను అణచాలనే ఉబలాటంకొద్దీ, ఈ ప్రజా వెల్లువపైనే దెబ్బతీయడానికి సిద్ధమవుతూంది.

బర్మాలో కమ్యూనిస్టులపై కొత్తదండయాత్ర ప్రారంభమైంది.

అరెస్టులు - నిర్బంధాలు

బర్మారక్షణ చట్టాన్ని రద్దుచేశారు. కాని పాతసామ్రాజ్యవాద చట్టాలక్రింద కమ్యూనిస్టులను అరెస్టు చేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించిన తరువాత థాకిన్‌సోమీద వారంటు రద్దుచేశారు. కాని, గత మేడేనాడు రాజద్రోహకర ఉపన్యాసం ఇచ్చాడన్న నేరంమీద, పెద్ద సాయుధనిబ్బందీనిపంపి ఆతన్ని అరెస్టుచేయించారు.

ప్యాపాన్‌జిల్లాలో ఇద్దరు కమ్యూనిస్టు రైతునాయకులను ఇటీవల అరెస్టుచేశారు. మరినలుగురు రైతునాయకులపై వారంట్లు వున్నాయి. ఈజిల్లాలో కరువుపరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక భరించలేక రైతులు, దొంగవర్తకుల నిలవలను స్వాధీన పర్చుకున్నారు. రైతులనింతబాధ పెడుతున్నా తిండిదొంగల్లో ఒకరినీ ఆంగ్‌సాన్ కార్యవర్గం అరెస్టు చేయించలేదు. కాని, రైతునాయకులయిన కమ్యూనిస్టులపై విరుచుకుపడుతూంది.

రంగూనులో కార్మికులు సాగించిన సమ్మెలకు నాయకత్వం వహించిన వారింకా జైళ్ళలోనే వున్నారు. సమ్మెదారులపై కక్ష సాధించడం జరుగదని కార్యవర్గం ఆనాడు హామీ ఇచ్చింది. కాని, ఆనాడు సమ్మెల్లో పాల్గొన్న వందలాదికార్మికులను మిల్లులోపలికైనా రానివ్వడం లేదు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పన్నాగాలు

ఏవిధంగానైనాసరే బర్మాపై ఆర్థికంగా, రాజకీయంగా తమపెత్తనాన్ని తిరిగి స్థాపింపనమకట్టిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆంటీ ఫాసిస్టు పీపుల్సులీగు'లో కమ్యూనిస్టులకు ఇతరపక్షాలకుమధ్యచీలికలు తేడానికి మొదటినుంచీ కుట్రలుపన్నుతూ వచ్చారు. కమ్యూనిస్టునాయకత్వం క్రింద సాగిన ఫాసిస్టు ప్రతిఘటనాఉద్యమమూ, 1945 మార్చి-ఏప్రిల్‌లో ఆంగసాన్ నాయకత్వం క్రింద జరిగిన బర్మా సైనిక తిరుగుబాటూ-ఈరెండూ కలిపే జపాను వారిని పడగొట్టాయని బ్రిటిష్‌వారికి బాగాతెలుసు.

ఈ ఐక్యసంఘటన ఇంకా కొనసాగి, నానాటికి బలపడినట్టయితే రూపత్తుబర్మా తమపై తిరుగుబాటుచేసేరోజు ఎంతోదూరంలో ఉండదనికూడా వారికి బాగాతెలుసు.

అందువల్లనే వారు, అరెస్టుచేయవలసిన కమ్యూనిస్టు, తదితర ఫాసిస్టువ్యతిరేక నాయకుల లిస్టును జేబులోపెట్టుకొని బర్మాలో అడుగుపెట్టారు. జపానువారిని పూర్తిగా తరిమివేయకముందే అరెస్టులు, నిర్బంధాలు ప్రారంభించారు.

ఒకవైపు యిలా చేస్తూనే మరొకవైపు తమదొర్లను, కీలుబొమ్మలను (బామా, యూసా మొదలైనవారు) ఆంటీ ఫాసిస్టులీగులోనికి చేసుకోవలసిందని ఒత్తిడి చేసాగారు. అటువంటి వారిని లిగినంతగ తీసుకుంటేనేగాని పరిపాలనా బాధ్యతను ఆ సంస్థకు అప్పగించమని బేరంపెట్టారు.

థాకిన్‌సో కమ్యూనిస్టుగ్రూపు జమీందారుల, తిండిదొంగల, లంచగొండి ఉద్యోగులమీద రైతుపోరాటాలను తీవ్రంగా సాగించేసరికి బ్రిటిష్ గవర్నరు ఆ కమ్యూనిస్టుగ్రూపుని, ఎర్రజెండా రైతుసంఘాన్ని నిషేధించాడు.

ప్రజలందరిసానుభూతిని పొంది నానాటికి తీవ్రమవుతూన్న పోలీస్, సివిల్‌సర్వీస్ ఉద్యోగుల సమ్మెలను తనంతటతానెదుర్కొలేక, గవర్నరు ఆంటీఫాసిస్టు లీగుసభ్యులే మెజారిటీగా ఉన్న కార్యవర్గాన్ని ఏర్పరచడానికి ఒప్పుకున్నాడు. రోజురోజుకూ తీవ్రమవుతూన్న ప్రజాపోరాట వెల్లువను అణచడానికి ఒక సాధనంగా ఉపయోగించాలనీ, అలాచేయడంలోనే ఈ జాతీయైక్య సంఘటనను విచ్ఛిన్నం చేయవచ్చుననే గవర్నరు దీనిని ఏర్పరిచాడు.

ఈకార్యవర్గం ఏర్పడినతరువాత,లోగడ ఆంగసాన్‌తో భుజంభుజంకలిపి పోరాడిన థాకిన్‌సోను, ఇతర ప్రజానాయకులను గవర్నరు ఎందువల్ల అరెస్టు చేయగలుగుతున్నాడు? స్వతంత్రసాధనకు మరొక పోరాటం అవసరం లేదని ఆంగ్‌సాన్ అనుకుంటున్నాడు. సంప్రతింపులద్వారానే లభిస్తుందని కలలు కంటున్నాడు. అతని ఈ ధోరణిని అవకాశంగా తీసుకొని గవర్నరు ప్రజాఉద్యమాలమీద విరుచుకు పడుతున్నాడు. ఉదాహరణకు థాకిన్‌సో రైతు పోరాటాలకు పిలుపునివ్వడాన్ని ఆంటీఫాసిస్టు లీగు నాయకుడు ఆంగ్‌సాన్ జూన్ 7 వ తేదీన ఒక ఉపన్యాసంలో ఖండించాడు. జూలై 15 వ తేదీన గవర్నరు థాకిన్‌సో కమ్యూనిస్టుపార్టీని నిషేధించాడు. ఈ విధముగా కమ్యూనిస్టులకు ఇతరజాతీయపక్షాలకు మధ్య చీలికలు పెంచాడు.

ఇప్పుడుకూడా, ఆంగ్‌సాన్ ఒకవైపు కమ్యూనిస్టులను ఖండిస్తూ ఉపన్యాసాలివ్వడము, ఆవెనువెంటనే రైతు కార్మిక కమ్యూనిస్టునాయకుల్ని, థాకిన్‌సోను (పత్రికా రచయితకి లొంగి ఇతనిని విడుదలచేయక తప్పింది కాదు) అరెస్టుచేయడం జరిగింది. ఈచీలిక పర్యవసానంగా ఆంటీఫాసిస్టులీగు చివరకు కమ్యూనిస్టులనందరినీ వెలివేసింది. సామ్రాజ్యవాదుల పన్నాగాలను ఫలింపజేసింది. కమ్యూనిస్టులమీద, వారి నాయకత్వానసాగుతూన్న కార్మిక, రైతు ఉద్యమాలమీద బ్రిటిష్ గవర్నరు మరింత క్రూరంగా విరుచుకుపడడానికి అవకాశం కలిగించింది.

ఆంగ్‌సాన్ ఆరోపణ

కమ్యూనిస్టులు తమగోతిని తామే తవ్వుకుంటున్నారనీ, వారివిధానం సామ్రాజ్యవాదులకే ఉపయోగపడుతున్నదనీ ఆంగ్‌సాన్ అన్నాడు. ఆంగ్‌సాన్ సాగిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక దండయాత్రను 'టైమ్సుఆఫ్ ఇండియా' లాంటి అభివృద్ధి నిరోధక, సామ్రాజ్యవాద పత్రికలు ఎలా పొగుడుతున్నాయో చూస్తే, సామ్రాజ్యవాదులకు ఉపయోగపడుతున్నది ఎవరిచర్యలో స్పష్టమవుతుంది. ఐక్యబర్మా స్వాతంత్ర్య పోరాటానికి గోతిని తవ్వుతున్నదెవరో తెలుస్తుంది.

ఐక్య జాతీయ సంఘటన అవసరం

ఇంతకూ, ఆంగ్‌సాన్ దృష్టిలో కమ్యూనిస్టులు చేసిన అపరాధమేమిటి? ఆంటీ ఫాసిస్టులీగు నాయకత్వపు రాజీధోరణిని వారు తీవ్రంగా ఖండించారు. నిజమైన అధికారాలు లేకుండా, పొంగుకొస్తున్న ప్రజాపోరాటాలను అణచడానికే నిర్మింపబడు కార్యవర్గంలో వారు చేరకూడదన్నారు.

వారింకేమి నేరంచేశారు? భూస్వాములను, దొంగవ్యాపారులను, తిండిదొంగలనూ, లంచగొండి ఉద్యోగులను ఎదిరించి తిండికోసమూ, భూమికోసమూ, రైతులూ, వ్యవసాయ కూలీలూ సాగిస్తున్న పోరాటాలకు నాయకత్వంవహించినదుపుతున్నారు. తమ హక్కులకోసం కార్మికులు సాగిస్తున్న పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారు.

మరేమినేరం చేశారు? ఈప్రజాపోరాట కార్యక్రమంవైపు, తద్వారా సామ్రాజ్యవాదంపై తుదిపోరాటం సాగించి, ప్రజాతంత్ర స్వాతంత్ర్యాన్ని సాధించే విధానంవైపు ఆంటీఫాసిస్టులీగు సభ్యులను, ప్రజావాలంటీర్ సంఘసభ్యులను, త్రిప్పడానికి కృషిచేస్తున్నారు.

ఈ రెండుసంస్థలను అగౌరవపరచాలనే దృష్టిగాని, వాటిని విచ్ఛిన్నం చేయాలనే తలంపుగాని కమ్యూనిస్టులకు లేదు. బర్మా ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి ఈరెండు సంస్థలూ ముఖ్యఅంగాలుగాగుర్తింపబడ్డాయి. ఆపోరాటానికి అవి పవిత్రచిహ్నాలయాయి.

వాటిని బలహీనపరచడంకాదు కమ్యూనిస్టుల ఉద్దేశం. స్వాతంత్ర్య సాధనకోసం ఐక్యవిప్లవపోరాటంలోవాటినికూడా కలుపుకురావాలనే వారి తహతహ.

ఈ దృష్టితోనే బర్మా కమ్యూనిస్టుపార్టీ, ద్విగుణీకృత దీక్షతో ఆహారసప్లయిలకోసం, భూమిపంపకం కోసం, న్యాయమైన జీతాలకోసం, రైతు, కార్మిక, ప్రజాసామాన్య పోరాటాలను నడుపుతున్నది. రైతు, కార్మిక సంస్థల బలాన్ని, పార్టీబలాన్ని పెంపొందించుకుంటున్నది. ఆంటీఫాసిస్టులీగు నాయకత్వపు రాజీపంథా దేశానికి ఎలా నష్టం కలిగిస్తూందో; సామ్రాజ్యవాదులను ఎలా బలపరుస్తుందో, విరామంలేకుండా బట్టబయలు చేస్తారు. ఈ విధంగా సోషలిస్టులను, ఆంటీఫాసిస్టు లీగు ప్రజావాలంటీరు సంఘసభ్యులను తమ విప్లవకార్యక్రమంవైపు త్రిప్పుకుంటారు.

జపాను వ్యతిరేక స్వాతంత్ర్యపోరాటంలో బర్మా ప్రజాశక్తులు జాతీయైక్యసంఘటనను నిర్మించుకున్నాయి. కమ్యూనిస్టులు, ఇతర బర్మాదేశభక్తులు ఎందరో, ఆ పోరాటంలో ఆత్మబలిదానంచేసి దీనిని బలపరిచారు. ఈనాడు ఆంగ్‌సాన్ మొదలైన ఆంటీ ఫాసిస్టులీగు నాయకవర్గం, దీనిని విచ్ఛిన్నం చేస్తూ, ఆత్మవినాశకరమైన విధానాన్ననుసరిస్తున్నారు. అభివృద్ధినిరోధక బర్మా జమీందారీ, పెట్టుబడిదారీవర్గాలకే ఈవిధానం ఉపయోగపడగలదు. పరాయి సామ్రాజ్యవాదులపన్నాగాలకే ఇదిఅనుకూలపడగలదు.

కమ్యూనిస్టుల కర్తవ్యం

బర్మాకమ్యూనిస్టులు, నిరంతర సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాట కార్యక్రమంమీద తమలోతాము సుస్థిరఐక్యతను కుదుర్చుకున్ననాడే పైవిధానాన్ని జయప్రదంగా ఎదుర్కొగలరు. ఆంటీఫాసిస్టులీగు నాయకవర్గ చర్యలకు లెచ్చిపోయి వారు ఆసంస్థకు పోటీ సంస్థను పెట్టడానికి పూనుకోకూడదు.

రైతు, కార్మికపోరాటాలను పెంపొందించడం మీదనే, రైతుకూలీ సంస్థలను బలపరచడం మీదనే వారు తమ దృష్టిని కేంద్రీకరించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా పరాయి సామ్రాజ్యవాదులను ప్రతిఘటిస్తూ సాగే ప్రతిఉద్యమంలోనూ వారు అగ్రదళంగా నిలవాలి.

అచంచలదీక్షతో ఈ విప్లవ పోరాటకార్యక్రమం కొనసాగించడం ద్వారానే, వారు ఆంటీఫాసిస్టులీగు సంస్థనంతటినీ రాజీపంథా నుండి మరల్చగలరు. అంతిమస్వాతంత్ర్య పోరాటం వైపు త్రిప్పగలరు.

రాజీధోరణితో ఆంగ్‌సాన్ విచ్ఛిన్నకర చర్యలకు దిగాడు. అంతిమ స్వాతంత్ర్య పోరాటంకొరకు, ఆంటీఫాసిస్టు లీగును ప్రాతిపదికగా తీసుకొని జాతీయైక్య సంఘటనను నిర్మించడానికి కృషిచేయడం ద్వారా కమ్యూనిస్టులు ఈ చర్యలను జయప్రదంగా ఎదుర్కొగలరు.

(11 వ పేజీ తరువాయి)

అధికారుల దిగ్భ్రమ

ప్రజలలో వచ్చిన ఈ వుద్యమం అంత ఐకమత్యంతో రావడము, తలవనితలంపుగా రావడముతో ప్రభుత్వాధికారులుదిగ్భ్రమచెందినట్లయిపోయారు. అనుకూలంగాను, వ్యతిరేకంగానుకూడ వారింతవరకు ఏమీచేయలేదు.

జల్పయ్‌గురిలో పోలీసులు మొట్టమొదట జమీందార్లగాదెలు పట్టుకుంటే రైతునాయకులను అరస్టుచేస్తామని బెదిరించారు. కాని, ఇది ఒక వుద్యమంలాగ వచ్చేటప్పటికి చల్లగా జారుకున్నారు.

కూరిగ్రామ్, రంగ్‌పూర్‌లలో ఆహారపరిస్థితి విషమంఅయ్యేటప్పటికి అధికారులకు గుండెదడ పట్టుకుంది. వారు ఎంత ప్రయత్నించినా ఒక్కగింజకూడా బయటపడడం లేదు. అపద గడవడం ఏలాగని కంగారుపడుతూంటే రైతుసంఘాలు అందుకున్నాయి జమీందార్ల పాతరలు బయటపడసాగాయి. వెంటనే అధికారులు రైతుసంఘాల బలం గుర్తించారు. మొన్నటివరకు రంగపూర్‌లో అధికారులకు ఎర్రజెండా అంటే కన్నెర్ర. రైతు సంఘాలంటే కడుపుమంట. కాని, ఈనాడు రైతు ఉద్యమపు విసురుకు తట్టుకోలేక, ఎదుర్కోవడం ఆపారు.

రాజకీయ నాయకులకు పాఠాలు

ఈ మహోద్యమంవలన ఎన్నో లక్షలమంది జీవితాలు రక్షించబడ్డాయి. ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా జరగనివిధంగా ఈనాడు ఇక్కడ జమీందారును తొక్కిపెట్టి దొంగ పాతరలు పైకి లాగారు. 1944లో ఎంతో వొత్తిడిమీద పీప్పు రైతులకి ధాన్యం అప్పు ఇవ్వడం గగనం అయిపోయింది. కాని, నేడు వారి రైతులే వారివి లొంగతీసారు.

బెంగాల్ అంతా అగ్ని గుండంలో వున్నట్లు వుంది. నౌఖలీ అగ్నిజ్వాలలమధ్య వుంది. కాని, ఇక్కడి హిందూ - ముస్లిం ప్రజానీకం సమిష్టిగా తమ వర్గ శత్రువును ఎదిరించి కరువును దూరంగా నిలబెట్టారు. కలహాగ్నిని దరి చేరనివ్వలేదు. నౌఖలీ మాదిరిగా ఇక్కడా ముసల్మానులే హెచ్చు. అక్కడికంటె ఇక్కడ జనాభా రెట్టింపు మంది వున్నారు. అయినా కొట్లాటలు కలుగలేదు. దీనికి కారణం ఒక్కటే. ఇక్కడ ఉద్యమాన్ని నడుపుతూన్నది స్వార్థపరులు కాదు. ప్రజా సేవకులయిన కమ్యూనిస్టులు. సోదర హత్యలకోసం గాక, ప్రజారక్షణకోసం వారు హిందూ - ముస్లిం ప్రజాసామాన్యాన్ని సంఘటితపరచి నడుపుతున్నారు.

నిరక్షరులయిన ఈ 'అధీర' రైతులు పెద్ద పెద్ద రాజకీయ నాయకులకు ఐక్యతమీద ఒరవడులు దిద్దించుతున్నారు.

తిరుగుబాటుచేసిన మిలిటరీఖైదీల దుస్థితి

ప్రభుత్వ కర్తవ్యం

పి. ఎస్. శర్మ

(రాష్ట్ర మాజీ సైనికుల సంఘ కార్యదర్శి)

ఎనదేశ యువకులు లక్షలాది జరిగిపోయిన యుద్ధంలో సిపాయిలుగా చేరారు. మిలటరీలో వేర్వేరు డిపార్టుమెంటుల్లో చదువుకొన్నవారేగాక; సామాన్య బీద రైతు కూలీ కుటుంబాలనుండి కూడా రిక్రూటై యుద్ధరంగాల్లోపనిచేశారు. యుద్ధకాలంలోనూ వెన్వెంటనూ భారత దేశంలో అన్ని వర్గ ప్రజల్లో వచ్చిన చైతన్యం, పోరాటాలు వీరి మీదకూడా తమ ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా 1942 రాజకీయఉద్యమం, యుద్ధ కాలంలో అజాద్ హింద్ ఫౌజు చూపిన త్యాగాలు, వారిధైర్యం, భారత సైనికుల హృదయాల్లో దేశభక్తిని రగుల్కొలిపాయి. ఐనా, సైన్యంలోవుండే నిరంకుశ కట్టుబాట్లు కొంత కాలంవరకు వారిని అణచిపెట్టాయి.

ప్రజావుద్యమాలు

వారి కళ్ళు తెరిచాయి

నిర్బంధ విధానం వారిని నోరు మెదప నివ్వకుండా చేసింది. కాని. వారనుభవించే నికృష్ట జీవితాలు- డిసిప్లిన్ పేరుతో వారిపై జరిపే అమానుష కృత్యాలు, తెల్ల ఆఫీసర్లు చేసే జాత్యహంకార చర్యలు, వారు సహించలేకపోయారు. తమతో కూడ యీ బాధలన్నీ అనుభవించి బానిస బంధాలు త్రెంచుకొని, అజాద్ హింద్‌ఫౌజుగా తయారైన వారి చర్యలు, చరిత్రలు వారిని ఉత్రూతలూగించాయి. వారిలో అణగివున్న దేశభక్తిని మరింత హెచ్చించాయి. పైగా దేశంలో విపరీతమైన ప్రభుత్వ నిర్బంధం. కరువు కాటకాలు, వాటికి వ్యతిరేకంగా ప్రజలుచేసే పోరాటాలు, ఆర్థిక రాజకీయ జీవిత హక్కులకై కార్మిక – కర్షకులు, విద్యార్థులుచేసే సమ్మెలు వారికి ధైర్యాన్నిచ్చి మార్గం చూపించాయి. దాంతో రగుల్కొంది సైన్యంలో తిరుగుబాటు జ్వాల.

వాటన్నిటి ఫలితమే బొంబాయిలో జరిగిన నావికుల తిరుగుబాటు జబ్బల్‌పూరులో మిలటరీ తిరుగుబాటు. బ్రిటిష్ అధికారులు పైవాటికి ఏ కారణాలు చూపినా, ఏ పేరు పెట్టినా, ఇవి మాత్రం భారతీయ సైనికులలో ఉండే దేశభక్తికి బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై వారికుండే అసహ్యతకు ప్రబలనిదర్శనాలు.

అధికారుల గుండెదడ

20 ఏండ్ల క్రితం బ్రిటిష్ పరిపాలకులు తమ రక్షణకు, అంటే ప్రజా విప్లవ వెల్లువనుండి తమ సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి, ఆఖరు ఆయుధంగా సైన్యం ఉపయోగ పడుతుందని భావించేవారు. ఆవిధంగా సైన్యాన్ని తయారుచేశారు. కాని 1930 లో గార్వాల్ సైనిక వీరులు పెషావర్ ప్రజలపై తుపాకులు కాల్చ నిరాకరించడంతో, పరిపాలకులకు మొదటిసారిగా దడ ప్రారంభమైంది. రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్సు (విమాన దళాలు) నావికా దళాల్లోనూ, జరిగిన సమ్మెలు, సైన్యంలో బ్రిటిష్ పరిపాలకుల కున్న నమ్మకాన్ని పూర్తిగా బెదరగొట్టాయి. కాంగ్రెస్, లీగ్, కమ్యూనిస్టు జెండాలతో వారు చేసిన ప్రదర్శనాలు, ప్రజలు కూడా పార్టీభేదాలు, హిందూ ముస్లిం భేదాలు మరచి, వారివెనుక ఐక్యమత్యంలో నిలబడ్డ దృశ్యం, బ్రిటిష్ పాలకులకు పక్కలో బల్లె మనిపించింది.

ఈ పెద్ద తిరుగుబాట్లు జరగడానికి పూర్వంకూడా సైన్యంలో అనేకమంది వ్యక్తిగతంగా తమ తెల్ల అధికారుల దుష్టచర్యలకు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా తిరుగబడ్డారు. అట్టివారు అనేకమంది కోర్టు మార్షల్లాతో కఠినంగా శిక్షింపబడ్డారు. అతి స్వల్పనేరాన్కి కూడా 10, 12, 20 సం॥ శిక్షింపబడ్డవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఇదేవిధంగా అజాద్ హింద్‌ఫౌజ్ సైనికులు కూడా ఎంతోమంది ఇంకా జైళ్ళల్లో ఉన్నారని తెలుస్తోంది. వ్యక్తిగతంగాను గ్రూపులుగాను తిరగబడ్డ వారు జైళ్ళలో అతి క్రూరంగాను హింసింప బడుతున్నారు.

తెల్లఅఫీసర్ల నిరంకుశత్వాన్ని ఎదిరించి, పోరాడి, ధైర్యంగా జీవితాన్ని లెక్కచేయక పోరాడిన యీవీరులు, జైలు అధికారులచే సామాన్య రాజకీయ ఖైదీలకుండే సౌకర్యాలేమీలేకుండా, మామూలు నేరస్థులకన్న కనిష్టంగా చూడబడుతున్నారు. ఈమధ్యనే ఒక సిపాయిని, జైలు అధికారులు చితక కొట్టి, హింసించారు. చాలామందిచేత కఠినమైన పనులు చేయించడం, అగౌరవంగా చూడడం జరుగుతోంది. వీరి చరిత్రలు, ప్రస్తుతం వీరు జైలులో గడిపే జీవితాలు చూస్తే ప్రతిదేశభక్తునికి ఒళ్ళుఉడికిపోతుంది. ఉదాహరణగా కొంతమంది చరిత్ర ఈక్రింద వివరిస్తాను.

ఇంకా ఎంతకాలం వీరిల్లా

బాధపడాలి

ఎం. సింహరాయలు: కడప జిల్లాలో కడు బీదకుటుంబంలో జన్మించి, కొంతవరకు ఇంగ్లీషు విద్య నభ్యసించి, స్కూల్‌మాష్టర్ ఉద్యోగంలో తన కుటుంబాన్ని గట్టెక్కించుకోలేక, మిలిటరీలో చేరాడు. జబల్పూర్, మీరట్, ఢిల్లీ, కేంద్రాలలో తెల్లసైనికులతోను, ఇటాలియన్ ఖైదీలతోను కలసి పని చేశాడు. తనలాగే పనిచేసే, తెల్లసోల్జర్ల జీతాలు, సౌకర్యాలు తనతో పోల్చిచూసుకుంటే ముఖం తిరిగిపోయింది. అంతలో ఆ. హిం. ఫౌజ్ చరిత్ర తెలియవచ్చింది, నావికా తిరుగుబాటు గురించి, వారి ప్రయత్నాల కబురు అందింది. అదే సమయంలో వారికి కమాండింగ్ ఆఫీసరు, ఒక ఇంగ్లీషు వాడు, తమలోనివార్ని, చదువుకొన్నవార్ని, బూతులు తిట్టడం, బూట్లతో తన్నడం చూస్తున్నారు. ఇంకపట్టలేకపోయారు.

12 మందితో కూడిన యాక్షన్ కమిటీని ఏర్పర్చుకొని పోరాటంసల్పేరు. దానికి ఇతడు అంధ్రాగ్రూప్ లీడర్‌గా పనిచేశాడు. తెల్ల ఆఫీసరును తొలగించాలనీ, న్యాయంగా తమ కోర్కెలను తీర్చాలనీ, అడిగేరు. ఎవరిపై చర్యతీసుకోబడినా, కలసి ఎదిరించాలని తీర్మానించుకున్నారు. పైఅధికారులు విచారణ జరిపి, తిరుగుబాటు చేశారని అరెస్టు చేశారు. భారత సైనికచట్టం 27 (ఎ)క్రింద. మ్యూటినీ చేశారని నేరంమోపి. ఇతనికి 18 మాసాలు. 4 గురు హవల్దారులకు 5 సంవత్సరముల చొప్పున విధించారు. వారందరికీ శిక్ష రద్దు చేయమని కమేండర్ - ఇన్ - చీఫ్‌కి అప్పీలు చేయబడినా ఫలితం జరుగలేదు.

(2) సుబేదార్ అప్పల నారాయణ స్వామి రెడ్డి: విశాఖపట్టణం జిల్లా. 18 సంవత్సరాలు మిలటరీలో పనిచేశాడు. బ్రిటిష్ ఆఫీసరు భారత సైనికులను బూతులు తిట్టుతోంటే తను సంపెనీ సెకండ్ కమేండర్‌గా వుండి, సహించలేక తిరుగబడి, అందరిచేత సమ్మె చేయించాడు. అందుకు ఇతనికి మిలిటరీ చట్టంక్రింద 14 సంవత్సరములు, మరి 20 మందికి ఒక్కొక్క సంవత్సరంచొప్పున కఠినశిక్షలు విధించారు.

(3) గంటా చినవెంటరెడ్డి: ఇటలీలో మరి 300 మంది భారత సిపాయిలతోకలసి వుంటుండేవాడు. బ్రిటిష్ సైనికులతో సమాన హోదా కావాలని పేచీపెట్టారని, ఒక బ్రిటిష్ ఆఫీసరు వీరిని నిందించసాగేడు. అందుచే కోపంవచ్చి తుపాకితో కాల్చిచంపేడని నేరం. ఆజన్మాంతర ఖైదు విధించబడ్డది. 1945లో భారతదేశం తీసుకువచ్చారు. అప్పటినుండి ఇచ్చటే ఖైదులో ఉన్నాడు. అసలు గ్రామం జలాల్‌పురం, తాడిపత్రి తాలూకా, అనంతపూర్ జిల్లా. ఇతడి23సంవత్సరాల యువకుడు.

(4) పెంచలయ్య: నెల్లూరుజిల్లా, ఆత్మకూరు తాలూకా పెరమన గ్రామం. వయస్సు 25 సం॥ మిలిటరీలో 5 సం॥రాలు పనిచేశాడు. వాళ్ళ రెజిమెంటుస్టాఫ్ కెప్టెన్, మరో లేడీ కెప్టెన్ కలసి, భారతీయులను నానాబూతులు తిట్టడం. హింసించడం, "ఇండియన్ కుక్కలు" అని మామూలుగా మాట్లాడుతూండడంచూచి వీరికి ఒళ్లు మండింది. దానికి తిరుగబడ్డారని కసికొద్ది, ఇతనిపై కేసులు బనాయించారు. కాని సాక్ష్యంలేక విడిచిపెట్టవలసివచ్చింది. ఐనా, ఆ కంభిణే, తనపంతం చెల్లించుకోడానికి తననూ తన కెప్టెన్‌నూ తన్నేరని, ఫిర్యాదు చేసి. ఇతనికి సమ్మరీకోర్టు మార్షల్‌లో 5 సంవత్సరాలు కఠినశిక్ష విధింపజేసింది.

అబ్దుల్‌అజీజ్, ఎస్. ఆశీర్వాదం, అబ్దుల్ రహిమాన్. మొదలగు వారెందరో సిపాయీలు, ఈ విధంగానే సైన్యంలో జరిగే అన్యాయాలు, జాత్యహంకారము. ఆఫీసర్ల నిరంకుశత్వము. సహించలేక, నావికుల తిరుగుబాటు సమయంలో, తాము కూడా తిరుగుబాటుచేసి, 1,2,5, సంవత్సరాల శిక్షలతో జైళ్ళల్లో మ్రగ్గుచున్నారు. (స్థలాభావం చేత అందరి వివరాలు, ఇంకా ఎంతోమందిని గూర్చినవిషయాలు తెలుపలేకపోవుచున్నాను)

తాత్కాలిక ప్రభుత్వం వీరిని

విడిపించాలి

మాతృభూమి దాస్యవిముక్తికి, సామ్రాజ్యవాద వినాశనానికి, రాజకీయపార్టీల ద్వారా భారతయువకులు, కార్మిక-కర్షకులు ఏవిధంగా పోరాడుతున్నారో, ఆ విధంగానే, సైన్యంలో కూడా అనేకవేలమంది యువకులుఅధికారుల నెదిర్చి ధైర్యంతోపోరుసల్పారు. బయటజరిగిన రాజకీయపోరాటాలకుసాయంగా, మిలటరీలో జరిగిన యీ చరిత్రాత్మిక పోరాటాలు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని హడలెత్తించాయి. ఇంక చేతిలోని సామ్రాజ్యం తుత్తునియలైపోతుందని భయపడి, ఈ పోరాటాలను. సాయుధ తిరుగుబాటుల్ని, అణచటం తమ శక్తికి మించినపనియని తెలుసుకొనే, బూటకపు స్వాతంత్రపథకాల్తో, మన రాజకీయపార్టీలతో రాజీచేసుకొన్నారు. ఆవిధంగా సామ్రాజ్యవాదుల్ని హడలెత్తించినవారు. తుదకు శిక్షింపబడి జైళ్ళలో బంధింపబడి ఉన్నారు. సాక్ష్యాలు సమకూర్చుకోలేక, తమ కేసులు సరైన పద్ధతిని సమర్థించుకోలేక, మిలటరీ అధికారుల కక్షమూలంగా, దీర్ఘశిక్షలకు గురిఅయ్యారు.

ఇప్పుడేనా, రక్షణశాఖ భారతీయుడైన బలదేవ్‌సింగ్ చేతులో వుండికనుక, వారిని వెంటనే విడుదల చేయాలి. సామ్రాజ్యవాద నియమాల ప్రకారం చూచినా, ఆ. హిం. ఫౌజువారిని విడుదల చేసియు. వారిని విడుదల చేయకపోడం సహించరానిది. వారిని రాజకీయ ఖైదీలుగాపరిగణించకపోవడం చాలా అన్యాయం. వారి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కేంద్రంపై ఒత్తిడితెచ్చి, వారిని ప్రజాసేవ చేయనివ్వాలి. ఆందోళన చేసి, వారి విడుదల సంపాదించడం అందరి దేశభక్తుల కర్తవ్యం.

భువనగిరి తాలూకాలో వెట్టిచాకిరిరద్దు

ప్రజలు సాధించిన విజయాలు

కోటమర్తి, నవంబరు 12

భువనగిరితాలూకాలో ప్రజలు వెట్టిచాకిరి మొదలయిన చట్టవ్యతిరేకచర్యలకు గురి అవుతూ అనేకబాధలు పడుతున్నారు. లంచగొండి ఉద్యోగులతో మొరపెట్టుకోవడంవల్ల ప్రయోజనం ఉండదని అనుభవపూర్వకంగా గ్రహించి, తామేస్వయంగా, అంధ్రమహాసభ నాయకత్వంక్రింద, అక్రమాలను దౌర్జన్యాలను ఎదిరించ నారంభించారు. అంధ్ర మహాసభ కార్యకర్తలు ప్రజలు కోరిన ప్రతి గ్రామంలోను ఉద్యమాన్ని కట్టుదిట్టంగా నిర్మిస్తున్నారు. గ్రామాలలో జరిగే దోపిడి విధానానికి క్రింది ఉదాహరణలు తార్కాణం.

వెట్టిచాకిరి

సీతారాంపురంలో వెంకటరామారావు అనే కరణం ఉన్నాడు. అతడు ప్రతి సంవత్సరం రైతులు చెల్లించుకోవలసిన శిస్తు ఎక్కువ చేస్తూ, పీల్చి పిప్పిచేసేవాడు. గొల్లలవద్ద ప్రతి సంవత్సరం 170 గొర్రెలను ప్రతిఫలం లేకుండా తీసుకునేవాడు. ఇప్పుడవన్నీ రద్దయాయి. గ్రామస్తులు ఐక్యతద్వారా వెట్టి చాకిరి నిర్మూలించుకో గల్గారు.

అద్దగూడూరు గ్రామానికి అనంతరెడ్డి అనే పోలీసు పటేలు (మునసబు) గ్రామానికి సర్వాధికారి. చాకలి, మంగలి, కుమ్మరి మొదలైన కులాలవారిచే వెట్టి చేయించుకునేవాడు. సమీపంలో ఉన్న గోవిందాపురం ప్రజలచేతకూడ నిర్బంధ వెట్టిచాకిరి చేయించుకునేవాడు.

తాలూకా ప్రజలకు పేల్పసొసైటి అంటే ఏమీ తెలియదు. మోతుకూరు దేశముఖు నాయకత్వాన ఈ సొసైటీ నిర్వాహకులు ప్రజలవద్ద విపరీతంగా సొమ్ము వసూలు చేసేవారు. ఇలా వసూలైన వేలకొద్దీ రూపాయలకు రసీదులులేవు. రైతుల శాలాల్లో పండిన అదనపు ధాన్యాన్ని నియమిత ధరలకు కొనవలసిన యీ సంస్థ ప్రజల్ని పీల్చి పిప్పిచేసే సాధనంగా ఉపయోగపడుతోంది.

లేవీగిర్దావర్ల లంచగొండితనం

పంటలుపండలేదని రైతులు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకుంటే, ఎంతపండిందోచూడ రమ్మని గిర్దావర్లను(రివెన్యూ ఇన్‌స్పెక్టర్లు) పంపుతారు. వీరు గ్రామాలకు పోయి, లంచమియ్యకపోతే ఎక్కువపంట పండిందని వ్రాస్తారు.

ఈఅక్రమాలనన్నిటిని ప్రజలుధైర్యంతో ఎదుర్కొంటున్నారు. భువనగిరి తాలూకాలో మొత్తం 25 గ్రామాలకు అంధ్రమహాసభ వ్యాపించింది.

ఈఉద్యమాన్నిఅణచుటకు స్థానిక పెత్తందార్లుప్రభుత్వానికితప్పుడురిపోర్టులిస్తున్నారు. అధికార్లుగ్రామాలకువచ్చి, సంఘాలు పెట్టుకోవద్దనిదర్పోపన్యాసాలిచ్చారు. "మీవంటిలంచగొండ్లను ఎదుర్కొనేటందుకే సంఘాలుపెట్టుకున్నా"మని ప్రజలుజవాబుచెప్పారు. పెత్తందార్ల గూండాలకు కత్తులు, తుపాకులు యిచ్చి బజార్లలో తిప్పుతున్నారు. కార్యకర్తలమీద ప్రజలమీద కేసులుపెట్టి, కోర్టులవెంట తిప్పాలని చూస్తున్నారు.

బ్రిటిష్ విదేశాంగవిధానంపై లేబర్‌పార్టీలో తీవ్రఅసంతృప్తి

నాయకులపై లేబర్ పార్టీఅనుచరుల తిరుగుబాటు

బ్రిటిష్ లేబర్‌పార్టీ అధికారంలోకివచ్చి సంవత్సరం దాటిపోయినా, విదేశాంగ విధానంలో ఎట్టి మార్పులేదు. చర్చిల్ అడుగుజాడల్లోనే బెవిన్ (విదేశాంగమంత్రి), అట్లీ (ప్రధాని)లు నడుస్తున్నారు. అందుకనే "బెవినిజం అంటే యుద్ధం" అని ఒక ప్రముఖ కార్మికనాయకుడన్నాడు. "చర్చిల్ బట్లర్ (సేవకుడు) బెవిన్" అని మరొక ప్రముఖుడు క్రోధాన్ని వెలిబుచ్చాడు.

నేటి బ్రిటిష్ విదేశాంగవిధానాన్ని బ్రిటిష్ ప్రజానీకం – ముఖ్యంగా కార్మికవర్గం – ఏమాత్రం వహించడంలేదని యీమధ్య బ్రిటన్‌లో జరిగిన ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లోను, ఇప్పుడు పార్లమెంటులో లేచిన తిరుగుబాటువల్ల స్పష్టమయింది.

బ్రిటన్ ఫ్రాంకో ప్రభుత్వంతో తెగ తెంపులుచేసికోలేదు. ఆర్థిక రాజకీయ సంబంధాలను అలాగే అట్టిపెట్టింది. ఆ విధంగా ఫ్రాంకో ప్రభుత్వాన్ని బలపరచుతోంది.

గ్రీసులో రాజునుతెచ్చి ప్రజల నెత్తిన కూర్చోబెట్టింది. ఫాసిస్టు రాచరిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది. అచ్చటి కార్మిక సంఘాలను అభ్యుదయకరశక్తులను అణచివేయుటకు తోడ్పడింది.

సోవియటుయూనియన్‌తో బ్రిటన్ స్నేహ సంబంధాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ప్రజాతంత్ర యూరప్‌పట్ల - పోలెండ్, జకోస్లోవేకియా, యుగోస్లావియా, రుమేనియా, బల్గేరియా, అల్బేనియా దేశాలపట్ల - విముఖత చూపుతోంది.

బ్రిటన్ తన ఆర్థిక విధానాన్ని అమెరికా తోకకు ముడిపెట్టి వినాశకరపంథాను నడుపుతోంది. భవిష్యత్ ప్రపంచ వ్యవస్థ నిర్మాణంలో, ముఖ్యంగా జర్మనీ భవిష్యత్తు విషయంలో, అమెరికాకు తాళం వేస్తోంది. జర్మనీలో మిగిలిన నాజీదుష్టశక్తుల నిర్మూలనానికి పూనుకోవడంలేదు.

వలసరాజ్యాల విషయంలో, పాలస్తీనా ఈజిప్టు, ఇండియా, బర్మాల విషయంలో - పూర్వపు సామ్రాజ్య విధానాన్నే అనుసరించుతోంది. ఇండోనీషియాలాంటి వలసరాజ్య స్వాతంత్ర్య ఉద్యమాలను అణచివేస్తోంది.

ఈ విధానంపట్ల లేబర్ పార్టీ అనుచరులలోనే తీవ్రమైన అసంతృప్తి బయలు దేరినది. ఈ విషయం అక్టోబరు నెలాఖరులో జరిగిన బ్రిటన్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లోను, కామన్సు సభలో విదేశాంగ వ్యవహారాలపైజరిగిన చర్చలలోను స్పష్టపడింది.

గతనెలలో జరిగిన కామన్సుసభచర్చలో బెవిన్ ఉపన్యాసం ఎవరినీ సంతృప్తిపరచలేదు. అందరికీ తెలిసిన నగ్నసత్యాలను "ఎబ్బెబ్బే, మాది ఆ ఉద్దేశ్యంకాదు" అంటూ తమ అభివృద్ధి నిరోధక చర్యలను సమర్థించుకోజూచాడు. బెవిన్ ఉపన్యాసం పని చేయలేదు, అందుకని అట్లీ రంగంమీదకు వచ్చాడు.

సోవియటునూ, కమ్యూనిస్టులనూ తిట్టడమే పనిగాపెట్టుకొన్న కొందరు కార్మిక నాయకులలాంటివాడు అట్లీ. అలాంటి అట్లీ గూడ తెరమీదకువచ్చాడు. సోవియటును, వీటో విధానాన్ని విమర్శించాడు.

సోవియటుపై దుష్ప్రచారంచేస్తూ తర్వాత మాట్లాడమన్న చర్చిల్‌కు త్రోవచూపాడు. ఇంతేగాదు. కామన్సుసభలో మాట్లాడిన మరుసటిరోజునవే బ్రైటన్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లో రష్యాపైన బ్రిటిష్ కమ్యూనిస్టులపైన దాడిచేశాడు. ఈ బూకరింపులకు భయపడి, కమ్యూనిస్టు వ్యతిరేక భూతాన్ని చూపితే భయపడి, కార్మికసంఘ ప్రతినిధులు తమను సమర్థిస్తారని అట్లీ ఆశించాడు. కాని అతని ఆశలన్నీ నిరాశలయాయి.

బ్రిటిష్ ప్రభుత్వాన్ని విమర్శించుతూ స్పెయిన్ సమస్యపై తెచ్చిన తీర్మానం 45 లక్షల 34 వేలతో నెగ్గింది. దానికి వ్యతిరేకంగా 13 లక్షల 91 వేలు మాత్రమే వచ్చాయి. మొత్తం బ్రిటిష్ విదేశాంగనీతిని ఖండించుతూ తెచ్చిన తీర్మానం ఓడిపోయినా, 24 లక్షల 44 వేల వోట్లు సంపాదించింది.

ఇంక ఆరోజుల్లో జరిగిన కామన్సు సభ చర్చవిశేషాలు చూద్దాం. అట్లీ, బెవిన్‌ల ఉపన్యాసాలను ఆమోదించుతూ చర్చిల్ హర్షించాడు. కాని, లేబర్‌పార్టీ అనుచరులవైఖరి ఏమిటి? బెవిన్‌కు చప్పట్లు కొట్టింది నల్గురు అనామక కార్మిక సభ్యులు మాత్రమేనని, అమెరికా యునైటెడ్‌ప్రెస్ విలేఖరి వ్రాస్తున్నాడు. చాలామంది తమ క్రోధాన్ని దిగమ్రింగుకొని నిశ్శబ్దంగా కూర్చున్నారు. అసాదు బెవిన్ పంథాను విమర్శించుతూ మాట్లాడిన జిలియకస్, దాదాపు 200 మంది తనను బలపరచుతున్నారని తెలియజేశాడు.

లేబర్‌పార్టీ వినాశకర విదేశాంగ విధానంపై, ఆ పార్టీ అనుచరుల తిరుగుబాటు ఇపుడు జరుగుతున్న కామన్సు సభ సమావేశంలో మరింత స్పష్టమయింది:

నవంబర్ 12 వ తేదీన పార్లమెంటులో బ్రిటిష్ చక్రవర్తి ఉపన్యసించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అవలంబించే విదేశాంగ విధానానికి అసమ్మతిగా లేబర్‌పార్టీ సభ్యులు కొందరు రాజుగారి ఉపన్యాసానికి సవరణ పెట్టారు. ఈ సవరణ నెగ్గితే లేబర్‌పార్టీపై అవిశ్వాసం నెగ్గడమన్నమాట. లేబర్ మంత్రివర్గాన్ని కూలద్రోయడం తమ ఉద్దేశ్యం కాకపోయినా, తమతీవ్ర అసమ్మతితెలియజేయడానికి, విదేశాంగవిధానంలో మార్పుతెప్పించడానికి వారిలాచేశారు. ప్రభుత్వవిధానంతో ఏకీభవించనివారు చాలామంది ఉన్నా గట్టిగా నిలబడి, తమ పార్టీ నాయకుల బెదరింపులకు, బూకరింపులను ఎదుర్కొగల్గింది 44 గురు. వారిసంఖ్య ఇవాళ 70 దాకా పెరిగింది.

14 వ తేదీన జరిగిన లేబర్‌పార్టీ (పార్లమెంటుపార్టీ)మీటింగ్‌లో అట్లీ, మారిసన్‌లు ఈ 'తిరుగుబాటు దార్లను' బెదరించారు. అయినావారు చెక్కుచెదరలేదు. వారి సంఖ్య పెరిగింది.

మొత్తం లేబర్‌పార్టీ సభ్యులు (పార్లమెంటులో) 390 మంది ఉన్నారు. ఎదురుతిరిగిన 44 మందిపైన మారిసన్ ఒక ఖండన తీర్మానం పార్టీమీటింగ్‌లో తెచ్చారు. దానికి 120 వోట్లు మాత్రం వచ్చాయి. ఎక్కువమంది సభ్యులు 220 మంది వోటింగ్‌లో పాల్గొనకొండా తమ నిరసన తెల్పారు. 11 మంది అసలు మీటింగుకే రాలేదు.

పార్టీమీటింగ్‌వల్ల, బడిపిల్లకాయలలాగ తమ నాయకత్వానికి వీరు లొంగిపోయి నడుస్తారని అనుకొన్న అట్లీ బెవిన్ ప్రభృతుల ఆశలు అడుగంటాయి.

కామన్సుసభలో ఇవాళా రేపూ (ఆది, సోమవారాలు) ఈ 'తిరుగుబాటుదార్లు' తెచ్చిన సవరణపై చర్చసాగుతుంది. లేబర్‌పార్టీ అనుచరుల ఈ తిరుగుబాటు, నాయకత్వానికి తగినబుద్ధిగరపి సక్రమమార్గాన పెట్టడానికి ఎంతైనా ఉపయోగపడుతుంది.

ఫ్రెంచి ఎన్నికలలో కమ్యూనిస్టుల విజయం

ఫ్రాన్సు భవిష్యత్తు ఎటు?

నవంబరు 10 వ తేదీన ఫ్రెంచి శాసన సభకు (నేషనల్ అసెంబ్లీ) ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ అఖండవిజయం సంపాదించింది. శాసన సభలో మొదటిపార్టీగా కమ్యూనిస్టుపార్టీ వచ్చింది.

ఫ్రాన్సులోను, ఫ్రాన్సు వలసదేశాలలోను కలిసి శాసనసభకు 619 స్థానాలున్నాయి. (క్రిందటిసారి జూన్‌లో జరిగిన ఎన్నికలకన్నా ఇప్పుడు స్థానాలు కొద్దిగా ఎక్కువ) ఇందులో కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టు అనుకూలురకు 177 స్థానాలువచ్చాయి. యం. ఆర్. పి. (కాథలిక్ పార్టీకి) 161, సోషలిస్టుపార్టీకి 96, రాడికల్ పార్టీ వారి మిత్రులకూ 63, కన్సర్వేటివ్, (పి. ఆర్. యల్) స్వతంత్ర అభ్యర్థులూ కలిసి 102 స్థానాలు వచ్చాయి.

కమ్యూనిస్టుపార్టీ నానాట ఎలాబలపడుతూ వచ్చిందో ఈక్రింది లెక్కలవలన తెలుస్తుంది.

1932 లో ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీకి 7 లక్షల 90 వేల వోట్లువచ్చాయి. 1936లో 15 లక్షలవోట్లువచ్చాయి. 1945 అక్టోబర్‌లో (ఇప్పటి యుద్ధంతర్వాత జరిగిన మొదటి ఎన్నిక. స్త్రీలకు కొత్తగా వోటింగ్‌హక్కు లభించింది ఈ ఎన్నికలతో.) 50 లక్షల 4 వేల 121 వోట్లువచ్చాయి. 1946 జూన్ ఎన్నికలలో 51 లక్షల 45 వేల 325 వోట్లు వచ్చాయి. ఇప్పుడుగతజూన్‌లోకన్న 2 లక్షల 72 వేల వోట్లు హెచ్చుగావచ్చాయి. అంటే మొత్తం 54 లక్షల 17 వేల వోట్లు. (ఇంతవరకు తెలిసిన లెక్కలననుసరించి)వచ్చాయి.

గతసంవత్సరంగా ఫ్రెంచి భవిష్యత్ రాజ్యాంగం ఎలా వుండాలి, అనే విషయమై వివిధపక్షాలమధ్య తీవ్రమైన పోరాటం సాగుతోంది. యుద్ధం అయిపోయాక తాత్కాలిక ప్రజాపరిషత్తు ఒకటి ఏర్పడింది. దీనికి ఎన్నికలు 1945 అక్టోబరులో జరిగాయి. అప్పుడూ కమ్యూనిస్టులు మొదటిపార్టీగా వచ్చారు. కమ్యూనిస్టు సోషలిస్టు పార్టీలకుగలిపి తక్కిన వారికంటె ఎక్కువ మెజారిటీ అప్పుడువుంది.

కమ్యూనిస్టులూ సోషలిస్టులూ కలిసి ఒక రాజ్యాంగచట్టం తయారుచేశారు. అందులో ఒకే శాసనసభ ఉండాలని; అభివృద్ధి నిరోధకులకు పెట్టుబడిదారులకు స్థానమైన సెనేట్ (పై శాసనసభ) ఉండరాదనీ. శాసన సభాధ్యక్షునికి ప్రజాభిప్రాయాలను త్రోసిపుచ్చే నియంతృత్వాధికారాలు ఉండరాదనీ నిబంధనలు తయారుచేశారు.

ఈ చట్టంపై ప్రజాభిప్రాయం (రిఫరెండం) 1946 మేలో తీసుకోబడింది. అధిక సంఖ్యాకులు ఈ చట్టాన్ని త్రోసివేశారు. అందుచే 1946 జూన్‌లో తిరిగి ఎన్నికలు జరిగాయి.

జూన్ ఎన్నికలల్లో కమ్యూనిస్టులతో కలిసి చేతులుకలిపి పనిచేయడానికి బదులు సోషలిస్టుపార్టీ ఎన్నికలలో విడిగా ప్రచారానికి పూనుకొంది. పైగా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికికూడా ఒడిగట్టింది. అందుచే, అభివృద్ధినిరోధక రాజ్యాంగచట్టాన్నికోరే దీగాల్ నాయకత్వాన కన్సర్వేటివ్ ముఠాలు బలపడ్డాయి, కాథలిక్ పార్టీబలపడింది. సోషలిస్టు పార్టీకి మునుపటికన్న తక్కువ వోట్లు వచ్చాయి.

కమ్యూనిస్టు, సోషలిస్టు, కాథలిక్ పార్టీలు కలిపి ఒక కొత్త రాజ్యాంగచట్టం తయారుచేశాయి. ఈ చట్టంలో కమ్యూనిస్టులు రాజీకోసరం అనేక షరతులకు అంగీకరించారు.

ఈ కొత్త చట్టాన్ని అనుసరించి రెండు శాసనసభలు ఉంటాయి. ఒకటి నేషనల్ అసెంబ్లీ. రెండవది కౌన్సిల్ ఆఫ్ రిపబ్లిక్. (సెనేట్). దీనిని ప్రజలు తిన్నగా ఎన్నుకోరు. పట్టణాలలోని పల్లెలలోని మ్యునిసిపల్ జిల్లా బోర్డులు స్థానిక సంస్థలు ఎన్నుకొంటాయి.

ఇదివరలో కమ్యూనిస్టులూ సోషలిస్టులూ కోరింది శాసనసభ అధ్యక్షుని ఒక క్రింది శాసనసభయే ఎన్నుకోవాలని. కాని ఇప్పుడు శాసనసభా, రిపబ్లికూ కలిసి అధ్యక్షుని ఎన్నుకొంటుంది. ఈ అధ్యక్షునికి నియంతృత్వాధికారాలనుకోరారు దీగాల్‌ముఠా. దీగాల్ ప్రధానమున్న కాథలిక్ పార్టీ ఒత్తిడివల్ల కొన్నిఅధికారాలు ఈ అధ్యక్షునికి లభించాయి. కాని అవి శృతిమించకుండా కమ్యూనిస్టులూ సోషలిస్టులూ చూశారు.

శాసనసభా అధ్యక్షుని రెండుశాసనసభలు కలిసి ఎన్నుకొన్నా, క్రిందిసభ (అసెంబ్లీ) ధృవపరిచితేగాని అతడు నిలవడు. అంటే అసెంబ్లీ కిష్టంలేని వాడక్కడ వుండలేడు. రిపబ్లిక్‌కు (యుద్ధానికి పూర్వం వలె) ప్రభుత్వాన్ని కూల్చేహక్కులేదు. కాకపోతే అసెంబ్లీచేసిన చట్టాన్ని ఆమోదించకుండా తిరిగి పరిశీలించమని అసెంబ్లీని అడిగి కోరవచ్చు.

అధ్యక్షునికి ఒక నిరంకుశ అధికారం వుంది. "చట్టవిరుద్ధమైనవి" తీర్మానాలని అధ్యక్షుడు భావించిన వాటిని ప్యాన్‌కాకుండా మొత్తం ప్రజాభిప్రాయానికి (రిఫరెండం) పెట్టవచ్చు. ఇంతేగాక, రెండుసార్లు మంత్రివర్గం పడిపోతే అసెంబ్లీని రద్దుచేసి కొత్తఎన్నికలు అధ్యక్షుడు జరిపించ వచ్చు. కాని రెండేళ్ళవరకూ అలా చేయడానికి ఇప్పుడతనికి ఆ అధికారంలేదు. అప్పుడైనా ప్రధాని అందుకు అంగీకరిస్తేనే అలా చేయాలి.


ఇలాంటి షరతులకు లోబడిన చట్టాన్ని సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాథలిక్ పార్టీ అక్టోబరు 13న ప్రజల వోటింగ్‌కు పెట్టారు. ప్రజాభిప్రాయం అనుకూలంగా వోటు చేసింది. కాని దీగాల్‌ముఠా దీనిని వ్యతిరేకించమని ప్రచారంచేసింది. అందుచే కాథలిక్ పార్టీలో మితవాదులు చాలమంది వోటు చేయలేదు. 1005 (30) మంది వోటింగ్‌లో పాల్గొనలేదు. అయినప్పటికీ ఈ గెలుపు దీగాల్ ముఠాకు తీరని అవమానాన్ని కల్గించింది.

అభివృద్ధినిరోధకుల ఆటలను చూస్తున్న సోషలిస్టుపార్టీ నవంబర్ 10 వ తేదీ ఎన్నికలలోనైనా, వెనుకటి చరిత్రనుండి గుణపాఠం నేర్చుకోలేదు. కమ్యూనిస్టుపార్టీతో చేతులు కల్పకపోగా వ్యతిరేకించింది. తత్ఫలితంగా తిరిగి చాల స్థానాలను కోల్పోయి కార్మికవర్గ బలాన్ని క్షీణింపజేసింది.


కమ్యూనిస్టుపార్టీ ఇప్పుడుకూడా ప్రభుత్వ బాధ్యతను నిర్వహించ సిద్ధంగా వున్నామని తెలియజేసింది. కమ్యూనిస్టులకు సోషలిస్టులిపుడైనా అండగావుండటం తమ విధి.

రేపు నవంబర్ 28 వ తేదీన ఫ్రెంచి శాసనసభాధ్యక్షుని ఎన్నిక, జనవరిలో ఏర్పడే మంత్రివర్గమూ, ఫ్రాన్సు భవిష్యత్‌ను నిర్ణయించే రెండు ముఖ్య ఘటనలు.

దొంగవర్తకులకు ప్రకాశం లొంగుబాటు



బందరు విద్యార్థుల సమ్మె సందర్భంలో హిందూకాలేజీ, హైస్కూలు విద్యార్థుల ప్రదర్శనం



Edited, Printed & Published by Katragadda Ragopala rao at the Prajasakti Press, Moghalarajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE